తర తరాల పిల్లల కథలు
నవచేతన పబ్లిషింగ్ హౌస్
రూ॥70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ట్రంప్‌కు త్వరలో ఇయు ప్రణాళిక
అమెరికాలో ఉక్రేన్ అనుకూల ప్రదర్శనలు
బొలీవియాలో రెండు బస్సులు ఢీ
జపాన్‌లో దావానలం
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 93 | సోమవారం | 03-03-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




కృష్ణా జలాలను ఆంధ్రకు తరలించే కుట్ర పన్ని, రోజా ఇంటికి వెళ్లి రొయ్యల పులుసు తిని, రాయలసీమను రతనాల సీమగా మారుస్తానన్న తెలంగాణ ద్రోహి కెసిఆర్ కాదా? ఎస్ఎల్‌బిసి పనులు ఆపివేయడం వల్లే కుప్పకూలింది. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ పనుల్లో భాగంగా పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ తట్టెడు మన్ను కూడా తీయలేదు. సొరంగం వైపు ఆనాటి సాగునీటి మంత్రి హరీశ్‌రావు ఒక్కసారి కూడా పరిశీలించకపోవడం దురదృష్టకరం. వరంగల్ విమానాశ్రయం మంజూరును నేను తీసుకువస్తే కిషన్‌రెడ్డి తానే తీసుకువచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని కొందరు మంత్రులు వాళ్ల రాష్ట్రాలలో నదులను ప్రక్షాళన చేయడం, మెట్రోలను తీసుకువెళ్తుండగా కిషన్ రెడ్డి మాత్రం మూసీనది ప్రక్షాళన, మెట్రో రైల్‌ను తెలంగాణకు తేవడంలో సహకరించకుండా మోకాలడ్డుతున్నారు.
– సిఎం రేవంత్‌రెడ్డి

# పనులు ఆపడం వల్లే ఎస్ఎల్‌బిసి కూలింది

- గత బిఆర్ఎస్ ప్రభుత్వం తట్టెడు మన్ను కూడా తీయలేదు
- మాజీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు సొరంగంవైపు కన్నెత్తికూడా చూడలే
- కృష్ణా జలాలను ఆంధ్రాకు తరలించేలా కెసిఆర్ కుట్ర పన్నాడు
- పాలమూరును ఎడారిని చేశాడు
- రాష్ట్రంలో పదేళ్ల బిఆర్ఎస్, కేంద్రంలో పన్నెండేళ్ల బిజెపి తోడుదొంగలుగా మారాయి
- వరంగల్ విమానాశ్రయాన్ని తానే తీసుకువచ్చినట్లు కిషన్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నాడు
- మూసీనది ప్రక్షాళన, మెట్రోరైల్‌కు అనుమతులు తేవడంలో సహకరించడంలేదు
- వనపర్తి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ పార్టీ, 12 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తోడు దొంగలుగా మారాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రజా పాలన, ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా వనపర్తి నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం దాదాపు వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయడంతోపాటు మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. గత సిఎం కెసిఆర్ హరికథలు , పిట్ట కథలతో పాలమూరు ప్రజలను మోసం చేసి జిల్లాను ఎడారిగా చేసిన సన్నాసి అని మండిపడ్డారు. అయినా పాలమూరు ప్రజలు కెసిఆర్‌తో పాటు బిఆర్ఎస్‌కు ఎంతో చేశారని పాలమూరు ప్రజల రుణం ఆయన ఏమిచ్చినా తీర్చుకోలేరని తెలిపారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని, కెసిఆర్, కెటిఆర్, అల్లుడు హరీశ్‌రావు, కవిత రావులే లాభపడ్డారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించింది చాలక ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

తరువాయి 2లో

మనుషులు, యంత్రాలతో పాటు

# ఇక రోబోలు

## సహాయక చర్యల్లో వాడండి

- టన్నెల్‌లో మట్టిని బయటకు పంపించేందుకు మరో రెండుమూడు రోజులు
- చిక్కుకుపోయిన 8 మంది ఎక్కడున్నారనేది ఇంకా అంచనాకు రాలేదు
- 11 కేంద్ర ప్రభుత్వ సంస్థలతో నిరంతరాయంగా సహాయక చర్యలు
- పనులు జరుగుతుండగా ఘటన దురదృష్టకరం
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి : టన్నెల్ వద్ద సమీక్ష

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి

నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో గల శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బిసి) సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రమంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లికృష్ణారావు, ఎంపి మల్లురవితో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. గత ఎనిమిదిరోజుల నుండి జరుగుతున్న రెస్క్యూ సహాయకచర్యలపై ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాద స్థలంలో సిఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, ఎస్ఎల్‌బిసి టన్నెల్లో పనులు జరుగుతుండగా ప్రమాదం జరగడం దురదృష్టకరమని, ప్రమాదం జరిగిన గంటనుండి రాష్ట్రమంత్రులను సంఘటన స్థలానికి పంపించి 11కేంద్రప్రభుత్వ సంస్థలతో నిరంతరంగా రెస్క్యూ సహాయక చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. కన్వేయర్‌బెల్టు రిపేరుచేసి టన్నెల్‌లో ఉన్నమట్టిని బయటికి పంపించేందుకు మరోరెండుమూడు రోజులు పడుతుందన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ఎక్కడ ఉన్నారనేది పూర్తిస్థాయిలో అంచనాకు రాలేదని సిఎం తెలిపారు. రెస్క్యూ సహాయక చర్యలకు మనుషులను, మిషన్లతోపాటు రోబోలనుకూడా వాడమని చెప్పానన్నారు. ప్రస్తుతం సహాయక చర్యలలో ఎలాంటి ప్రాణనష్టం కలగకుండా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు చూడాలని అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. సొరంగ మార్గాన్ని 2005లో ప్రారంభించి

తరువాయి 2లో







03
పదేళ్లు పాలించినా సమస్యలు పరిష్కరించని కెసిఆర్
- కెటిఆర్, హరీశ్‌రావు వ్యాఖ్యలు సంస్కారహీనం
- 31 లోగా రైతు భరోసా పూర్తిచేస్తాం
- వనపర్తి సభలో డిప్యూటీ సిఎం భట్టి





03
నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు





05
బద్రీనాథ్‌లో ముగిసిన ఆపరేషన్
- మంచుచరియలు విరిగిపడిన ఘటనలో 8 మంది మృతి





05
జనం అడుక్కోవడానికి అలవాటుపడ్డారు
- బిజెపి నేత వివాదాస్పద వ్యాఖ్యలు

మాధవీ బచ్‌పై ఎఫ్ఐఆర్ 05


భూసేకరణ తరువాతే

# మామునూరు

## రెండున్నరేళ్లల్లో విమానాశ్రయం పనులు పూర్తిచేస్తాం



- ఎంత త్వరగా భూసేకరణ చేస్తే అంత త్వరగా పనులు ప్రారంభం
- భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై సాధ్యాసాధ్యాల పరిశీలన పూర్తి
- అనుమానాల నివృత్తి తరువాత అనుమతులిస్తాం
- విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

భూసేకరణ పూర్తయిన రెండున్నరేళ్లలో వరంగల్ (మామునూరు) విమానాశ్రయం పనులను పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానాయ శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి, తమకు అప్పగిస్తే అంతే త్వరగా పనులను ప్రారంభిస్తామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్ పోర్టు ఏర్పాటు విషయంలో సాధ్యాసాధ్యాల పరిశీలన పూర్తయిందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరింత సమాచారం రావాల్సి ఉన్నదని, కొన్ని అనుమానాలు నివృత్తి కావాల్సి ఉన్నదని, అన్నీ సానుకూలంగా ఉంటే,

తరువాయి 2లో

సినీ కళాకారులకు ఉగాది నుంచి

# గద్దర్ అవార్డులు

ఏటా అధికారికంగా భక్త రామదాసు జయంతి ఉత్సవాలు

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కళలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

తమిళనాడు తిరువయ్యార్‌లో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాల తరహాలోనే ఇకపై ప్రతిఏటా తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా 'భక్త రామదాసు జయంతి' ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. కళాకారులను ప్రోత్సహించేందుకు ఉగాది పండగ నుంచి సినీ కళాకారులకు గద్దర్ పేరుతో 'గద్దర్ ఫిలిం' అవార్డులను ప్రదానం చేయనున్నట్టు పునరుద్ఘాటించారు. ప్రజా ప్రభుత్వం కళలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదన్నారు. హైదరాబాద్

తరువాయి 2లో

ప్రపంచంలో 40 శాతం ప్రజలకు

# మాతృభాషలో విద్యలేదు



- యునెస్కో నివేదికలో వెల్లడి
- అధ్యయనస్థాయి క్షీణించింది
- అనర్గళ పఠనం– గణితశాస్త్రం పై అవగాహనలేదు

**న్యూఢిల్లీ :** ప్రపంచదేశాలలో 40 శాతం ప్రజలకు మాతృభాషలో విద్య అందుబాటులో లేదని యునెస్కో 'జెమ్' (ప్రపంచ విద్యాపర్యవేక్షణ) బృందం తన నివేదికలో వెల్లడించింది. మాతృభాషపాత్ర గురించి ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలలో ఒకవైపు అవగాహన పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వాలు విధానపరమైన చర్యలను చాలా పరిమితంగా తీసుకుంటున్నాయని పేర్కొంది. అంతర్జాతీయ 25వ మాతృభాషా దినోత్సవం సందర్భంగా, "భాషల విషయం–బహుభాషావిద్యపై ప్రపంచ మార్గదర్శకత్వం'' అనే పేరుతో యునెస్కో 'జెమ్' బృందం ఈ నివేదిక విడుదల

తరువాయి 12లో

సామాజిక మాధ్యమం..

# నేరాల మయం

- అందినంత దోచుకోవడం.. కుదరకుంటే మానసికంగా హింసించడం
- రూటుమారుస్తున్న మాయగాళ్లు
- సామాన్యుల నుంచి సంపన్నుల వరకు బాధితులే

ప్రజాపక్షం/హైదరాబాద్

రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు.. పరువు తీసేలా మార్ఫింగ్ ఫొటోలు.. కన్నీరు కురిపించే కట్టుకథలు, ఆపదలో ఉన్నానంటూ కల్లబొల్లి కబుర్లు.. అంశం ఏదైనా లక్ష్యం మాత్రం అందినంత దండుకోవటం. కుదరకుంటే అవతలి వారిని మానసికంగా దెబ్బతీయటం, వీటికి సామాజిక మాధ్యమాలు వేదికగా మారాయి. దూరాలను దగ్గర చేసిన ఈ వేదికలు ప్రస్తుతం నేరవలయంగా తయారయ్యాయి. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరూ బాధితులవుతున్నారు. నగర సైబర్ క్రైమ్ ఠాణాలో గతేడాదిలో 3000కుపైగా సైబర్ నేరాల కేసులు నమోదు చేశారు. వీటిలో 400కుపైగా ఫిర్యాదులు సామాజిక మాధ్యమాల వేదికగా చోటుచేసుకున్నవే. రాజస్థాన్ భరత్‌పూర్ కేంద్రంగా సైబర్ నేరస్థులు గతంలో సినీ, రాజకీయ, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఫోన్ నెంబర్లు,



తరువాయి 2లో

గాజాలోకి సహాయం

# అడ్డుకున్న ఇజ్రాయెల్

- ఇది చౌకబారు ఎత్తుగడ : హమాస్ విమర్శ
- రెండోదశ కాల్పుల విరమణ వైఫల్యబాధ్యత వారిదే

**టెల్అవీవ్ :** గాజాలోకి ప్రవేశిస్తున్న మానవతా సహాయాన్ని ఇజ్రాయెల్ సైన్యం మరోసారి అడ్డుకుంది. ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ కార్యాలయం ఆదివారంనాడు ఈ ప్రకటన చేసింది. అమెరికా చెప్పినవిధంగా మొదటి విడత కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు అంగీకరించాలని డిమాండ్ చేస్తూ ఇజ్రాయెల్ ఈ నిర్ణయం తీసుకుంది. హమాస్ దీనిని చౌకబారు ఎత్తుగడగా విమర్శించింది. దీంతో జనవరి 19 నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత గాజాలోకి సుమారు 600 వాహనాలలో ప్రతిరోజూ వస్తున్న మానవతాసహాయానికి అడ్డుకట్టపడింది. ఆదివారం నుండే మానవతాసహాయాన్ని అడ్డుకుంటామని చెప్పినప్పటికీ తక్షణం ఆ ప్రభావం కనిపించిందా? అనే విషయంపై స్పష్టత రాలేదు. అమెరికా కూడా దీనిపై ఇంకా స్పందించలేదు.



మొదటిదశ కాల్పుల విరమణ ఒప్పందం మార్చి 1వ తేదీతో ముగిసింది. ఐతే పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న ఇజ్రాయెల్–హమాస్, దానిని కొనసాగించే విషయంపై చర్చల్లో ఒప్పందం చేసుకోవడంలో విఫలమయ్యాయి. అమెరికా చెప్పినట్టు మొదటిదశ కాల్పుల విరమణ ఒప్పందాన్ని రెండోదశలో కూడా కొనసాగించాలని ఇజ్రాయెల్ పట్టుబట్టగా, అందుకు హమాస్ తిరస్కరించింది. రెండోదశ కాల్పుల విరమణ ప్రక్రియపై తాజాగా చర్చలు కొనసాగాలని

తరువాయి 12లో


సబ్ ఎడిటర్లు కావలెను
ప్రజాపక్షం దినపత్రికలో
సబ్‌ఎడిటర్లుగా, ట్రైనీ జర్నలిస్టులుగా పనిచేయుటకు ఆసక్తిగల వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము.
ఇంగ్లీషు నుండి న్యూస్ ఐటమ్స్ తర్జుమా చేయగలిగిన, ఎడిట్ చేయగలిగిన వారికి సబ్‌ఎడిటర్లుగా ప్రాధాన్యత ఇవ్వబడును
రిటైర్డ్ జర్నలిస్టులకు ప్రాధాన్యత ఉంటుంది. తెలుగులో డిటిపి నేర్పరితనం ఉండాలి.
ట్రైనీలకు శిక్షణ కాలంలో స్టైయిఫెండ్ ఇవ్వబడును
సాయంత్రం 4-5 గంటల మధ్య మా కార్యాలయములో ఎడిటర్‌ను స్వయంగా కలుసుకోవచ్చు.
PRAJAPAKSHAM DAILY
12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post, Hyderabad - 500068, Telangana.
Ph: 9948228914 E-Mail: editorprajapaksham@gmail.com

# ట్రంప్‌కు త్వరలో ఇయు ప్రణాళిక



## ఉక్రేన్‌కు 2.85 బి.డా బ్రిటన్ రుణం

## లండన్‌లో జెలెన్‌స్కీకి ఘన స్వాగతం



**లండన్ :** వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో అరుపులాట (షౌటింగ్ మ్యాచ్) తర్వాత ఆదివారంనాడు లండన్‌లో యూరోపియన్ యూనియన్ శిఖరాగ్రసభకు వచ్చిన ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీకి ఘన స్వాగతం లభించింది. తొలుత ఆయన టెన్ డౌనింగ్ స్ట్రీట్‌లో ఉన్న బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ నివాసానికి వెళ్ళి ఆయనతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఉక్రేన్‌కు 2.85 బిలియన్ డాలర్ల రుణం ఇస్తున్నట్లు స్టార్మర్ ప్రకటించారు. ఈ రుణాన్ని ఉక్రేన్ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఉపయోగించుకుంటామని జెలెన్‌స్కీ ప్రకటించారు. ఉక్రేన్‌లో స్థిరమైన శాంతిసాధనకు తమకు ఇదొక మంచి అవకాశమని స్టార్మర్ అన్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, ఉక్రేన్ మూడుదేశాలూ కలిసి రష్యా దురాక్రమణను నియంత్రించేందుకు ఒక కాల్పుల విరమణ ఒప్పందం ప్రణాళిక రూపొందించేందుకు కృషి చేయాలని నిర్ణయించుకున్నామని, ఫ్రాన్స్ తోకలిసి ఈ శాంతి ప్రణాళికను అమెరికాకు అందజేస్తామని స్టార్మర్ ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ విషయంలో తాము ఉమ్మడిగా కదలాల్సిన అవసరం ఉందని, ఈ చివరిఘట్టంలో శాంతికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. దీర్ఘకాలం చెల్లుబాటయ్యే ఒక శాంతి ఒప్పందాన్ని మాత్రమే డోనాల్డ్ ట్రంప్ సమ్మతిస్తారని స్టార్మర్ అభిప్రాయపడ్డారు. తమ నాలుగు దేశాలూ కలిసి చర్చించుకున్న తర్వాత ఈ నిర్ణయానికి వచ్చినట్లు స్టార్మర్ చెప్పారు. అదేవిధంగా ఉక్రేన్‌కు చెక్కుచెదరని భద్రతా భరోసాను అమెరికా ఇవ్వాల్సిన అవసరం ఉందని మరోసారి ఆయన నొక్కి చెప్పారు. అనంతరం స్టార్మర్ ఆతిథ్యం ఇచ్చిన శిఖరాగ్ర సదస్సులో యూరప్ నాయకులు పాల్గొంటారు. వైట్‌హౌస్‌లో ఘటన తర్వాత పరిణామాలు, ఉక్రేన్‌కు రక్షణపరంగా మద్దతు ఇవ్వడం, ట్రంప్‌తో తదుపరి సంబంధాలు, సంభాషణలు వంటి అనేక అంశాలనే ప్రధానంగా ఈ సదస్సులో చర్చిస్తారు. వైట్‌హౌస్‌లో పరిణామాలపై చర్చించేందుకు యూరప్ కీలక నాయకులు స్టార్మర్ ఆహ్వానం మేరకు లండన్‌కు చేరుకున్నారు. ట్రంప్‌తో సంబంధాలు సరిదిద్దుకోవాలని జెలెన్‌స్కీని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్టే కోరారు.ఈ సమస్య పరిష్కరించగలదని జెలెన్‌స్కీ అన్నారు. ఉక్రేన్ విషయంలో బ్రిటన్, ఇటలీ దేశాలు ఒకే అభిప్రాయంతో ఉన్నాయని ఆ దేశ ప్రధానమంత్రి జార్జ్ మెలోనీ అన్నారు. ఆదివారంనాడు మెలోనీ స్టార్మర్‌లు విడిగా సమావేశం జరిపారు. యుద్ధంతో అతలాకుతలమైన ఉక్రేన్‌లో శాంతి సాధన అంశం ట్రంప్ వైఖరితో యూరోపియన్ యూనియన్ నాయకులకు సవాలుగా మారింది. ఇప్పుడు యూరప్‌కు నిజమైన సమస్య వచ్చిందని, ఇప్పుడు లండన్‌లో సదస్సుకు అత్యధిక ప్రాధాన్యత ఏర్పడిందని బ్రిటన్ జాతీయ భద్రతా మాజీ సలహాదారు పీటర్ రికెట్స్ అన్నారు.

**ట్రంప్ బ్రిటన్ పర్యటన వాయిదా!**

వైట్‌హౌస్‌లో జెలెన్‌స్కీతో వాగ్వాద ఘటన అనంతరం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్రిటన్ పర్యటనను వాయిదా వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వంలో సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. శుక్రవారం నాడు జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీకి కొద్ది గంటల ముందుగా బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో ట్రంప్ మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా రెండోవిడత అధ్యక్షపదవిలో ఉండగా మరోసారి బ్రిటన్‌లో పర్యటించాలని ట్రంప్‌ను స్టార్మర్ ఆహ్వానించారు. బ్రిటన్ రాజు ఛార్లెస్ తరఫున ఆయన ఈ ఆహ్వానం అందజేశారు. దీంతో బ్రిటన్‌లో ట్రంప్ పర్యటనకోసం సైనిక,రాజకీయస్థాయిలో ఏర్పాట్లకు సన్నాహాలు చేద్దామనుకున్నారు. కానీ ఉక్రేన్‌కు రష్యా నుండి గట్టి భద్రతాపరమైన భరోసా ట్రంప్ నుండి వచ్చేవరకు బ్రిటన్‌లో ట్రంప్ పర్యటనకు సంబంధించిన అధికారిక ఏర్పాట్లు చేయకూడదన్న నిర్ణయం వెలువడింది.

ప్రపంచం

# అమెరికాలో ఉక్రేన్ అనుకూల ప్రదర్శనలు

## జనం కళ్ళుగప్పి వేరేచోటుకు జె.డి.వాన్స్ హాలిడే ట్రిప్




**వాషింగ్టన్ :** అమెరికాలో ఆదివారంనాడు ఉక్రేన్ అనుకూల ప్రదర్శనలు జరిగాయి. రష్యాను అడ్డుకోవాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. వైట్‌హౌస్‌లో గడచిన శుక్రవారంనాడు ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీతో చర్చల సందర్భంగా అమెరికా అధ్యక్ష–ఉపాధ్యక్షులు డి.ట్రంప్, జె.డి.వాన్స్ ఇద్దరూ వాగ్వాదంతో ప్రపంచాన్ని ఆశ్చర్యపోయేట్టు చేశారు. వాన్స్ హద్దుమీరి ప్రవర్తించారని ప్రదర్శకులు విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగాఉక్రేన్‌పట్ల సానుభూతి పవనాలు వెల్లువలా వీస్తున్నాయి. లండన్‌లో కూడా జెలెన్‌స్కీకి ఘన స్వాగతం లభించింది. ఇప్పుడు ఆయన హీరోగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో ఉక్రేన్ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని, రష్యా ఆక్రమణ చర్యలు అడ్డుకోవాలని కోరుతూ అమెరికా వ్యాప్తంగా ప్రదర్శనలు జరిగాయి. అదేవిధంగా టెస్లా స్టోర్స్ వద్ద కూడా ప్రదర్శకులు గుమిగూడి పొదుపు చర్యల పేరుతో తీసుకుటున్న ఆయన నిర్ణయాలపట్ల నిరసన తెలియజేశారు.న్యూయార్క్, లాస్‌ఏంజెల్స్, బోస్టన్ నగరాలలో వందలమంది ప్రదర్శకులు ఉక్రేన్‌కు అనుకూలంగా బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీలు జరిపారు. స్కై హాలీడే నిమిత్తం ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ కుటుంబ సమేతంగా పర్యటన చేస్తున్న వెయిట్స్‌ఫీల్డ్, వెర్మోంట్‌లలో వందలమంది ప్రదర్శకులు ఉక్రేన్‌కు అనుకూలంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ రోడ్లకు ఇరువైపులా క్యూలు కట్టి నిలబడి నిరసన తెలియజేశారు. దీంతో నిర్ణీత ప్రకారం కాకుండా అక్కడే వేరే ప్రాంతాలకు స్కై హాలిడేలో మార్పులు చేసుకుని నిరసన ప్రదర్శకులకు కనిపించకుండా జె.డి.వాన్స్ కుటుంబ సమేతంగా వేరే ప్రాంతాలకు వెళ్ళిపోయారు.వాన్స్‌వెంట భార్య ఉష, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ''నా దృష్టిలో శుక్రవారం వైట్‌హౌస్‌లో జరిగిన ఘటన మరింతమంది ప్రజలు ట్రంప్–వాన్స్‌కు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చేందుకు ఆజ్యం పోశాయి'' అని ఈ ప్రదర్శన నిర్వహించిన 'ఇన్‌డివిజిబుల్ మ్యాడ్ రివర్ వ్యాలీ' గ్రూప్‌నకు చెందిన జూడీ డాలీ వెర్మోంట్ రేడియో ఇంటర్వ్యూలో చెప్పారు. వెర్మోంట్ గవర్నర్ ఫిల్ స్కాట్ మాట్లాడుతూ దేశ ఉపాధ్యక్షుడిపట్ల గౌరవభావంతో మెలగాలని కోరారు. ఐతే రిపబ్లికన్లు మాత్రం జెలెన్స్కీపై ట్రంప్–వాన్స్ వాగ్వాదంపట్ల హర్షం ప్రకటిస్తున్నారు.

# బొలీవియాలో రెండు బస్సులు ఢీ



## 37 మంది మృతి

**సూక్రె :** దక్షిణ అమెరికా మధ్యభాగంలో ఉండే దేశం బొలీవియాలో ఆదివారంనాడు ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రెండు ప్రయాణికుల బస్సులు ఢీకొట్టుకోవడంతో 37 మంది మరణించారు. మరో 39 మంది గాయపడ్డారు. లాటిన్ అమెరికాలో జరుగుతున్న ఉత్సవాలకు వెళుతున్న సమయంలో ఉయిని, కొల్చాని రహదారిపై రెండు బస్సులు ఎదురురెదురుగా వచ్చి ఢీకొట్టుకోవడంతో మరణాలు సంభవించాయి. వీటిల్లో ఒక బస్సు అదుపుతప్పి లోయలో పడింది. ఈ బస్సులోవారే ఎక్కువమంది మరణించారు. ఈ రెండు బస్సులూ దక్షిణ బొలీవియాకు చెందిన ప్రభుత్వరంగ బస్సులే. ఈ రహదారి నిరంతరం చాలా రద్దీగా ఉంటుంది. రహదారి కూడా సరిగ్గా ఉండదు.

# జపాన్‌లో దావానలం

## 80 భవంతులు ధ్వంసం



**టోక్యో :** జపాన్‌లో చాలా దశాబ్దాల తర్వాత మళ్ళీ దావానలం రగులుకుంది. అఫునటో ప్రాంతంలో దావానలం చెలరేగడంతో 80 భవంతులు ధ్వంసమయ్యాయి. వేలాదిమంది ప్రజలు ఇళ్ళు వదిలి సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. సైనిక హెలికాప్టర్లను యుద్ధప్రాతిపదికపై రంగంలోకి దించారు. దావాగ్నిని నియంత్రించేందుకు అగ్నిమాపకదళాలు కృషి చేస్తున్నాయి. గడచిన మూడు దశాబ్దాలలో జపాన్ దేశం ఇంతటి దావానల విలయాన్ని చవిచూడలేదు. హక్కైడోలోని కుషిరోలో 1992లో చెలరేగిన దావానలంకంటే తీవ్రస్థాయిలో ఈ దావాగ్ని చెలరేగింది. స్వతంత్ర మనాకో ప్రాంతానికంటే మూడురెట్లు విస్తారమైన భూభాగంలో ఈ దావాగ్ని చెలరేగిందని అఫునటో మేయర్ చెప్పారు.

# అమెరికా అధికార భాషగా ఇంగ్లీషు



**వాషింగ్టన్ :** అమెరికా అధికారభాషగా ఇంగ్లీషును ప్రకటిస్తూ సంబంధిత ఉత్తర్వుల ఫైలుపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఆంగ్లభాషలో తక్కువ ప్రావీణ్యం ఉన్నాగానీ అధికారిక సేవలు అందించేందుకు వీలు కల్పిస్తూ గత జో బైడెన్ ప్రభుత్వం జారీ చేసిన అధికారిక ఉత్తర్వులను దీంతో ట్రంప్ రద్దుచేసినట్లయింది. ''అమెరికా గణతంత్రవ్యవస్థ ఆవిర్భవించినప్పటినుండీ అన్నీ ఆంగ్లభాషలోనే రాసుకున్నాం, మన రాజ్యాంగంతోపాటు స్వాతంత్ర్య ప్రకటన, కీలకమైన డాక్యుమెంట్లు, జాతీయ చరిత్ర అన్నీ ఇంగ్లీషుభాషలోనే గ్రంథస్థమయ్యాయి. అందువల్ల దీర్ఘకాలంగా దేశంలో ఇంగ్లీషే అధికారిక భాషగా చలామణీలో ఉంది. అమెరికా సంయుక్త రాష్ట్రాల ఐక్యతకు, సమర్థవంతమైన సమాజానికి కీలకం ఆంగ్లభాషే, తమకెంతో ప్రీతిపాత్రమైన ఆంగ్లభాషలో ఆలోచనలను పరస్పరం పంచుకోవడం ద్వారా అమెరికా ప్రజలు దేశాన్ని పటిష్ఠం చేస్తున్నారు. అందువల్ల ఆమెరికాలో ఇంగ్లీషుభాషే అధికారిక భాషగా ఉంటుంది'' అని ట్రంప్ తన కార్యనిర్వాహక ఉత్తర్వులలో స్పష్టం చేశారు.

# ఎస్ఎల్‌బిసి కూలింది

(మొదటి పేజీ తరువాయి)




14 నెలలో తెలంగాణ అభివృద్ధిని, సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేక, కడుపు మంటలో అవాకులు, చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా జలాలకు ఆంధ్రకు తరలించే కుట్ర పన్నిన కెసిఆర్ రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని రోజా ఇంటికి వెళ్లి భోజనం చేసి వచ్చిన తెలంగాణ ద్రోహి కెసిఆర్ అని సిఎం విమర్శించారు. ఎస్ఎల్‌బిసి పనులు ఆపివేయడం వల్లే కుప్పకూలిపోయింది. సొరంగ మార్గాన్ని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసి ప్రమాదాలకు కారణమైన బిఆర్ఎస్ ప్రభుత్వం తమ ప్రభుత్వంపై బురదజల్లడం హేయమైనదని తెలిపారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ పనుల్లో భాగంగా పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ తట్టేడు మన్ను కూడా తీయలేదని, ఆ సొరంగం వైపు నాటి సాగునీటి మంత్రి హరీశ్ రావు ఒక్కసారి కూడా పరిశీలించపోవడం దురదృష్టకరమని ముఖ్యమంత్రి విమర్శించారు. వరంగల్ విమానాశ్రయం మంజూరును నేను తీసుకువస్తే కిషన్ రెడ్డి తానే తీసుకువచ్చినట్లు గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంలోని కొందరు మంత్రులు నదులను ప్రక్షాళన చేయడం మెట్రోలను తీసుకవెళ్తుండగా కిషన్ రెడ్డికి మాత్రం మూసీనది ప్రక్షాళన మెట్రో రైల్‌ను తెలంగాణకు తేవడంలో సహకరించడం లేదని విమర్శించారు. మూసీనది ప్రక్షాళన మెట్రో తేవడానికి తాము ప్రయత్నిస్తుంటే కిషన్ రెడ్డి మోకాలడ్డుతూ తెలంగాణ ద్రోహిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి అభివృద్ధిపై సమీక్షించేందుకు హైదరాబాద్‌కు వస్తే కిషన్ రెడ్డి సమావేశానికి డుమ్మా కొట్టి తన నైజాన్ని చాటుకున్నాడని, కిషన్ రెడ్డి చేసే కుట్రలకు భయపడేది లేదని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కెసిఆర్ లోపాయి కారి సంబంధాలు పెట్టుకున్న కిషన్ రెడ్డి సైంధవ పాత్ర పోషిస్తున్నాడని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటికి 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా తెలంగాణలో మాత్రం కిషన్ రెడ్డి , బండి సంజయ్‌లకు ఇద్దరికి ఉద్యోగాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. 14 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చి దేశ చరిత్రలోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘనతను చాటిందన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. వెయ్యి బస్సులను స్వయం సహాయక మహిళలతో కొనుగోలు చేయించి ఆర్‌టిసికి అద్దెకు ఇచ్చేలా చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. అంబాని, అదానిలే కాదు స్వయం సహాయక మహిళలు కూడా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. హైటెక్ సిటి, శిల్పారామం పక్కనే స్వయం సహయక మహిళల అభివృద్ధి కోసం 150 స్టాళ్లను ఏర్పాటు చేసామని ఇది ఐటి సంస్థల పక్కనే మూడున్నర ఎకరాల స్థలం ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తిలో నా అనుబంధం విడదీయరానిదని అందులో భాగంగానే మహిళలకు వెయ్యి కోట్లు రూపాయల రుణాలను పంపిణీ చేశామన్నారు. ఎన్నికల వాగ్దానంలో భాగంగా మహిళలకు 450 కోట్ల రూపాయలు వెచ్చించి 150 కోట్ల మంది ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం చేశారని, ఈ మహిళలే బిఆర్ఎస్ , బిజెపికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. పేదింటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 550 రూపాయలకే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోత లేకుండా 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతులకు రూ.7,625 కోట్లు రైతు భరోసా నిధులు , రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. 25 లక్షల 50వేల మంది రైతులకు రూ.22వేల కోట్ల రుణమాఫీ అందించామని సిఎం తెలిపారు.

# ఇక రోబోలు

(మొదటి పేజీ తరువాయి)

2014వరకు 32కిలోమీటర్ల టన్నెల్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తి చేయడం జరిగిందని, ప్రపంచంలోనే అతిపెద్ద టన్నెల్ ప్రాజెక్టు అని, అయితే 2014లో టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి రెండుకిలోమీటర్ల పనులు కూడా చేయలేదని, కనీసం ప్రాజెక్టుకు సంబంధించిన విద్యుత్‌బిల్లులుకూడా చెల్లించలేదని, మిషనర్లకు విద్యుత్ సరఫరాను కట్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంవచ్చి పది సంవత్సరాలు పెండింగ్‌లో ఉన్న విద్యుత్‌బిల్లులను చెల్లించి సాంకేతిక నిపుణులతో చర్చించి టన్నెల్ పూర్తికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుభవాన్ని ఉపయోగించుకొని అమెరికా నుండి స్పేర్‌పార్ట్స్ తెప్పించి తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ప్రతిపక్షాలు రాజకీయాలకు అతీతంగా సలహాలు సూచనలు ఇవ్వాలని, సానుభూతిచూపాలని రాష్ట్రంలో ప్రతిపక్షపార్టీ నాయకులు రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరమన్నారు. ఫిబ్రవరి 22న అనుకొని ప్రమాదంలో ఎనిమిదిమంది గల్లంతు కావడం దురదృష్టకరమన్నారు. ప్రమాదం జరిగిన రోజునుండి 11 కేంద్రప్రభుత్వ సంస్థలు రెస్క్యూ సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగించినందుకు ముఖ్యమంత్రి తరపునవారిని అభినందించారు. గత ప్రభుత్వంలో జరిగిన విపత్తులవద్దకు ప్రతిపక్ష హోదాలో మేము వెళుతుంటే సంఘటన స్థలానికి వెళ్లనీయలేదని ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంమాత్రం ఎస్ఎల్‌బిసివద్దకు వెళ్లనివ్వడంతోపాటు సలహాలు సూచనలు ఇవ్వాలని తెలపడం జరి గిందన్నారు. వారుమాత్రం రాజకీయంగా వాడుకోవడం దురదృష్టకరమన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే టన్నెల్ రంగంలో అనుభవజ్ఞులైన వారు ఇక్కడ ఉన్నారని 20సంవత్సరాలుగా ఎస్ఎల్‌బిసి పనులు జరుగుతున్నాయని, పాలమూరు నల్గొండకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ మారుమూల ప్రాంతంలో సహకరించిన ప్రతి ఒక్కరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం వెంట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, స్పెషల్‌చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, జిల్లాకలెక్టర్ బదావత్‌సంతోష్, ఎస్‌పి రఘునాథ్‌గైక్వాడ్, జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు.

# నేరాల మయం

(మొదటి పేజీ తరువాయి)

ఫొటోలను ఉపయోగించుకొని సొమ్ము కొట్టేసేవారు. ప్రముఖుల ఫొటోలను వాట్సాప్ డిపిగా ఉపయోగించి ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా వారి పేర్లతో తాము అత్యవసర పరిస్థితుల్లో ఉన్నామని.. డబ్బు కావాలంటూ నగదును తమ బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయించుకునేవారు. వీటిపై అవగాహన పెరగటంతో ఇప్పుడు రూటు మార్చారు. అందమైన యువతుల నగ్న వీడియోల లింక్‌లను వాట్సాప్ నెంబర్లకు పంపుతున్నారు. పూర్తి వీడియో చూడాలనే ఆసక్తితో లింక్‌ను క్లిక్ చేసిన వారి వాట్సాప్ ఖాతాలు సైబర్ నేరస్థుల చేతుల్లోకి వెళుతున్నాయి. బాధితులు తమ ఖాతాలను పునరుద్ధరించుకునే అవకాశం లేకపోవటాన్ని అవకాశంగా చేసుకుంటున్నారు. అందులోని కాంటాక్టు నెంబర్లకు సందేశాలు పంపి ఆసుపత్రిలో ఉన్నామని, దూరప్రాంతాలకు వెళితే అక్కడ నగదు చోరీ అయినట్టు మాయమాటలతో బాధితుల స్నేహితులు, బంధువుల నుంచి నగదు కాజేస్తున్నారు. తెలిసిన నెంబర్ నుంచే సందేశం రావటంతో తేలికగా నమ్ముతున్నారు.

**ఫేస్‌బుక్ ఖాతాలతో విచిత్రాలెన్నో..**

వాడకంలో లేని ఫేస్‌బుక్ ఖాతాలు మరుగున పడుతుంటాయి. వీటిని హ్యాక్ చేసిన నైజీరియన్లు ఫ్రెండ్స్ జాబితాలోని వారి నుంచి నగదు వసూలు చేస్తున్నారు. కొన్నిసార్లు నగ్న ఫొటోలు, వీడియోలు ఉంచి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఖాతాలను తొలగిస్తే చాలంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దుబాయ్, సింగపూర్ తదితర దేశాల్లో ఉంటూ స్థానిక యువతకు డబ్బు పంపి సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ ఛానళ్లు నడుపుతున్న ప్రబుద్ధులున్నారు. సున్నితమైన విషయాలను రెచ్చగొట్టేలా వీడియోలు, పోస్టులు రూపొందించడమే వీరి ఎజెండా. గతేడాది నగరంలో రెండు వర్గాల మధ్య గొడవలు పెట్టేందుకు దుబాయ్ నుంచి ఇదే తరహా ఎత్తులు వేసిన పాతబస్తీ యువకుడిని ఇటీవలే పోలీసులు అరెస్ట్ చేశారు. టెలిగ్రాం, ఇన్‌స్టా ఉపయోగించేవారు క్రమంగా పెరుగుతున్నారు. ఈ యాప్‌లను వేదికగా మలచుకొని ముంబయి, బెంగళూరు, ఢిల్లీకి చెందిన డ్రగ్స్ ముఠాలు లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల టీజీన్యాద్‌కు పట్టుబడిన ముఠాల్లో అధికభాగం వీటి ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు అంగీకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే సోషల్ మీడియాలో జరుగుతున్న నేరాలు వందలు వేలు ఊహించటానికి కూడా వీలులేని విషయాల్లో సైబర్ క్రైమ్ నేరస్తులు రెచ్చిపోయి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ సోషల్ మీడియా విష వలయంలో ఎక్కువసేపు గడపకుండా ఉంటే మంచిది. ఒక వేళ గడిపినా అవసరమైన వాటికి సోషల్ మీడియాని ఉపయోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రతి వెయ్యి మంది నవజాత శిశువులో

# ఐదు మందికి వినికిడి లోపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతి వెయ్యి మంది నవజాత శిశువులలో ఐదుగురు శాశ్వత వినికిడి లోపంతో జన్మిస్తున్నారని ప్రముఖ ఆడియోలజీ డాక్టర్ సతీష్ సకినాల ఆందోళన వ్యక్తం చేశారు. టీకాల తరహా శిశువులకు తప్పనిసరిగా వినికిడి పరీక్షలను నిర్వహించాలని, తద్వారా వినికిడి సమస్యను ముందే గమనిస్తే తగిన వైద్య చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. శిశువులకు టీకాలతో పాటు వినికిడి పరీక్షలు తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. 2024 అధ్యయనం ప్రకారం దేశ వ్యాప్తంగా ప్రతి 1,000 మంది నవజాత శిశువులలో, ఐదుగురు శాశ్వత వినికిడి లోపంతో జన్మించారన్నారు. ప్రతి మార్చి 3న 'చెవి,ముక్కు,గొంతు(ఇఎన్‌టి) డే ' గా నిర్వహిస్తారని, ఈ ఏడాది నుంచైనా శిశువులకు కూడా వినికిడి లోపం పరీక్ష నిర్వహించేలా అందరూ కృషి చేయాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్లోబల్ జాయింట్ కమిటీ ఒక నెల వయస్సులో వినికిడి స్క్రీనింగ్, రెండు నెలల వయస్సులో ఆడియోలాజికల్ డయాగ్నసిస్ చేపట్టాలని సూచిస్తుందని పేర్కొన్నారు. పేద,మధ్యతరగతి వర్గాలలో ముందే వినికిడి సమస్యను గుర్తించి, వినికిడి ఉన్నట్టుగా ధృవీకరిస్తే , వాటి ఆధారంగా ప్రభుత్వం అందజేసే పెన్షన్‌ను పథకాన్నిఅమలు చేస్తారని, తద్వారా ఆకుటుంబాలకు కొంత వరకు ఆర్థిక భారం తగ్గుతుందని డాక్టర్ సతీష్ సకినాల సూచించారు.

# మామునూరు

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే ఎయిర్‌పోర్ట్‌కు అనుమతినిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ కవాడిగూడలోని కేంద్ర ప్రభుత్వ సముదాయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. వరంగల్ ఎయిర్ పోర్టుకు కావాల్సిన భూసేకరణ విషయంలో గత రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందకపోవడంతోనే ఆలస్యం జరిగిందని అన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు 2800 మీటర్ల రన్ వే కావాల్సి ఉంటుందని, ఇందుకు 280 ఎకరాలు అదనంగా భూసేకరణ చేయాల్సి ఉంటుందని వివరించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిమాండ్ వరంగల్ ప్రజల చిరకాల కోరిక అని, వారి డిమాండ్ మేరకే వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతి లభించిందన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఎన్‌ఒసి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించిందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా జోక్యం చేసుకున్నదని తెలిపారు. వరంగల్‌లో ఎయిర్ పోర్ట్ ఏర్పడితే ప్రపంచంలోని ప్రధాన నగరాలతో భవిష్యత్‌లో వరంగల్ పోటీ పడే పరిస్థితి వస్తుందన్నారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తే దాని ప్రభావం చుట్టు పక్కల ప్రాంతాలపై పడుతుదని, రియల్ ఎస్టేట్, ఆర్థిక వ్యవహారాలు పెరుగుతాయని, ప్రాంతాల రూపురేఖలు మారుతాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. వరంగల్ చరిత్ర సాంస్కృతి ప్రతిబింబించేలా వరంగల్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని, భూసేకరణ పూర్తయిన తరువాతనే ఎయిర్‌పోర్ట్ నిర్మాణ వ్యయానికి అంచనా రావొచ్చని తెలిపారు. 1998 సంవత్సరంలో శంషాబాద్‌లో ఎయిర్‌పోర్టును నిర్మించాలని అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు విత్తనం వేశారన్నారు. ఏవియేషన్ పరిశ్రమలను హైదరాబాద్ పరిసరాలలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. వీలైనంత త్వరలో హైదరాబాద్‌లో ఉడాన్ స్కీమ్‌ను ప్రారంభిస్తామన్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిమిత్తం గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాధించిన స్థలం ఎయిర్‌పోర్ట్‌కు అనుకూలం కాదని తేలిందని, దీంతో మరో స్థలాన్ని ప్రతిపాదించారని, అందుకే ఆలస్యం జరిగిందని వివరించారు.

**రామగుండం,నిజామాబాద్‌లో కొత్త ఎయిర్‌పోర్ట్‌కు సిద్ధమే**

రామగుండం, నిజామాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో భౌగోళిక పరంగా సాధ్యాసాధ్యాలపై తమ సాంకేతిక బృందం సర్వే చేస్తుందని, సర్వే నివేదిక వచ్చిన వెంటనే ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎపి సిఎం చంద్రబాబు సూచన మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకుని తాను పనిచేస్తున్నానని, తన హయాంలోనే వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతి లభించడం సంతోషమని చెప్పారు. వరంగల్ ఎయిర్‌పోర్టు గతంలో ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌గా ఉండేదని, 1981 వరకూ అక్కడ ఏదో ఒక కార్యాకలాపాలు జరిగేవని తెలిపారు. మెట్రో నగరాలలో అదనంగా మరో ఎయిర్‌పోర్ట్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ పెరుగుతుందని, ఇందులో భాగంగానే బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు కూడా భవిష్యత్‌లో డిమాండ్ పెరిగి వినియోగంలోనికి వచ్చే అవకాశాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు.

**వరంగల్ విమానాశ్రయాన్ని ఉడాన్ స్కీమ్‌తో అనుసంధానం చేస్తాం : కిషన్ రెడ్డి**

వరంగల్ విమానాశ్రయాన్ని ఉడాన్ స్కీమ్‌తో అనుసంధానం చేస్తూ, కమర్షియల్ ఆపరేషన్స్‌కు సంబంధించి అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ఎపిలో ఏడు ఎయిర్‌పోర్టులు ఉంటే, తెలంగాణలో ఒకటే ఉన్నదని, వరంగల్‌లో రెండవది ఏర్పాటు కానుందని అన్నారు. చరిత్రాత్మకమైన ఓరుగల్లు పట్టణానికి విమాన సేవలను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. విమానాశ్రయం ఏర్పాటు వల్ల వరంగల్‌లో ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు.కాగా ఈ సమావేశంలో 'యోజన 2025'' కాపీని కేంద్ర మంత్రులు ఆవిష్కరించారు.

# గద్దర్ అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌బి స్టేడియం ఇండోర్ స్టేడీయంలో 'తెలంగాణ సంగీత నాటక అకాడమి' ఆధ్వర్యంలో ఆదివారం భక్త రామదాసు జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, ధనసరి అనసూయ (సీతక్క)లతో కలిసి భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేసి, ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల పాల్గొన్నారు. సంగీత విధ్వాంసులను పట్టుశాలువా కప్పి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ భక్త రామదాసును స్ఫూర్తిగా తీసుకొని అనేక మంది సంగీత విధ్వాంసులుగా, వాగ్గేయకారులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. భక్తిరస వాగ్గేయకారులు కీర్తనలు, సంకీర్తనలను మౌఖికంగా ప్రచారం చేస్తూ భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. నాటక రంగంలో రాణిస్తున్న కళాకారులను కూడా ప్రోత్సహించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని, నాటక రంగ కళాకారులకు అవార్డులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాటక పోటీలను నిర్వహించి, నాటక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రభుత్వం అవార్డులు అందజేస్తుందన్నారు. కళకారులకు ప్రభుత్వం నుంచి మెండుగా ఆశీస్సులు ఉంటాయన్నారు. గత దశాబ్ద కాలంగా సినిమా కళాకారులకు ప్రోత్సాహం అందలేదని, ప్రతిఏటా వారికి ఇవ్వాల్సిన నంది అవార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. భక్త రామదాసు 392 జయంతి ఉత్సవాల'ను ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నదన్నారు.

# రూ.879.80 కోట్ల అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపనలు

కాసీం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సమగ్ర సర్వే పనులకు శంకుస్థాపన

వనపర్తి పట్టణంలోని వెంకటేశ్వరస్వామి గుడిలో ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లాలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.879.80 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రం, మండలంలో రూ.40కోట్లతో బిటి రోడ్ల నిర్మాణ పనులకు, నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.203.95 కోట్లతో నూతన ఐటిఇ టవర్ భవన నిర్మాణానికి రూ.22కోట్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు రూ.47.50కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.200కోట్లు, 30పడకల ఆసుపత్రి భవనం నిర్మాణపు పనులకు రూ.11.20 కోట్లు, శ్రీరంగాపూర్ ఆలయానికి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.1.5 కోట్లు, వనపర్తి నియోజకవర్గంలో గిరిజన ఆవాసాల అభివృద్ధి పనులకు రూ.22.67కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. దీనితో పాటు కాసీం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సమగ్ర సర్వే పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అంతకుముందు వనపర్తి పట్టణంలోని వెంకటేశ్వరస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, జిల్లా





ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, వివిధ శాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు.

**రూ.1 కోటితో దేవాలయ అభివృద్ధికి భూమి పూజ**

**వనపర్తిలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం**

శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయానికి విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దేవాలయానికి రాగా మంగళ వాయిద్యాలతో వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అంతకు ముందు రూ.1 కోటి నిధులతో దేవాలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవాలయంలో ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు గోత్రనామాలతో అర్చనలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రంతో పాటు స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించి, వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. రూ.1కోటితో అభివృద్ధి పనులు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని, ఇంకా అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒబేదుల్లా కొత్వాల్, సాయి చరణ్ రెడ్డి, శివసేనారెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అందరూ ఒకేచోట కలవడం ఆనందంగా ఉంది

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** బాల్యమిత్రులందరూ ఒకేచోట కలవడం ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జిల్లాపరిషత్ మల్టీపర్పస్ ఉన్నత పాఠశాల సూర్యాపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుంతకండ్ల దామోదర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 6వ వార్షికోత్సవం, ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సూర్యాపేటలో తాను విద్యనభ్యసించడం ఎంతో అదృష్టమన్నారు.

ఆనాడు నాతో పాటు చదివినవారందరూ వివిధ స్థాయిలో పనిచేసి, ఉద్యోగ విరమణ పొంది తమ శేషజీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారని వారి మాటల్లో తెలుస్తోందన్నారు. తాను మొదట వైద్య విద్యను అభ్యసించాలని అనుకున్నానని కానీ అప్పటి ఆర్థిక పరిస్థితుల్లో అవకాశం చేజారిందన్నారు. పాత్రికేయవృత్తిని చేపట్టిన తాను సుదీర్ఘకాలం పాటు విశాలాంధ్ర రిపోర్టర్‌గా, ఎడిటర్‌గా పనిచేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత మన తెలంగాణ, ప్రజాపక్షం సంపాదకుడిగా పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. పాత్రికేయుల సమస్యల సాధన కోసం సంఘాన్ని ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ఉద్యమాల పురిటిగడ్డలో తాము విద్యను అభ్యసించడం ఎంతో అదృష్టమని అన్నారు.

అలనాటి తోటి విద్యార్థులంతా ఒకే చోట కలవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యలో ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, డాక్టర్ సైదిరెడ్డి, ఎన్‌వి.సూర్యనారాయణ, చంద్రశేఖర్, రఘురాం, ఎర్రంశెట్టి వేణుధర్, ప్రభాకర్, పెండెం రాములు, ఎస్‌వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# బునాదిగాని కాలువను ఎందుకు పూర్తిచేయడం లేదు?

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** సంవత్సరాలు గడిచినా బునాదిగాని కాలువను ఎందుకు పూర్తి చేయడంలేదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. రైతు సంఘం భువనగిరి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో బబ్బురి అంజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో మూసీ నీళ్లతో లక్షలాది ఎకరాలు రైతులు సాగు చేసుకుంటున్నరన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో కూడా బునాది గాని కాలువ పూర్తికావాలని మరమ్మతులు చేయాలని చెప్పారు. తెలంగాణ రైతు సంఘంతో పాటు కమ్యూనిస్టు పార్టీ కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఉద్యమాలు నిర్వహించామని, వేలాది మంది రైతులు మూసీ నీరుతో వ్యవసాయ పంటలు కొనసాగించుకోవడానికి ఎన్నో ఆశలతో జిల్లా ప్రజలు ఉన్నారని అన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో కూడా వత్తిడి తీసుకొచ్చినప్పటికినీ హామీలు ఇచ్చినారు తప్ప ఆచరణలో పూర్తిచేయలేదని పద్మ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకున్నప్పటికినీ మూసీ ప్రక్షాళన మీద హడావిడి ప్రచారాలు చేస్తున్నారు కానీ, ఇట్టి పనిని ప్రారంభించలేదని అన్నారు. ఉండబడిన బునాది గాని కాలువను మొత్తంగా వెడల్పు చేసి మూసీ నీరును విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్కువ ఖర్చుతో వేలాది ఎకరాలు సాగు చేసుకోవడానికి అనువుగా ఉన్నదని ప్రభుత్వానికి సూచించారు. భువనగిరి, వలిగొండ, ఆత్మకూరు మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి వరకు ఇట్టి కాలువ ఉపయోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బునాదిగాని కాలువ ద్వారా సరిపడా నీళ్లు వస్తాయని భావించి రైతులు పంటలు వేశారు కానీ నీళ్లు రావడంలేదు, వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన పడుతున్నారని అన్నారు. వెంటనే పరిశీలన చేసి ఎండిపోతున్న వరి పైర్లకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బునాదిగాని కాలువను పూర్తిచేయుటకు నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, నాయకులు చింతల పెంటయ్య, చొప్పరి సత్తయ్య, ఏనుగు మల్లారెడ్డి, పుల్లూరు పద్మ, ఏదునూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ళు పాలించినా సమస్యలు పరిష్కరించని కెసిఆర్

కెటిఆర్, హరీష్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారు

మార్చి 31లోగా రైతు భరోసా పూర్తి చేస్తాం

వనపర్తి సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క




**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన కెసిఆర్ ప్రజా సమస్యలను పరిష్కరించలేని సన్యాసి అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. వనపర్తిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గడిన దాటి బయటికి రాలేని కేసిఆర్‌తో పాటు కేటిఆర్, హరీష్‌లు తమ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రిని, మంత్రులను పాలన చేతకాని సన్నాసులు అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న వాళ్లు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించటం మానుకోవాలని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీఆర్‌ఎస్ నేతలను గ్రామాలకు వస్తే ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు ఆనాడు మీ పాలనలో ఎందుకు చేయలేదని బీఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నించాలని ప్రజలను కోరారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను సాగిస్తుందన్నారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. గడి నుంచి ఏనాడు బయటికి రాని పెద్దమనిషితో పాటు కెటిఆర్ , హరీష్‌లు సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడటం బాధాకరమన్నారు. పదేళ్ల పాటు దోచుకోవడానికి అలవాటు పడిన బీఆర్‌ఎస్ నేతలు, తాము అభివృద్ధి చేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. పదేళ్లు పాలించిన మీరు దళితులకు మూడు ఎకరాలు ఎందుకు ఇవ్వలేకపోయారు. లక్ష రూపాయల రుణమాఫీ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు.

**మార్చి 31లోగా రైతు భరోసా జమ :** గత బీఆర్‌ఎస్ పాలకులు రైతు బంధు పేరిట మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. అప్పటి ప్రభుత్వం ఒక సీజన్‌లో రైతు బంధు ఎగవేసినా తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 7,660కోట్ల రైతుబంధును జమ చేసిందన్నారు. అప్పటి ప్రభుత్వం సీజన్‌కు ఎకరాకు 5వేలు ఇస్తే తమ ప్రభుత్వం ఎకరాకు రూ.6వేలు చొప్పున సంవత్సరానికి రెండు పంటలకు అదనంగా రూ.2వేలు కలిపి రూ.12వేలు చెల్లిస్తుందని తెలిపారు. ఇప్పటికే రెండో విడత రైతు భరోసాను ప్రారంభించామని 9,660 కోట్ల రైతు భరోసా నిధులను మార్చి 31లోగా జమ చేస్తామని తెలిపారు.

**వనపర్తి నుంచే కొత్త పథకం ప్రారంభం :** వనపర్తి నియోజకవర్గం అత్యంత రాజకీయ చైతన్యవంతమైన ప్రాంతమని, ఈ ప్రాంత నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభిస్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పాలన చేసి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ఇందిరమ్మ ప్రభుత్వాలు అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేసిందని, కార్పొరేషన్లకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించేది అని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మాత్రం నాటి ప్రభుత్వం కార్పొరేషన్‌లకు ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు తర్వాత తమ కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్లకు 6వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ గ్రూపులకు ఏప్రిల్ 14న డా. బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల లోగా 6వేల కోట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. వనపర్తి నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2,200 జరిగిందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం దావూస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1,80,000 కోట్ల అగ్రిమెంట్లను చేసుకొని వచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధిని కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు ఎన్ని కుట్రలు చేసినా ఏ మాత్రం అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

# 'సన్‌ఫ్లవర్' కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి

సిఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా 'సన్‌ణఫ్లవర్' కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతుల కష్టాలకు ఎన్నికల కోడ్‌తో ముడి పెట్టకుండా సిఎం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. నాఫెడ్ సంస్థ సన్‌ఫ్లవర్ నూనె గింజలకు క్వింటాకు రూ.7280ల మద్దతు ధరను ప్రకటించిందని, కానీ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, దళారులకు విక్రయించడంతో క్వింటాకు రూ.1000 నుండి రూ.2వేల వరకు నష్టపోతున్నారని ఆయన సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం అలసత్వం వహిస్తే తెలంగాణ వ్యవసాయం తిరోగమన దిశలో పయనిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నూనె పంటలు వేయాలంటేనే ఆందోళన చెందే పరిస్థితులను ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) పంట కోతకు వచ్చిందని, సన్‌ఫ్లవర్ గింజలను విక్రయించడానికి ఇప్పటివరకు రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరమని హరీశ్‌రావు అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచేందుకు రైతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దామని, నూనె గింజల పంటలను సాగు చేసేలా ప్రోత్సహించామని తెలిపారు.



సంగారెడ్డి జిల్లా కంది ఐఐటిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ దంపతులు తమ పర్యటనను ముగించుకుని ఢిల్లీ వెళ్లేందుకు శనివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంకు చేరుకున్న సమయంలో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్ వీడ్కోలు పలికారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

నేటి నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ

మాక్ కౌంటింగ్ నిర్వహించిన అధికారులు





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయల నియోజకవర్గ స్థానాల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈనెల 3న నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ మొదలు కానుండగా, అందుకోసం మొత్తం 35 వినియోగించుకున్నారు. ఇందులో 21 పట్టభద్రుల ఓట్ల కోసం, 14 ఉపాధ్యాయుల ఓట్ల కోసం ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తించనుండగా ఇందులో ఒక మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు లెక్కింపు అసిస్టెంట్లు ఉన్నారు. వీరందరికీ శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులు శిక్షణ ఇచ్చారు. లెక్కింపు కోసం మొత్తం 800 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఇందులో 20 శాతం రిజర్వ్ సిబ్బందిని నియమించారు. అత్యంత పటిష్టమైన భద్రత నడుమ లెక్కింపు చేపట్టనుండగా ప్రతి టేబుల్ వద్ద సిసి కెమెరాల పర్యవేక్షణ నిరంతరాయంగా కొనసాగనున్నది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం కానుండగా, పూర్తయ్యేసరికి సుదీర్ఘ సమయం తీసుకోనున్న నేపథ్యంలో మూడు షిఫ్టుల్లో లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**మాక్ కౌంటింగ్ పూర్తి :** సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆదివారం మాక్ కౌంటింగ్‌ను ఎన్నికల అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో పాల్గొనబోయే సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించేందుకు ఈ మాక్ కౌంటింగ్ ఉపయోగపడుతుందన్నారు. ఈ మాక్ కౌంటింగ్ ద్వారా ఎటువంటి పొరపాట్లకు, తప్పిదాలకు, ఆస్కారం లేకుండా కౌంటింగ్ సజావుగా సాగుతుందన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలకు చోటులేకుండా ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణలో ఇచ్చిన ఆదేశాలను, సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఈ మాక్ కౌంటింగ్‌లో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, మైక్రో అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు, లెక్కింపు సిబ్బంది పాల్గొన్నారు.

**త్రిముఖ పోటీలో ఉత్కంఠ :** కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో ఉత్కంఠ నెలకొంది. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి త్రిముఖ పోటీ ఉండడంతో ఫలితాలపై ఆసక్తి రేకెత్తుతోంది. మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్ల మధ్య విజయాన్ని నిర్ణయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డితో పాటు ఇతరుల మధ్య పోటీ ఉండే అవకాశముంది. అయితే ఆయన గెలుపు తథ్యమేనని కాంగ్రెస్ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయంలోనూ పోటీ ఉంటుందని, వార్ వన్‌సైడ్ ఉండకపోవచ్చని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఏదేమైనా ఫలితాలు వచ్చేవరకు అందరికీ ఉత్కంఠను కలిగిస్తున్నాయి.

# నల్లగొండలో 25 టేబుళ్లలో కౌంటింగ్

**పోలైన ఓట్లు 24,139**

**ఆర్జాలబావి వేర్ హౌసింగ్ గోదాములో కౌంటింగ్**



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ వరంగల్ ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ ఈనెల మూడో తేదీ సోమవారం ఉదయం నుండి ప్రారంభం ఉన్నది గత నెల 27వ తేదీన జరిగిన పోలింగ్ అనంతరం. కౌంటింగ్ నిర్వహించేందుకు జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఆర్జాలబావి వేర్ హౌసింగ్ గోదాములో పోలింగ్ బ్యాలెట్ బాక్సలను భద్రపరిచారు. అక్కడె ఎన్నికల ఓట్ల లెక్కింపుకు చేయడం జరుగుతుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు 3 తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది.

అంతకుముందు ఉదయం 7 గంటలకు అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేయడం జరుగుతుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోలైన ఓట్లు 24139 కౌంటింగ్ 25 టేబుళ్లలో జరుగుతుంది. ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఒక మైక్రో అబ్జర్వర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు ఉంటారు. అంతేకాక 20 శాతం రిజర్వు సిబ్బంది ఉంటారు. మొత్తం 150మంది సిబ్బంది సిబ్బందిపై కౌంటింగ్ కోసం ఉండగా, మరో 200 మంది సిబ్బంది కౌంటింగ్ సమయంలో సహకరించేందుకు ఉంటారు. మొత్తం (350) మంది సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొంటారు. 250మంది పోలీస్ సిబ్బంది కౌంటింగ్ విధులు నిర్వహిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు 3 దశలలో జరుగుతుంది.

# ఖమ్మం ఎక్సైజ్ రికార్డుల మోత

నేడు హైదరాబాద్‌లో అవార్డులు స్వీకరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గంజాయిని పట్టుకోవడంలో తెలంగాణ రాష్ట్రంలోనే ఖమ్మం ఎక్సైజ్ పోలీసులు రికార్డు సృష్టించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది 6000 కిలోల గంజాయి పట్టుబడగా, ఒక్క ఖమ్మం జిల్లాలోనే 2225 కిలోలు పట్టుబడింది. అన్ని జిల్లాలకంటే ఖమ్మం జిల్లా గంజాయి పట్టుకోవడంలో ముందుండడంతో ఎక్సైజ్ అధికారుల పనితీరును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి ప్రశంసించారు. పనితీరులో నైపుణ్యం కనపరచినటువంటి ఖమ్మం ఎక్సైజ్ యంత్రాంగానికి హైదరాబాదులోని ఎక్సైజ్ భవన్‌లో సోమవారం ప్రతిభ కనబరిచిన వారికి క్యాష్ రివార్డులు, ప్రశంసాపత్రాలను కమలాసన్‌రెడ్డి అందించనున్నారు. గత ఏడాదిలో రూ.11కోట్ల విలువైన గంజాయితో పాటు 16,435 కిలోల బెల్లం, 500కిలోల ఆలంను పట్టుకుని ఖమ్మం ఎక్సైజ్ అధికారులు వారి రికార్డును వారే బ్రేక్ చేసుకున్నారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 35 కేసుల్లో ఈ రికార్డులను ఖమ్మం జిల్లా ఎక్సైజ్ పోలీసులు సాధించారు. ఖమ్మం జిల్లాలో భద్రాచలం పాల్వంచ అశ్వరావుపేట కొత్తగూడెం ఎక్సైజ్ పోలీసులు మొత్తం 35 కేసుల్లో భారీగా గంజాయిని బెల్లాన్ని పట్టుకోవడం, దీంతో పాటు 35 వాహనాల్లో 11 కార్లను స్వాధీనం చేసుకున్న ఘనత కూడా భద్రాచలం ఎక్సైజ్ పోలీసులకే దక్కింది. ఈ ఎక్సైజ్ పోలీసుల సేవలను గుర్తించినటువంటి డైరెక్టర్ నేడు వారందరికీ ప్రశంసాపత్రాలను అందించనున్నారు. కానిస్టేబుల్ నుంచి అన్ని స్థాయిలో యంత్రాంగానికి ఈ క్యాష్ అవార్డులు, ప్రశంస పత్రాలు అందించనున్నారు.

# శాసనమండలి, శాసనసభ ప్రోరోగ్ గెజిట్ నోటిఫికేషన్ జారీ

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ శాసనమండలి, శాసన సభలను ప్రోరోగ్ చేశారు. దీనికి సంబంధించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు మొదలు కావాలంటే, ముందుగా గతంలో వాయిదా పడిన సభలను ప్రోరోగ్ చేయాల్సి ఉంటుంది. దీంతో గత డిసెంబర్‌లో ఉభయ సభలు వాయిదా పడగా, ఫిబ్రవరిలో రెండు రోజులు ప్రత్యేక సమావేశాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మార్చి 1వ తేదీన శాసనసభ, శాసన మండలిని ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

# రాష్ట్రంలో పడకేసిన పాలన

ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా పడకేసిందని బిజెపి ఎంపి ఎం.రఘునందన్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓ వ్యవస్థ మీద కూడ అవగాహన లేకపోవడంతో రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారులు కూడ సిఎం మాట వినే పరిస్థితిలేదని, ఎవరికీ వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. సిఎం రేవంత్‌రెడ్డిని నమ్ముకుని బిఆర్‌ఎస్‌ను వదలి కాంగ్రెస్‌లో చేరిన ఎంఎల్‌ఎలను కూడా సిఎం రక్షించుకోలేకపోతున్నారని, దీంతో తిరిగి వారు మళ్లీ బిఆర్‌ఎస్‌కు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారని తెలిపారు. కుల గణన చేపట్టి ప్రభుత్వం ఎంతో గొప్పలు చెప్పుకుంటుందన్నారు. కులగణనలో బిసిల లెక్కల తప్పుల తడకగా ఉన్నాయని సొంత పార్టీ ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న విమర్శిస్తే ఆయన పార్టీ నుంచే సస్పెండ్ చేశారన్నారు. మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి గాని కాంగ్రెస్ గాని ఎలాంటి సంబంధం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కృషి వల్లే వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ మంజూరైందని రఘునందన్ రావు తెలిపారు.

# సాహితీ విహారి

# వారు.. పురుషాధిక్యాన్ని ధిక్కరించారు

అవును.. వారు తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రచయిత్రులు. పురుషాధిక్యాన్ని నిలదీసిన ధీనవనితలు. సమాన హక్కుల కోసం నినదించిన స్ఫూర్తిప్రదాతలు. ఒక సప్ఫో, ఒక మేరీ ఓల్‌స్టోన్ క్రాఫ్ట్ నేటి సమాజానికి అత్యవసరం. జేన్ ఆస్టెన్... వర్జీనియా ఊల్ఫ్... మాయా ఏంజెలో... వీరంతా తమతమ రచనలతో మహిళలను జాగృతం చేసిన వారే. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక శాతం మంది మహిళలు ఎదుర్కొంటున్న బాధామయ గాథలు వారి రచనల్లో ఇమిడిపోయాయి. ఎన్నో కథలు.. మరెన్నో కన్నీళ్లు దాగి ఉన్న లోతైన నీడల నుంచి మహిళలు తమ తలలు పైకెత్తి, ఆత్మ గౌరవం కోసం పోరాడాల్సిన అవసరాన్ని వారి అక్షరాలు స్పష్టం చేస్తాయి. భయంకరమైన తుఫానులు, కాలానికి ఎదురీదే పరీక్షలను తట్టుకొని, మహిళలను తమ హక్కులను కాపాడుకునే క్రమంలో పోరాటాలకు సిద్ధమయ్యేలా స్ఫూర్తినిస్తాయి. అలసిపోయిన బతుకులకు వారు జవసత్వాలు అందించారు. తాము ముందు నడిచి, మార్గదర్శకులయ్యారు. న్యాయం కోసం నినదించారు. అణచివేతను ఎదిరించారు. పురుషాధిక్య సమాజంలో మహిళల స్వరాన్ని గట్టిగా వినిపించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో, భయంతో వణకిపోయే లక్షలాది మంది మహిళలు, నేడు హక్కుల కోసం సమర శంఖం పూరిస్తున్నారంటే, దానికి కారణం ఇలాంటి రచయిత్రులే. సంస్కృతి, సంప్రదాయాల పేరుతో వేసిన సంకెళ్లను తెంచుకొని, సమాజంలో శాశ్వత మార్పులు తీసుకురావడానికి తమ గొంతులను ఉపయోగించిన ప్రభావవంతమైన రచనలు లేకుంటే సాహిత్యానికి అర్థమే లేదని వారు నిరూపించారు. కాల్పనికమైనా లేదా వాస్తవ ఘటన ఆధారితమైనా, సాంప్రదాయకంగా పితృస్వామ్య సమాజాలలో మహిళలకు సమాన హక్కులను నిర్వచించడానికి స్త్రీవాద సాహిత్యం ఉపయోగపడుతుంది. విధివిధానాలను రూపొందించడానికి, బలమైన పునాదలు ఏర్పడడానికి ప్రయత్నిస్తుంది. మహిళా వాదాన్ని వినిపించిన వారిలో ఆరవ శతాబ్దపు చారిత్రాత్మక మహిళా కవులు ఉన్నారు... 18వ శతాబ్దపు నిష్కపటమైన స్త్రీవాద తత్వవేత్తలు ఉన్నారు. ఆధునిక మహిళా రచయితలు, కార్యకర్తలు కూడా నిరంతరం స్త్రీపురుష తేడాల సరిహద్దులను బద్దలు కొట్టడానికి శ్రమిస్తునే ఉన్నారు. వీరిలో చాలా మంది సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. తమ కలాల శక్తితో చరిత్ర గతిని మార్చారు. మహిళ హక్కుల కోసం పరితపించి, ఎలాంటి భయాందోళనలు లేకుండా రచనలు చేసిన వారిలో సప్ఫో పేరును మొదటగా ప్రస్తావించుకవాలి. సప్ఫో ఒక కవయిత్రి. గేయ రచయిత్రి. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గ్రీస్‌లో జన్మించింది. పురుషులు ఆధిపత్యం చెలాయించే ప్రపంచంలో ఆమె తన నిరసన గళాన్ని


సప్ఫో


మేరీ ఓల్‌స్టోన్‌క్రాఫ్ట్


జేన్ ఆస్టెన్...


వర్జీనియా ఊల్ఫ్...


మాయా ఏంజెలో

వినిపించింది. రచనలతో అందరినీ లోనూ కొత్త ఆలోచనలను జాగృతం చేసింది. గొప్ప కవయిత్రిగా కీర్తి గడించింది. ప్రముఖ తత్వవేత్త ప్లేటో ఆమెను 'టెన్త్ మ్యూజ్' అని పిలిచాడు. ఆమె రచనలన్నీ స్త్రీపురుష తేడాలను ఎండగట్టాయి. ఆ కాలంలోనే తనను తాను స్వలింగ సంపర్కురాలు (లెస్బియన్)గా ప్రకటించుకోవడం సప్ఫో ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. ఇటీవలి కాలం వరకూ ఆమె రచలను నిషిద్ధాలుగా పరిగణించారు. ఆమె గురించి మాట్లాడుకోవడం మహాపాపం అన్న చందంగా వ్యవహరించేవారు. 11వ శతాబ్దంలో, సమాజాన్ని శాసించిన చర్చి మతాధికారులు ఆమె రచనలను తగులబెట్టారు. ఆమె రాసిన ఎన్నో కవితలు, పాటలు మంటల్లో కాలిపోయాయి. అదృష్టవశాత్తు కొన్ని మాత్రం బయటపడ్డాయి. వాటి పునరావిష్కరణ అనేక తరాల క్రితం నాటి స్త్రీవాదాన్ని గుర్తిచేసింది. తాజా స్త్రీవాద సాహిత్యానికి తెరపులు తెరిచింది. ఈ జాబితాలోకే చేరుతుంది 18వ శతాబ్దపు ఆంగ్ల రచయిత్రి మేరీ ఓల్‌స్టోన్‌క్రాఫ్ట్. వృత్తి రీత్యా ఆమె న్యాయవాది. రచనా వ్యాసాంగం ఆమె ప్రవృత్తి. స్త్రీవాది. ఆమె రాసిన 'ఎ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఉమెన్' అప్పట్లో ఓ సంచలనం. ఇలాంటి ఎన్నో విమర్శనాత్మక రచనలు ఆమె కలం నుంచి జారువారాయి. స్త్రీలు కూడా పురుషులతో సమానమైన విద్య, ఆర్థిక, రాజకీయ హక్కులకు అర్హురాలని మేరీ తన రచనల్లో స్పష్టం చేసింది. పురుషుల ఆధిక్యం ఎంతోకాలం చెల్లదని స్పష్టం చేసింది. మహిళలు అన్ని విధాలా పురుషులతో సమానమేనని ప్రకటించింది. ఈ విప్లవాత్మక భావనలే ఆమెకు స్త్రీవాద సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిపెట్టాయి. ఆమె సమకాలీన పరిస్థితులను అవగాహన చేసుకుంటూ, భవిష్యత్తు గురించి ఆలోచించింది. తనతోపాటు తన కుటుంబాన్ని కూడా సమయం కంటే ముందుగా ఆలోచించేలా ప్రభావితం చేసింది. ఆమె కుమార్తె మేరీ షెల్లీ కూడా పేరుపొందిన రచయిత్రే కావడం విశేషం. 'ఫ్రాంకెన్‌స్టెయిన్' అనే నవలతో మేరీ షెల్లీ స్త్రీవాద సాహిత్యంలో కొత్త ఒరవడి సృష్టించింది. తల్లి మాదిరిగానే ఆమె కూడా చరిత్ర గతిని మార్చేసింది. ఇక 'సెన్స్ అండ్ సెన్సిబిలిటీ', 'ప్రైడ్ అండ్ ప్రిజుడీస్' వంటి రచనలతో, ఆంగ్ల సాహిత్య రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన జేన్ ఆస్టెన్ కూడా మహిళల పట్ల సమాజ దృష్టిని మార్చడంలో కీలక భూమిక పోషించింది. ఆధునిక పాఠకులు కూడా ఆస్టెన్ రచనలను కొనియాడడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఆమె రాసిన అనేక పుస్తకాల్లోని మహిళల్లో స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తిత్వం ఉంటుంది. అదే విధంగా, ఎంతటి కష్టమైన పనినైనా స్వయంగా చేయగల సామర్థ్యం గల స్త్రీపాత్రలను ఆమె రచనలు అన్వేషించాయి. ఆధునిక పరిణామాలు, ప్రమాణాలను బేరీజు వేసుకుంటే, ఆస్టెన్ రచనల్లోని మహిళలు అలాంటి సామాన్యమైన విషయాల కోసం పోరాటాలు సాగించారా? అనే అనుమానం తలెత్తుతుంది. అయితే, ఆమె రచనలను ఆనాటి కాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చదివితే, అవి ఎంత ఆధునిక పోకడలను సంతరించుకున్నాయో అర్థమవుతుంది. 19వ శతాబ్దంపు ఇంగ్లాండ్‌ను నేటి తీరుతెన్నులతో పోల్చిచూడడం సరికాదు. ఆ రోజుల్లో అత్యంత బలంగా వేళ్లానుకున్న పితృస్వామ్య వ్యవస్థను ప్రశ్నించడం కూడా నేరమే. అలాంటి పరిస్థితుల్లో, ప్రశ్నించడమేకాదు... అణచివేతకు వ్యతిరేకంగా నినదించే ధైర్యం చేసిన ఆస్టెన్‌ను మించిన ధీశాలి ఎవరు ఉంటారు. ఆమె రచనలు నాటి సనాతనవాదుల్లో భయాందోళనలు కలిగించాయి. ప్రజల్లో కొత్త ఆలోచనలకు స్ఫూర్తినిచ్చాయి. ముఖ్యంగా అణచివేతకు గురవుతున్న మహిళలు తిరుగుబాటు పంథాను ఎంచుకునే ధైర్యాన్ని కల్పించాయి. ఆమె స్వరం తదుపరి తరాల్లో అసమానతలను ఎదరించే మంత్రదండమైంది. లింగ భేధాలను పరిష్కరించే మార్గాలను ఆస్టెన్ ఆవిష్కరించింది. ఆ పంథాలో సాగిన ఇంగ్లాండ్ మహిళలు, వారి స్ఫూర్తితో ఐరోపా మహిళలు ఎన్నో హక్కులను పోరాడి సాధించారు. ఆస్టెన్‌ను గుణాత్మక మార్పులకు పునాది వేసిన స్త్రీవాద రచయిత్రిగా యావత్ ప్రపంచం కీర్తిస్తున్నది. అదే స్థాయిలో పేరుప్రఖ్యాతులు సంపాదించిన ఆంగ్ల నవలా రచయిత్రి వర్జీనియా వూల్ఫ్ ఒక ఆధునిక వాది. అనేకానేక మహిళా సమస్యలపై తన అభిప్రాయాలను, పోరాట విధానాలను వివరించడానికి ఆమె సాహిత్యాన్ని ఆయుధంగా మలచుకుంది. వివిధ అంశాలపై తన స్పృహ, విచక్షణా ప్రవాహాన్ని కథల రూపంలో వ్యక్తీకరించింది. అణచివేత నుంచి... దోపిడి నుంచి విముక్తి పొందిన ఎంతో మంది మసిళల ఆలోచనలకు ఆమె రచనలు ప్రేరణనిచ్చాయి. ఒక రకంగా వారందరికీ ఊల్ఫ్ మార్గదర్శకురాలు. ఆమె రచనల్లో 'ఓర్లాండో' జగద్విఖ్యాతిని ఆర్జించింది. లింగ సమానత్వం ఆలోచనను ఈ రచన అన్వేషించింది. 'ఎ రూమ్ ఆఫ్ వన్స్ ఓన్' నవల ప్రతిభావంతులైన మహిళల ఆలోచనా క్రమాన్ని కళ్ల ముందు ఉంచింది. రచయిత్రులు తమను తాము కళాత్మకంగా వ్యక్తీకరించుకోవడానికి సమాన అవకాశాలు కలిగి ఉండాలని అందులో ఆమె సూచించింది. ఎలాంటి ఒత్తిడి లేదా జోక్యం లేని వాతావరణం ప్రతి మహిళకు ఉండాలని ఊల్ఫ్ తన పాత్రల ద్వారా వాదించింది. అలాంటి స్థలం లేకపోతే, మహిళలు ఏ విధంగా రాణిస్తారని నిలదీసింది. ఊల్ఫ్ స్వయంగా మానసిక అనారోగ్యంతో బాధపడింది. లైంగిక వేధింపులకు గురైంది. ఆ గాయాలు ఆమెను అమితంగా వేధించాయి. అయినప్పటికీ, తన రచనలతో ఆమె మహిళా ప్రపంచానికి కొత్తదారులు చూపించింది. ఇప్పటికీ ఆమె రచనలు పాఠకులకు స్ఫూర్తినిస్తాయి. ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడైన పుస్తకాల జాబితాలో ఊల్ఫ్ రాసినవి ముందు వరుసలో చేరుతాయి. ప్రొఫెషనల్ రచయిత్రిగా తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించడం ఆమెకు మాత్రమే సాధ్యమైంది. ఆఫ్రికన్–అమెరికన్ మహిళలు తీవ్ర అణచివేతకు గురవుతున్న కాలంలో మాయా ఏంజెలో తన రచనలతో వారిలో కొత్త ఆశలు చిగురింపచేసింది. 20వ శతాబ్దపు మేటి రచయిత్రుల్లో ఒకరైన మాయా తన ప్రతి రచనలోనూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలనే ప్రధాన ఇతివృత్తంగా తీసుకున్నారు. వారి సమస్యలపై ధైర్యంగా మాట్లాడారు. 'ఐ నో వై ది కేజ్డ్ బర్డ్ సింగ్స్' వంటి ఆమె ప్రసిద్ధ ఆత్మకథలు, విభజన, జాతి వివక్ష, లింగ వివక్ష సమయంలో మహిళల సమస్యలను ప్రస్తావించడం ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షించిన మాయా, కేవలం రచయిత్రి మాత్రమేకాదు. దర్శకురాలు కూడా. హాలీవుడ్‌లో మొట్టమొదటి ఆఫ్రికన్–అమెరికన్ దర్శకురాలిగా ఆమె పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. తన సినిమాల్లో మహిళలపై, ప్రత్యేకించి సినిమా రంగంలో ఉన్నవారు అణచివేతకు గురవుతున్న వైనాన్ని వివరించింది. ఆమె రాసిన పలు స్క్రీన్‌ప్లేలు అవార్డులను సంపాదించిపెట్టాయి. మాయా మరణానికి నాలుగు సంవత్సరాల ముందు, అంటే 2010లో 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను గెలుచుకుంది. ఆమె 1975లో రాసిన 'అలోన్ టుగెదర్' కవిత కొవిడ్19 మహమ్మారి సమయంలో 'వైరల్ ర్యాలీ క్రై'గా ముద్రితమై, పాఠకుల ప్రశంసలు అందుకుంది. భారత్‌సహా దాదాపు అన్ని దేశాల్లోనూ ఇలాంటి ప్రతిభావంతులైన రచయిత్రులు గొప్ప గొప్ప రచనలు చేశారు.... చేస్తున్నారు... అయితే, ఆంగ్ల సాహిత్యం ప్రపంచ వ్యాప్తంగా సమాజాలపై గట్టిముద్ర వేస్తుంది కాబట్టి, ఆ వర్గానికి చెందిన కొద్ది మంది పోషించిన పాత్రను స్థూలంగా ప్రస్తావించే ప్రయత్నం జరిగింది. మహిళాభ్యుదయానికి కృషి చేస్తున్న ఎంతో మంది రచయిత్రలతోపాటు రచయితలు కూడా ఉన్నారు. వారందరికీ రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వినమ్రంగా సమర్పిస్తున్న నమస్సులు ఇవే.

**– సత్యశ్రీ**

## మొదటి సైన్స్ ఫిక్షన్ రచయిత్రి రొకెయా

మన దేశంలో సైన్స్ ఫిక్షన్ రచనలు చాలా తక్కువ. అందులోనూ మహిళలు రాసినవి మరీ అరుదు. పురుషులకు మాత్రమే పరిమితం అనుకునే సైన్స్ ఫిక్షన్ రచనా ప్రక్రియను స్వీకరించి, సవాళ్లను ఎదుర్కొని అద్భుతాలు సృష్టించిన ఘనత బేగం రొకెయా (రొకెయా సఖావత్ హుస్సేన్, 1880–1932)కు దక్కుతుంది. భారత తొలి మహిళా సైన్స్ ఫిక్షన్ రచయిత్రిగా ఆమె చరిత్ర సృష్టించింది. బెంగాల్‌లోని రంగపూర్‌లో నివాసం ఉంటున్న ఒక సంపన్న ముస్లిం కుటుంబంలో జన్మించిన రొకెయా చిన్నతనం నుంచే అంతులేని ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించేది. ఆ గుణమే ఆమెను ప్రముఖ స్త్రీవాదిగా మార్చింది. మహిళా హక్కుల కోసం నినదించిన సామాజిక కార్యకర్త. వివాహానంతరం రచనలు సాగించిన ఆమె స్త్రీపురుష సమానత్వాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. సామాజిక అంశాలే ఆమె రచనల్లో ప్రధానంగా కనిపించేవి. భర్త ఖాన్ బహదూర్ సఖావత్ హుస్సేన్ తోడ్పాటుతో ఆమె ప్రారంభించిన ముస్లిం బాలికల విద్యాలయం నేటికి కలకత్తాలో కొనసాగుతున్నది. 'అంజుమన్ ఎ ఖవాతీన్ ఎ ఇస్లాం' అనే సంస్థ ద్వారా ఇస్లాం ప్రవచించిన అనేక సాంఘిక సంస్కరణలను సాకారం చేసే దిశగా వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. తన రచనల ద్వారా అన్యాయం, సాంఘిక అసమానతలు, వివక్షతకు వ్యతిరేకం గా పోరాడమని స్త్రీలను ప్రోత్సహించింది. ఇస్లాంలో స్త్రీ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉన్నదని బలంగా విశ్వసించిన రొకెయా, ఆ దిశగా నిరంతర కృషి జరిపింది. 'పిపాసా' (దాహం)తో రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించిన రొకెయా రాసిన పుస్తకాల్లో 'సల్తానా స్వప్నం' (సుల్తానా డ్రీమ్స్), 'పద్మరాగ్' బహుళ ప్రజాదరణ పొందాయి. సుల్తానా డ్రీమ్స్ అనేది సైన్స్ ఫిక్షన్ కథ. 'ది ఇండియన్ లేడీస్ మ్యాగజైన్'లో అది ప్రచురితమైంది. మన దేశంలో ఒక మహిళ సైన్స్ ఫిక్షన్ కథ రాయడం అదే మొదటిసారి. అందులో మనిషి భవిష్యత్తును స్త్రీవాద దృక్పథంలో పరిశీలించి, తదనుగుణంగా కథాగమనం కొనసాగింది. సుల్తానా స్వప్నంలో మహిళలదే రాజ్యం. వారి పాలనలో దేశమంతా శాంతి సౌభాగ్యంగా ఉంటుంది. సోలార్ పవర్ (సౌరశక్తి) వినియోగాన్ని రొకెయా ఆ నాడే ఊహించింది. బొగ్గు, మంట, పొగ, చిమ్నీ రహిత వాతావరణాన్ని అందులో సృష్టించింది. శుభ్రమైన వెలుతురుతో కూడిన కిటికీలు, వాటి నుంచి కనిపించే అందమైన తోటలు, సౌర శక్తితో పని చేసే వంటిల్లు ఆమె సుల్తానా స్వప్నంలో వివరించింది. అంతేగాక, గాలితో పని చేసే 'ఎయిర్‌కార్'ను కూడా తన రచనలో వరించింది. ఈ కారు హైడ్రోజన్ సాయంతో భూమి గురుత్వాకర్షణ శక్తిని దాటుకొని, పంఖాలు (బ్లేడ్స్) సాయంతో గాలిలో ఎగురుతుందని రొకెయా అంచనా వేసింది. అందమైన ల్యాండ్‌స్కేప్‌ను కళ్ల ముందు ఆవిష్కరించింది. స్త్రీల వివాహ వయసు కనీసం 21 సంవత్సరాలు ఉండాలని స్పష్టం చేసింది. కృత్రిమ జలపాతాలు, స్నానానికి ఉపయోగించే బాత్‌టబ్‌లు, వాటర్ షవర్‌లు, సూర్యశక్తితో పనిచేసే రూమ్ హీటర్లు, వాటర్ హీటర్లను రొకెయా ఊహించింది. వీటిలో చాలా వరకూ సోలార్ వస్తువులు మనకు అందుబాటులోకి వచ్చాయి. రొకెయా దార్శనికతను సుల్తానా డ్రీమ్స్ ఒక ఉదాహరణ. 110 సంవత్సరాలకు పూర్వమే ఆధునిక ఆవిష్కరణలను తన రచనలలో ప్రస్తావించి, సైన్స్‌ఆవిష్కరణల పట్ల ఆసక్తి చూపిన పురోగామి మహిళ రొకెయా. ఆధునికతను పుణికిపుచ్చుకున్న ఆమె రచయిత్రులకు మార్గదర్శకురాలు.







భర్త ఖాన్ బహదూర్ సఖావత్ హుస్సేన్‌తో బేగం రొకెయా

## ఒక వాస్తవం... ఒక పుస్తకం




ఒక వ్యక్తి చెప్పిన చేదు నిజమే ఒక నవలకు ప్రాణం పోసింది. టాడ్ హెన్రీ రచించిన 'లెట్ అజ్ డై ఎంప్టీ' నవల అంతర్జాతీయంగా ఎంతో మంది పాఠకులను ఆకట్టుకుంది. ఆ నవలతో హెన్రీ ఓ సెలబ్రిటీ అయ్యాడు. ఆ పుస్తకాన్ని అతను రాయడం వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. హెన్రీ ఒక వ్యాపార సంబంధిత సమావేశంలో పాల్గొన్నప్పుడు, మాటల మధ్యలో 'ఈ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన భూమి ఎక్కడ ఉంది' అని ఆ వ్యాపార సంస్థ డైరెక్టర్ ప్రశ్నిస్తాడు. దీనికి రకరకాల సమాధానాలు వస్తా యి. కొందరు గల్ఫ్ దేశాలను ప్రస్తావిస్తే, మరి కొంద రు వజ్రాలు ఎక్కువగా లభించే ఆఫ్రికా దేశాలను సూచించారు. కానీ, ఆ ప్రశ్న వేసిన డైరెక్టర్ ఈ సమాధానలను కొట్టివేస్తూ, స్మశానాన్ని మించిన ఖరీదైన స్థలం మరెక్కడా లేదని అంటాడు. ఈ మాటతో అం తా నిశ్చేష్టులవుతారు. స్మశానం ఖరీదైనది ఎలా అవుతుందనే ప్రశ్న అందులోనూ ఉదయిస్తుంది. దానికి ఆ డైరెక్టర్ విధంగా అద్భుతమైన వివరణ ఇస్తాడు. 'ఈ ప్రపంచంలో ఎన్నో వందల.. వేల సహస్రాబ్దులు గా కోటానుకోట్ల మంది పుడుతున్నారు. మరణిస్తున్నారు. ఈ ప్రక్రియ నిరంతరంగా సాగుతునే ఉంది. కోట్ల మంది పుడుతున్నప్పటికీ, వారిలో అతి కొద్దిమంది మాత్రమే తమ మేధస్సును ఉపయోగిస్తున్నా రు. తెలివితేటలను ప్రపంచానికి పంచారు. ప్రజలకు మేలు చేశారు. మిగతాలు పుట్టారు.. ఏమీ చేయకుండానే, ఏదీ సాధించకుండానే మరణించారు. వారంతా తమ తెలివితేటలను ఏమాత్రం ఉపయోగించుకోలేదు. వారి ఆలోచనలుగానీ, మేధస్సుగానీ వెలుగు చూడలేదు. ప్రపంచానికి ఎలాంటి మేలు జరగలేదు. వారి ఆలోచనలన్నీ వారివారి సమాధుల్లోనే నిక్షిప్తమైపోయాయి. అంత మంది తెలివితేటలను, మేధస్సును దాచుకున్న స్మశానం కంటే విలువైన భూమి ఎక్క డ ఉంటుంది?' అని అతను చెప్పిన వివరణ అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. హెన్రీ మనసులో తీవ్ర అలజడి... నాలుగు మాటల్లో జీవిత సత్యాన్ని ఎంతో గొప్పగా చెప్పిన డైరెక్టర్ మాటలు హెన్రీని ఆలోచనల్లో పడేశాయి. ఆ మథనం నుంచే 'లెట్ అజ్ డై ఎం ప్టీ' నవల ఉద్భవించింది. అందుకే ఆ నవల్లో ఒక చో ట 'మీ లోని సృజనాత్మకతను మీలోనే దాచుకొని స మాధుల్లో శాశ్వతంగా నిద్రించడానికి వెళ్లకండి. అం తకు ముందే, వాటిని ఈ ప్రపంచానికి పంచండి. ఆ తర్వాతే వెళ్లండి' అంటాడు. మంచి ఆలోచనలను ఆ చరణలో పెట్టాలని, వాటిని నలుగురికీ తెలియచెప్పాలని, తద్వారా ప్రపంచానికి మేలు చేయాలని హెన్రీ అభిప్రాయం. ఉన్న జ్ఞానాన్ని పంచకుండా ప్రాణం విడిచిపెడితే ఎవరికి ప్రయోజనం? ఈ ఆలోచన నుంచి పుట్టిన 'లెట్ అజ్ డై ఎంప్టీ' నవల సాహితీ రంగంలో ఒక గొప్ప ప్రయోగంగా నిలిచిపోయింది. ఒక మాటకు ఎంత శక్తి ఉందో.. ఎన్ని మెదళ్లను కదిలిస్తుందో చెప్పడానికి సదరు డైరెక్టర్ వివరణ.. హెన్రీ నవలను మించిన ఉదాహరణ అనవసరం.



## ఈ వారం కవితలు

### దేశమాత విలాపం

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా



ఎందుకమ్మా భరతమాతా
ఏడుస్తున్నావూ
కళ్ళలో కన్నీరు నిండగ
కుములుతున్నావూ
॥ఎందుకమ్మా॥

మనువు పుట్టిన దేశమమ్మా
వేద శాస్త్రాల్ వెలసెనమ్మా!
భారతం – రామాయణం
మా నుదుటి రాతలు రాసెనమ్మా!
॥ఎందుకమ్మా॥

సీతలూ – అనసూయలూ
సావిత్రులెందరో పుట్టిరమ్మా
యజ్ఞ పశువుగ మార్చి – మహిళను
యంత్రమోలే మలిచిరమ్మా

భరతఖండం ఆడజాతిని
బరువుగా భావించెనమ్మా
భరత పుత్రులు వీరులై
స్త్రీ మూర్తినే బాధించిరమ్మా
॥ఎందుకమ్మా॥

తల్లిగా, ఒక చెల్లిగా
ప్రియురాలు – భార్యగా
మసులు మగువను
వంట ఇంటికి – పడకటింటికి
పరిమితిగ బంధించిరమ్మా
॥ఎందుకమ్మా॥

సజీవదహనం – స్వజీవదహనం
సహజమైనాయీ
కంటతడి – ఈ దేశ దుహితకు
కానుకయ్యింది
అబల చేసే ఆర్తనాదం – చెవుల
సోకిందా?
మగువ చేసిన దుఃఖగర్జన –
మనసుకెక్కిందా
॥ఎందుకమ్మా॥

– ప్రొఫెసర్ ఎన్‌వి. సత్యనారాయణ

### బేటీ బచావో బేటీ పడావో

అవని ధరణి పుడమి
ఓపిక శాంతి క్షమ క్రమాలం
కారమతివకు
అలసట అతిశయోక్తైనా
చిరునవ్వే చిరునామా

పనికెప్పుడుండదు వీలునామా
ప్రతిభకు అవధులే లేకున్నా
అబలన్న ఆనవాయితీ మారదెప్పుడు
సబల సభలో వినిపించేదొద్దు

ప్రకృతి వికృతికి ఆకృతొద్దు
ప్రతిభ ప్రధానైనా రాష్ట్రపతైనా
బహుమతి కారాదు
అరాచకాలు ఆచారమై

చుట్టాలై చుట్టేస్తే చట్టాలు
ఆత్మరక్షణ శిక్షణైతే భద్రత
కావాలందుకే ఆడపిల్లకు
పడాయి నినాదం
బేటీపడావో బేటీ బచావో

– డాక్టర్. ఎస్‌విబి, 9290826988

### కవితార్చన



అమ్మా! తెలంగాణ తల్లి
ఆశీస్సులు అందించుము
నీ బిడ్డల నందరిని
కడుపార దీవించుము

నీ చల్లని నయనాలను
ప్రాంతమంతా సారించుము
జన బాగోగులు గమనించి
ప్రగతి పథము చూపించుము

నేతల నడతను గాంచి
కళ్ళు కాస్త తెరిపించుము
నాయక పాలనను తరచి
కుళ్ళు కాస్త పెకిలించుము

క్షామము తొలగినప్పుడే
ప్రజలందరు క్షేమము
ఆకర్షణ పథకాలతో
వికర్షణకు గురి చేయకుము

రైతుల వెతలు తీరినప్పుడే
రాష్ట్రం పరుగుల పురోగమనము
రైతు కంట కన్నీరు ఒలికిన
దేశమౌను స్మశానము

కలతల కలహాలు వలదు
కలసి ఉంటే కలదు సుఖము
కక్షల కార్పణ్యాలతో
రగులుటే ? తిరోగమనము

రూపు మారితేనేమి
చూపు మారదని తలతుము
సదా మీ చరణ దాసులమే
తల్లీ! నిను కవితార్చనతో కొలిచెదము

– నాగేశ్వర్ రావు, 8688553470

### నీలి తెర

నీలి నింగి గొడుగు
అణువణువును అదుగు
గొడుగు కింద అణువుల తొడుగు
అడుగడుగు అణువుల మడుగు!

గొడుగు కింద పదిలంగా
గోళాల అండ పిండ బ్రహ్మాండం
నింగి గంప కింద కమ్మగా
పొదిగిన పంచభూత పిండాండం!

నింగి కింద గోళాల గొడవలు
భ్రమణ పరిభ్రమణాల పరుగులు
నడుస్తున్న యుగయుగాల చరితలు
పరిణామ గ్రహాలు మజిలీల
అరుగులు!

జీవన రంగ ప్రదర్శనకు
గోళాలే ముస్తాబైన వేదికలు!

వానకు తడవని గాలికి చెదరని
ఎండకు ఎండని ఎవరికి అందని
ఏ మాయ చేయి ఎత్తి పట్టిన
ఏ ఆది అనాది పాతబడని
కొత్త గొడుగో !

సూర్యచంద్రులు ,నక్షత్రాలు
పాలపుంతలు నీలి తెరకు
ఫోటో ఫ్లాష్ లైట్ లెక్క !
బ్రహ్మాండం అంతా
లైవ్ కవరేజీ పక్క !

మస్తిష్క మనో నేత్రాలను
యాంటెన్నాలుగా చేస్తే సరి
నీలి తెర లో
విశ్వరూప దర్శనమే !

– పి.బక్కారెడ్డి, 9705315250

### జీవితచక్రం

వసంతం వస్తుంది పోతుంది
కింకిరం కూస్తుంది
కనుమరగువుతుంది
కాలం తిరుగుతుంది
పరుగెత్తుతుంది
ప్రాయం పెరుగుతుంది
పైనబడుతుంది

బాల్యం ఆడిస్తుంది పాడిస్తుంది
యవ్వనం విజ్ఞానాన్నిస్తుంది
వన్నెలుచిందిస్తుంది
కౌమారం కవ్విస్తుంది
కోర్కెలులేపుతుంది
వృధ్యాప్యం వెంటబడుతుంది
వేధిస్తుంది

జననం సంభవిస్తుంది
సంతసపరుస్తుంది
మరణం కబళిస్తుంది
మట్టిలోకలుపుతుంది
స్నేహం కుదుటపరుస్తుంది
కుతూహలపరుస్తుంది
ద్వేషం బాధిస్తుంది
భయపెడుతుంది
పెళ్ళాం జతకొస్తుంది
అండనిస్తుంది
సంతానం ఇంటకలుగుతుంది
ఇంపునిస్తుంది
ప్రాణం కొట్టుకుంటుంది
గాలిలోకలుస్తుంది
కాయం కుళ్ళుతుంది కాలుతుంది

సమాజం అవకాశాలిస్తుంది
ఆదరిస్తుంది
జీవితం పండుతుంది రాలుతుంది
లోకం అజరామరం
అనంతం జీవితం
క్షణభంగురం కాలబద్ధం

దీపం ఉండగానే ఇల్లుచక్కబెట్టుకో
ప్రాణం ఉండగానే
బాధ్యతలుతీర్చుకో
శాశ్వతం ఏదీకాదని తెలిసినడచుకో
సొంతం ఏవీకావని ఎరిగిమసలుకో

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

# ముగిసిన ఆపరేషన్

## బద్రీనాథ్ ఘటనలో మరో నాలుగు మృతదేహాలు లభ్యం

### ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య, 60 గంటల పాటు కొనసాగిన సహాయక చర్యలు



**డెహ్రాడూన్ :** ఉత్తరాఖండ్ చమోలి జిల్లాలోని మనా గ్రామంలో మంచుచరియలు విరిగిపడిన ఘటనలో మరో నాలుగు మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. దాదాపు 60 గంటల పాటు కొనసాగిన సహాయక చర్యలు ముగిశాయి. శుక్రవారం ఉదయం 5.30–6 గంటల ప్రాంతంలో మనా, బద్రీనాథ్ మధ్య ఉన్న బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్ఒ) శిబిరంపై మంచుచరియలు విరిగిపడ్డాయి. మొత్తం 55 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయారు. అదే విధంగా 8 కంటైనర్లు, ఒక షెడ్డు కూడా కూరుకుపోయినట్లు ఆర్మీ తెలిపింది. శనివారం నాటికి 50 మందిని బయటకుతీసుకురాగా, అందులో నలుగురు మృతి చెందారు. మిగిలిన 46 మంది కార్మికులను జ్యోతిమఠ్ మిలిటరీ ఆసుపత్రికి తరలించినట్లు ఆర్మీ డాక్టర్లు తెలిపారు. అందులో ఇద్దరిని రిషికేష్ ఎయిమ్స్ హెలికాప్టర్‌లో తరలించారు. మరో ముగ్గురి పరిస్థితి కూడా విషమంగా ఉందని లెఫ్టినెంట్ కల్నల్ డిఎస్ మల్హ్యా తెలిపారు. విపత్తు నిర్వహణ సంస్థ, ఐటిపిబి, బిఆర్ఒ, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, ఐఎఎఫ్, జిల్లా పరిపాలన, ఆరోగ్య శాఖ మరియు అగ్నిమాపక దళానికి చెందిన 200 మందికి పైగా సిబ్బంది సహాయ చర్యలో పాల్గొన్నారు. బద్రీనాథ్ నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మానా భారత– టిబెట్ సరిహద్దులో 3,200 మీటర్ల ఎత్తులో ఉన్న చివరి గ్రామం. డెహ్రాడూన్‌లోని క్లెమెంట్ టౌన్ ప్రాంతానికి చెందిన 43 ఏళ్ల అరవింద్ కుమార్ సింగ్ అనే వ్యక్తి చనిపోయాడు. ఆదివారం మృతదేహాలను బయటకు తీసిన ఇతరులను ఉత్తరాఖండ్‌లోని ఉధమ్ సింగ్ నగర్ జిల్లాలోని రుద్రపూర్‌కు చెందిన అనిల్ కుమార్ (21), ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్‌కు చెందిన అశోక్ (28)ష హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాకు చెందిన హర్మేష్‌గా అధికారులు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పోస్ట్‌మార్టం జరుగుతున్న మృతదేహాలను హెలికాప్టర్ ద్వారా జ్యోతిర్మఠ్‌కు తరలించారు. హెలికాప్టర్లు, స్నిఫర్ డాగ్‌లుష థర్మల్ ఇమేజింగ్ టెక్నాలజీని ఉపయోగించి రెస్క్యూ ఆపరేషన్‌ను వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. మొదటి రెండు రోజులు ప్రతికూల వాతావరణం మధ్య రెస్క్యూ ఆపరేషన్ దాదాపు 60 గంటలు కొనసాగింది. సెంట్రల్ కమాండ్ జిఒసిఇన్ సి లెఫ్టినెంట్ జనరల్ అనింద్య సేన్‌గుప్తా, ఉత్తర భారత్ జిఒసి లెఫ్టినెంట్ జనరల్ డి జి మిశ్రా హిమపాతం జరిగిన ప్రదేశంలోనే సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం ఉత్తరాఖండ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఉత్తరాఖండ రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్‌ను సందర్శించి సహాయక చర్యలపై అప్‌డేట్ తీసుకున్నారు. 'భారత సైన్యం, ఐటిబిపి, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, ఇతర సహాయ, రెస్క్యూ బృందాలు సంఘటన స్థలంలో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆరు హెలికాప్టర్లు ఇండియన్ ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్ నుండి మూడు, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్) నుండి రెండు, ఆర్మీ నియమించిన సివిల్ హెలికాప్టర్ ఈ ఆపరేషన్‌లో నిమగ్నమై ఉన్నాయని రక్షణ శాఖ పిఆర్ఓ తెలిపారు.

# ఓటరు కార్డు నెంబర్ల డూప్లికేషన్ నకిలీ ఓటర్లను సూచించదు

### ఎన్నికల సంఘం స్పష్టీకరణ




**న్యూఢిల్లీ :** రెండు వేర్వేరు రాష్ట్రాలలోని ఓటర్లకు ఒకే రకమైన ఓటర్ కార్డు నంబర్లను జారీచేసినట్లు నివేదికలు వెలువడిన నేపథ్యంలో డూప్లికేట్ నంబర్లు తప్పనిసరిగా నకిలీ ఓటర్లను సూచించాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం ఆదివారం స్పష్టంచేసింది. కొంతమంది ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డు (ఇపిఐసి) నంబర్లు ఒకేలా ఉండవచ్చని, జనాభా వివరాల అసెంబ్లీ నియోజకవర్గం, పోలింగ్ బూత్‌తో సహా ఇతర వివరాలు భిన్నంగా ఉన్నాయని కూడా పేర్కొంది. 'ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డు నంబర్‌తో సంబంధం లేకుండా ఏ ఓటరు అయినా వారి రాష్ట్రంలో లేదా కేంద్రపాలిత ప్రాంతంలోని వారి నిర్దేశిత పోలింగ్ స్టేషన్‌లో మాత్రమే వారు తమ ఓటును వేయగలరు. అక్కడ వారు మరెక్కడా లేనివిధంగా ఎన్నికలలో నమోదు చేసుకోగలరు' అని ఎన్నికల కమిటీ చెప్పింది. ఎన్నికల జాబితా నిర్వహణ (ఇఆర్ఒఎన్ఇటి) ప్లాట్‌ఫారమ్‌లో అన్ని రాష్ట్రాల ఎలక్టోరల్ రోల్ డేటాబేస్ కంటే ముందు వికేంద్రీకృత, మ్యాన్యువల్ మెకానిజం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి కొంతమంది ఓటర్లకు ఒకే ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డు నంబర్లు లేదా సిరీస్‌లు అనుసరించబడుతున్నాయని వివరించింది. దీని ఫలితంగా నిర్దిష్ట రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం ఒకే ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డు అల్ఫా న్యూమరిక్ సిరీస్‌లకు దారితీసింది. వివిధ రాష్ట్రాలలోని, వివిధ నియోజకవర్గాలలోని ఓటర్లకు నకిలీ ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డు నంబర్లను కేటాయించే అవకాశం ఉందని ఎన్నికల కమిటీ తెలిపింది. ఇసి వెబ్‌సైట్ ప్రకారం ఎన్నికల జాబితా నిర్వహణ ఎన్నికల వ్యవస్థను నిర్వహించడానికి 'వలస ఓటర్ల నకిలీ ఎంట్రీని తొలగించడానికి సహాయపడుతుంది'. ఈ ప్రక్రియకు సహాయపడేలా 'ఎన్నికల జాబితా నిర్వహణ 2.0 ప్లాట్ ఫారం అప్‌డేట్ చేయబడింది' అని ఎన్నికల సంఘం తెలిపింది.



# మాధవి బచ్‌పై ఎఫ్ఐఆర్

### ముంబయి కోర్టు ఆదేశం

ముంబయి: స్టాక్ మార్కెట్ అవకతవకలు, రెగ్యులేటరీ ఉల్లంఘనలకు సంబంధించిన ఆరోపణలపై 'సెబి' మాజీ చైర్‌పర్సన్ మాధబి పురీ బచ్, మరో ఐదుగురు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అవినీతి నిరోధక విభాగానికి (ఎసిబి) ముంబయి ప్రత్యేక కోర్టు ఆదివారంనాడు ఆదేశించింది. దర్యాప్తును తాము పర్యవేక్షిస్తామని, 30 రోజుల్లోగా స్థాయీ నివేదికను సమర్పించాలని కోర్టు ఆదేశాల జారీ చేసింది. మాధబి బచ్ పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు, రెగ్యులేటరీ ఉల్లంఘనలు, అవినీతికి పాల్పడ్డారని దీనిపై విచారణకు ఆదేశించాలని థానేకు చెందిన జర్నలిస్టు సపన్ శ్రీవాత్సవ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రత్యేక న్యాయమూర్తి ఎస్ఇ బంగర్ తాజా ఉత్తర్వులు జారీ చేశారు. సెబి అధికారులు విధి నిర్వహణలో విఫలమయ్యారని, మార్కెట్లో అవకతవకలకు, కార్పొరేట్ మోసానికి పాల్పడ్డారని ఫిర్యాదుదారు ఆరోపించారు. కార్పొరేట్ సంస్థతో కుమ్మక్కై ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడినట్టు ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు, సంబధిత రెగ్యులేటరీ సంస్థలను పలుమార్లు అప్రోచ్ అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. ఆన్ రికార్డ్ మెటీరియల్‌ను పరిశీలించిన కోర్టు.. ఐపిసిలోని నిబంధనలు, అవినీతి నిరోధక చట్టం, సెబీ చట్టం, ఇతర చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది.

హిండెన్‌బర్గ్ ఆరోపణలు

కాగా, అదానీ గ్రూప్‌నకు చెందిన ఆఫ్‌షోర్ కంపెనీల్లో మాధబి పెట్టుబడులు పెట్టినట్టు గత ఏడాది ఆగస్టులో హిండెన్‌బర్గ్ చేసిన పోస్ట్ కూడా సంచలనమైంది. ఇందులో ఆమె భర్త ధావలె బచ్‌కు కూడా పెట్టుబడులున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే, ఈ ఆరోపణలను బచ్ దంపతులు తోసిపుచ్చారు. సెబీలో చేరడానికి ముందే తాము పెట్టుబడులు పెట్టామని తెలిపారు. హిండెన్‌బర్గ్ ఇటీవల తమ బిజినెస్‌లను మూసేస్తున్నట్టు ప్రకటించింది.

## నా నమ్మకాలు నావి

# ఎక్కడికైనా వెళ్తా: డికె



**బెంగళూరు:** ఇషా ఫౌండేషన్ నిర్వహించిన మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనడాన్ని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమర్థించుకున్నారు. అందర్నీ కలుపుకొని వెళ్లేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. అన్ని మతాలు, కులాలను తాను విశ్వసిస్తానని, సమాజంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని వెళ్లాలన్నదే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని తెలిపారు. 'నాకు ఎలాంటి తేడాలు లేవు. కొందరికి అది నచ్చవచ్చు, మరికొందరికి నచ్చకపోవచ్చు' అంటూ డికె సూటిగా సమాధానం ఇచ్చారు. కర్ణాటకతో సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు అనుబంధం ఉందని, కావేరీ జలాల అంశంలోనూ ఆయన జోక్యం ఉందని డికె తెలిపారు. 'సద్గురు కర్ణాటకకు చెందిన వారు. కావేరీ జలాల కోసం పోరాడారు. ఆయన వ్యక్తిగతంగా నన్ను ఆహ్వానించారు. ఆయనకు ఎందరో అభిమానగణం ఉన్నారు. వివిధ పార్టీలకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేలు, నేతలు కూడా హాజరయ్యారు. నాకున్న వ్యక్తిగత నమ్మకం కారణంగానే నేను కూడా వెళ్లాను'' అని డికె వివరణ ఇచ్చారు. గతంలో తనపై వచ్చిన విమర్శలను డికె ప్రస్తావిస్తూ, తన నియోజకవర్గంలో 100 అడుగుల జీసస్ విగ్రహాన్ని స్థానికులు గతంలో ఏర్పాటు చేశారని, అది జరిగినప్పుడు బిజెపి నేతలు తనను 'ఏసు కుమార' అంటూ సంబోధించారని చెప్పారు. ఇషా ఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొనడం తన వ్యక్తిగత నమ్మకానికి సంబంధించిన విషయమని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే ప్రతి ఒక్కరికీ సమాధానం ఇవ్వాల్సిన పని తనకు లేదని అన్నారు. తన చర్యను బిజెపినో, ఇంకెవరో స్వాగతించాలని తాను కోరుకోవడం లేదన్నారు. మీడియా కూడా దీనిపై చర్చించాల్సిన పని లేదని, ఇది పూర్తిగా తన వ్యక్తిగత నమ్మకానికి సంబంధించిన విషయమని వివరించారు. సద్గురు స్వయంగా మైసూరుకు చెందిన వ్యక్తి కావడంతో పాటు ఈ ఈవెంట్‌కు రావాలని ఆయన తనను వ్యక్తిగతంగా కోరారని చెప్పారు. 'నా నియోజకవర్గంలో ఎస్సీలు, ఎస్టీల మెజారిటీ ఉంది. నియోజకవర్గంలోని 99 శాతం బ్రాహ్మణుల ఓట్లు నాకు పడ్డాయి. బ్రాహ్మణుల ఓట్లన్నీ బిజెపికి పడ్డాయని చెప్పగలమా? నేను ఎన్నడూ కుల, మత రాజకీయాలు చేయలేదు. సిద్ధాంతాలతో కూడిన రాజకీయాలకే నేను ఎప్పుడూ కట్టుబడి ఉంటాను'' అని డికె చెప్పారు. బిజెపికి తాను దగ్గరవుతున్నానంటూ కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన కొట్టివేశారు. తాను కాంగ్రెస్‌లోనే పుట్టానని స్పష్టం చేశారు.

# ఐక్యంగానే కేరళ కాంగ్రెస్ నేతలు

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** కేరళ కాంగ్రెస్ నాయకులు అంతా ఒక్కటిగా ఉన్నారని, ముందున్న లక్ష్యాల వెలుగులో వారంతా ఐక్యంగా ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. వచ్చే ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు కేరళ పార్టీ నాయకులను దిశా నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ పైవిధంగా స్పందించారు. సమావేశానికి సంబంధించిన చిత్రాలను రాహుల్ గాంధీ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. దానికి 'టీమ్ కేరళ' హ్యాష్‌ట్యాగ్‌ను కూడా జతపరిచారు. క్షమశిక్షణ, ఐక్యత, రాష్ట్ర పార్టీని బలోపేతంపై దాదాపు మూడు గంటల పాటు నాయకులంతా సమావేశమయ్యారు. రాజకీయ వ్యూహంపై నేతలంతా చాలా జాగ్రత్తగా ఉండాలని సమావేశంలో రాహుల్‌గాంధీ సూచించినట్లు వర్గాలు తెలిపాయి. పార్టీలైన్‌ను దాటి ఏదీ చేయకూడదని, మాట్లాడకూడదన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే క్రమశిక్షణ, ఐక్యత, పార్టీ కేరళ యూనిట్‌ను బలోపేతం చేయడానికి ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేయడంపై దృష్టి పెట్టారు. కాగా, సమావేశంలో రాహుల్‌గాంధీ, ఖర్గేతో పాటు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, వయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ, కేరళ కాంగ్రెస్ చీఫ్ కె. సుధాకరన్, కేరళ అసెంబ్లీలో సిఎల్‌పి నేత విడి సతీషన్, తిరువనంతపురం ఎంపి థరూర్, ఎఐసిసి కేరళ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీతో పాటు ఇతరులు హాజరయ్యారు. 'కేరళ ప్రజలతో కాంగ్రెస్ పార్టీ భావోద్వేగపరంగా, రాజకీయంగా చాలా అనుబంధంగా ఉందని మా హైకమాండ్ నుండి మాకు స్పష్టమైన సూచన వచ్చింది. ప్రజలు మార్పు కోసం చూస్తున్నారు, కాబట్టి కేరళ ప్రజలను అగౌరవపరిచే ఏ పనినీ మనం చేయకూడదు. ఇది స్పష్టమైన సూచన. ఎవరైనా వ్యక్తిగతంగా ఏ దైనా చెబితే, మేము కఠినమైన చర్య తీసుకుంటాము. ఎందుకంటే కేరళ ప్రజలను అగౌరవపరిచే హక్కు మాకు లేదు' అని అని దాస్‌మున్షీ సమావేశం తర్వాత విలేకరులకు వెల్లడించారు.

# జనం అడుక్కోవడానికి అలవాటుపడ్డారు

### బిజెపి నేత వివాదాస్పద వ్యాఖ్యలు



**రాజ్‌గఢ్ :** బిజెపి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, మధ్యప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రజలు చేయి చాచేందుకు అలవాటు పడిపోయారని వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. రాజగఢ్ జిల్లాలో వీరాంగన రాణి అవంతీబాయ్ లోధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై ప్రసంగించిన సందర్భంగా ప్రహ్లాద్ పటేల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వం నుంచి అడుక్కుని తీసుకునేందుకు ప్రజలు అలవాటుపడ్డారు. నేతలు వచ్చినప్పుడల్లా వారికి గంప నిండుగా అర్జీలు ఇస్తుంటారు. స్టేజీలపైన నేతలకు పూలమాలలు వేసి చేతుల్లో అర్జీలు పెడుతుంటారు. ఇది మంచి అలవాటు కాదు. ఇలా అర్థించే బదులు ఇచ్చే అలవాటును పెంపొందించుకోవాలి. దాంతో సమాజంలో సంస్కారం పెరగడంతోపాటు జీవితం ఆనందమయం అవుతుంది' అంటూ వ్యాఖ్యానించారు. చేయిచాచే వారివల్ల సమాజం బలహీనమవుతుందని, ఉచితాలకు ఆకర్షితులు కావడం ధీర మహిళల లక్షణం కాదని పటేల్ చెప్పారు. అమరులను గౌరవించుకోవడం అంటే వారు చూపిన మార్గంలో వారి ఆదర్శాలకు అనుగుణంగా జీవించడమేనని అన్నారు. నిజమైన దేశభక్తులు చేయి చాచి అర్థించినట్టు మనం ఎక్కడైనా విన్నామా..? అని ప్రశ్నించారు. నర్మదా పరిక్రమ యాత్రికుడిగా తాను దానాలు స్వీకరించానని, కానీ అవి నా కోసం కాదని, నాకు ఏదైనా ఇచ్చినట్లు చెప్పే వ్యక్తి ఎవరూ లేరని అన్నారు. ప్రహ్లాద్ పటేల్ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు జీతూ పట్వారీ.. పటేల్ వ్యాఖ్యలను ఖండించారు. ఆయన రాష్ట్ర ప్రజలను అవమానించారని అన్నారు. ప్రజలను భిక్షగాళ్లు అనే స్థాయికి బిజెపి అహంకారం పెరిగిపోయిందని మండిపడ్డారు. ప్రజల కష్టాలు, ఆశలు, కన్నీళ్లను ఆయన అవమానించారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తే భిక్షగాళ్లంటూ అవమానిస్తారా అని మండిపడ్డారు. త్వరలో బిజెపి నేతలే ఓట్లు అడుక్కుంటూ వస్తారని, అప్పుడు ప్రజలు గుణపాఠం చెప్పాలని అన్నారు.

## నేనున్నంత వరకూ

# వారసులు ఉండరు

### బిఎస్‌పి చీఫ్ మాయావతి సంచలన నిర్ణయం



**లక్నో:** బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి తన రాజకీయ వారసత్వంపై సంచలన ప్రకటన చేశారు. తాను జీవించినంత కాలం పార్టీకి తన వారసులు అంటూ ఎవరూ ఉండరని స్పష్టం చేశారు. తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్ నిర్వహిస్తున్న రెండు బాధ్యతల నుంచి ఆయనను తప్పిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. మాయావతి రాజకీయ వారసుడిగా, బిఎస్‌పి జాతీయ కోఆర్డినేటర్‌గా ఆకాష్ ఆనంద్ ఇంతవరకూ వ్యవహరిస్తున్నారు. లక్నోలో ఆదివారంనాడు బిఎస్‌పి జాతీయ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ ఎంపి అశోక్ సిద్ధార్థ్‌ను పార్టీ నుంచి మాయావతి ఇటీవల బహిష్కరించారు. ఆకాశ్ ఆనంద్ మామ అశోక్ సిద్ధార్థ్‌ను ఫ్యాక్షనలిజం కారణంగా పార్టీ బహిష్కరించింది. ఈ క్రమంలోనే ఆకాష్ ఆనంద్‌ను పార్టీ బాధ్యతల నుంచి మాయావతి తొలగించారు. ఆకాష్ ఆనంద్ రాజకీయ కెరీర్‌పై ఆయన మామ ప్రభావం ఉందని మాయావతి ఇటీవల ఆరోపించారు. కాగా, తాజా మార్పులు, చేర్పుల్లో భాగంగా రాజ్యసభ ఎంపి రామ్జీ గౌతంను బిఎస్‌పి నేషనల్ కోఆర్డినేటర్‌గా తిరిగి నియమించారు. 2019 వరకూ ఆయన ఈ పదవిని నిర్వహించారు. ప్రస్తుతం జాతీయ కోఆర్డినేటర్ పదవిని మాయావతి చిన్న తమ్ముడు ఆనంద్ కుమార్‌తో కలిసి ఆయన పంచుకుంటారు. తన రాజకీయ వారసత్వంపై కూడా మాయావతి స్పష్టమైన ప్రకటన చేశారు. తాను బతికున్నంత వరకూ పార్టీకి తన రాజకీయ వారసుండంటూ ఎవరూ ఉండరని స్పష్టం చేశారు. కాగా, ఆకాష్ ఆనంద్‌ను పార్టీ బాధ్యతల నుంచి మాయవతి తప్పించడం ఇది రెండోసారి. గత ఏడాది మేలో లోక్‌సభ ఎన్నికల సమయంలో పార్టీ బాధ్యతల నుంచి ఆయనను తప్పించారు. అయితే ఆ తర్వాత జూలైలో జంట బాధ్యతలను ఆయనకు మాయావతి అప్పగించారు.

# గ్యాంగ్‌స్టర్లు, స్మగ్లర్లకు స్థానంలేదు

### పంజాబ్ నుంచి వారిని త్వరలోనే ఏరివేస్తాం: సిఎం మాన్



**హోషియార్‌పూర్ :** గ్యాంగ్‌స్టర్లు, స్మగ్లర్లు, నేరస్థులు, ఇతర అసాంఘిక శక్తులకు రాష్ట్రంలో స్థానం లేదని, వారని త్వరలోనే ఏరివేస్తామని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్పష్టం చేశారు. 2,490 మంది పోలీసుల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా హోషియార్‌పూర్‌లో జరిగిన సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ, ఈ పవిత్ర భూమి సాధువులు, అమరవీరులు, దిగ్గజ క్రీడాకారులు, ఉన్నత వ్యక్తులను తయారు చేసిందని మాన్ అన్నారు. అయితే, స్మగ్లర్లు, గ్యాంగ్‌స్టర్లు, ఇతర నేరస్థులు దురదృష్టవశాత్తు గత ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఈ రాష్ట్రాన్ని తమ నివాసంగా మార్చుకున్నారని చెప్పారు. ఈ దేశ వ్యతిరేక శక్తులను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు క్రూసేడ్ ప్రారంభించిందని, వారు త్వరలో జైలులో ఉంటారని మాన్ చెప్పారు. తన ప్రభుత్వం రాష్ట్రంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక యుద్ధాన్ని ప్రారంభించినందున పంజాబ్ ఒక చారిత్రాత్మక దశలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంబించిందని, ప్రజల మద్దతు, సహకారంతో పంజాబ్‌ను పూర్తిగా మాదకద్రవ్య రహితంగా మారుస్తామని ప్రకటించారు. మాదకద్రవ్యాల సరఫరాను అరికడుతున్నామని, మాదకద్రవ్యాల వ్యాపారులను జైళ్లకు పంపిస్తున్నామని, స్మగ్లర్ల ఆస్తులను జప్తు చేయడం లేదా ధ్వంసం చేయడం వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. సరిహద్దు రాష్ట్రంలో శాంతికి భంగం కలిగించడానికి దుష్ట శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, పంజాబ్ పోలీసులు అలాంటి ప్రయత్నాలను ఎల్లప్పుడూ అడ్డుకున్నారన్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లను మరింత అధిగమించడానికి దర్యాప్తు, శాస్త్ర సాంకేతిక రంగాలలో అవసరాలకు అనుగుణంగా పోలీసు బలగాలను నవీకరించడం తప్పనిసరి అని మాన్ చెప్పారు. కొత్త పోలీసులను అభినందిస్తూ, వారు పంజాబ్ పోలీసు కుటుంబంలో అంతర్భాగంగా మారినందున ఇది వారికి ఒక చిరస్మరణీయ సందర్భమని ఆయన అన్నారు. అత్యంత అంకితభావం, కృషి, నిబద్ధతతో తమ విధిని నిర్వర్తించాలని, తద్వారా రాష్ట్ర పురోగతికి, దాని ప్రజల శ్రేయస్సుకు అపారమైన సహకారాన్ని అందించాలని ముఖ్యమంత్రి వారిని ప్రోత్సహించారు. రాష్ట్రం నుండి మాదకద్రవ్యాల ముప్పును తుడిచిపెట్టడంలో చురుకైన పాత్ర పోషించాలని కొత్తగా చేరిన పోలీసులకు మాన్ పిలుపునిచ్చారు. 2022 నుండి 10,000 మందికి పైగా యువకులను పోలీసు దళంలో చేరారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10,000 మంది కొత్త పోలీసు సిబ్బందిని నియమించాలని నిర్ణయించిందని, దీనికి అవసరమైన అనుమతిని త్వరలో కేబినెట్ ఇస్తుందని మాన్ చెప్పారు. భద్రతను మెరుగుపరచడానికి, రోడ్లపై విలువైన ప్రాణాలను కాపాడటానికి అంకితమైన 'సడక్ సురఖ్య దళం' (రోడ్డు భద్రతా దళం) ఏర్పాటు చేయబడిందని ముఖ్యమంత్రి చెప్పారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో ప్రారంభించినప్పటి నుండి, రాష్ట్రంలో ప్రమాదాల కారణంగా మరణాలు 48.10 శాతం తగ్గాయని ఆయన అన్నారు. ట్రాఫిక్ ప్రమాదాలకు గురయ్యే 4,200 కిలోమీటర్ల హైవేల వెంబడి ఈ దళం మోహరించబడిందని, పెట్రోలింగ్‌తో పాటు ట్రాఫిక్ ఉల్లంఘనలకు నిరోధకంగా పనిచేస్తుందని మాన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ చొరవను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా పార్లమెంటులో ప్రశంసించారని ముఖ్యమంత్రి అన్నారు.

## సూట్‌కేసులో కాంగ్రెస్ పార్టీ

# కార్యకర్త మృతదేహం



**రోహతక్:** హర్యానాలోని రోహతక్‌లో ఓ మహిళ కాంగ్రెస్ కార్యకర్త మృతదేహం సూట్‌కేసులో లభించడం తీవ్ర కలకలం సృష్టించింది. శుక్రవారం సంప్లా బస్టాండ సమీపంలో ఈ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే స్థానికుల సమాచారం అందించడంతో ఎఎఫ్ఐ అధికారులు ఆ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 20–22 సంవత్సరాల మధ్య ఉన్నట్లు గుర్తించారు. ఆమె మెడ చుట్టు స్కార్ఫ్ బిగించి ఉంది. దీనిపై సంప్లా ఎస్‌హెఇ బిజేంద్ర సింగ్ మాట్లాడుతూ.. యవతిని హత్య చేసి ఆ తర్వాత సూట్‌కేసులో పెట్టారని అన్నారు. ఈ హత్య కేసులో నిందితుడిని త్వరగా పట్టుకుంటమాని హామీ ఇచ్చారు. అయితే హత్యకు గురైన యువతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త హిమని నర్వాల్ అని ఎమ్మెల్యే భారత్ భూషన్ భత్రా ఆరోపించడంతో తీవ్ర దుమారం రేగింది. హిమని భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్ర చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హర్యానా అధ్యక్షుడు భుపిందర్ సింగ్ హుడా కూడా ఈ హత్యను తీవ్రంగా ఖండించారు. ఆమె మృతి సంతాపం తెలిపిన ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ హత్యపై ఉన్నత స్థాయిలో నిష్పాక్షిక విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేరసామ్రాజ్యాలపై

# 'ఢిల్లీ పోలీస్ డేగకన్ను'

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో అత్యున్నత స్థాయి సమావేశం

### పోలీస్ వ్యూహాలను మరింత పటిష్టపర్చడంపై దృష్టి సారించాలని నిర్ణయం



**న్యూఢిల్లీ :** వ్యవస్థీకృతనేరాలను అరికట్టేందుకు దేశ విదేశాలలోని జైళ్ల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న గ్యాంగ్‌స్టర్లను అరికట్టేందుకు ఢిల్లీ పోలీసులు తీవ్రప్రయత్నాలు సాగించాలని యోచిస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అధ్యక్షతన నిర్వహించిన శాంతిభద్రతల అత్యున్నత స్థాయి సమీక్షాసమావేశంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఢిల్లీ హోం మంత్రి అశీష్ సూద్, కేంద్ర హోం శాఖ సెక్రటరీ గోవింద్ మోహన్ పాల్గొన్నారు. మరుసటిరోజైన శనివారం ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అత్యున్నత పోలీస్ అధికారులు కూడా సమావేశం కావడం గమనార్హం. ఈ సమీక్ష సమావేశంలో పోలీస్ వ్యూహాలను మరింత పటిష్టం చేయడంపై దృష్టి సారించింది. దేశరాజధానిలో నేరాలను ఏ విధంగా నియంత్రించాలి అన్న అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. వర్ధమాన నేరస్తుల జాబితాను సిద్ధం చేసి, వారి నెట్‌వర్క్‌లను తొలగించే చర్యలను చేపడతామని శనివారం నాటి సమావేశంలో చర్చించడం జరిగిందని అధికారవర్గాలు తెలిపాయి.'కౌశల్ చౌదరి, నీరజ్ బవానా వంటి జైళ్లలో ఉన్న గ్యాంగ్‌స్టర్లపై గట్టి నిఘా నిర్వహించబడుతుంది.వీరే కాకుండా విదేశాలనుంచి తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్న అన్మోల్ బిష్ణోయ్ సహా అర్ష్ దాలా, గోల్డీ బ్రార్, హిమాంశు భావు, లకీ పాటియల్, జగ్గా ధుర్కాట్, వీరేంద్ర చరణ్, అమర్‌దీప్‌బిష్ణోయ్, నోనీ రాణా, మహేందర్ సహారన్, రాహుల్, మహేందర్ మేఘ్‌వంశీ, నవీన్ బాక్సర్‌లను కూడా దగ్గరగా పర్యవేక్షిస్తున్నాం' అని ఒక అధికారి చెప్పారు. ఈ గ్యాంగ్‌స్టర్లతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధాలు కలిగిఉండి సంప్రదింపులు జరుపుతున్న బాలనేరస్తులు కూడా తమ నిఘా కింద ఉంటారని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు చెప్పారు. క్రూరమైన నేరాలలో భాగస్వాములైన బాలనేరస్తుల జాబితాను పోలీసులు తయారుచేస్తున్నారని, వారి విచారణను పెద్దనేరస్తుల తరహాలోనే చేయాలని కోర్టుకు సిఫారసు చేస్తామని ఆయన తెలిపారు. దీనికితోడు అదనంగా గ్యాంగ్‌స్టర్లు, వారి సహాయకులపై చట్టవ్యతిరే కార్యకలాపాలు, సంబంధాల విషయమై కన్నేసి సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలపైన గట్టి నిఘాపెట్టి దగ్గరగా పరిశీలించడం జరుగుతుందన్నారు 'గ్యాంగ్‌స్టర్లకు సహాయపడేవారు పోలీస్ రాడార్ నిఘా కింద ఉంటారు. అంతేకాకుండా వారి కార్యకలాపాలను అత్యంత దగ్గరగా పర్యవేక్షిస్తాం' అని ఆ అధికారి తెలియజేశారు. 15పోలీస్ జిల్లాలకు చెందిన డిసిపిలు, జాయింట్ కమిషనర్లు, వేర్వేరు జోన్లకు సంబంధించిన స్పెషల్ కమిషనర్స్ ఆఫ్ పోలీస్ (శాంతిభద్రతలు), ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## పెట్రోల్ బంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రం నందు నూతన పెట్రోల్ బంక్‌ను ఆదివారం వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లలోకి వానరాలు.. ప్రజలపై శునకాలు



ఒక్క నెలలో 101 మంది బాధితులు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటి దాడికి గురైన బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఒక్క ఫిబ్రవరి నెలలో వానరాల, కుక్కల కాటుకు మండలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో 101 కేసులు నమోదు. గుంపులు, గుంపులుగా తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఎవ్వరు కనిపించినా దాడి చేసి గాయపరుస్తున్నాయి. రాత్రిపూట ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారి వెంబడి కుక్కలు వెంట పడటంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. కోతులు ఇంట్లోకి చొరబడి నిత్యావసరాలను ఎత్తుకెళ్లటం, చిందరవందర చేయడం, నీటి ట్యాంకుల మూత తీసి నీరు తాగడం, అపరిశుభ్రం చేయడం, పైపులను విరగ్గొట్టడం వంటి పనులు చేస్తుండటంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. వానరాల, కుక్కల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో వీటి సంతతి క్రమంగా వృద్ధి చెందుతోంది. వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ ఎదురుదాడి చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోజుకు దాదాపు ఒకరి నుంచి ఇద్దరి చొప్పున కుక్క, కోతుల కాటు బారిన పడుతున్నారని ఆయా మండలాల వైద్యులు తెలిపారు.

## ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో ఈనెల 10 నుండి 15వ తేదీ వరకు జరిగే శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రాన్ని ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డికి ఆలయ కమిటీ చైర్మన్ గూకంటి రాజరాబు రెడ్డి అందజేశారు. 13న జరిగే స్వామివార్ల కళ్యాణ మహోత్సవానికి సతీసమేతంగా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మంగపల్లి మల్లికార్జున్, చెరుకుపల్లి బంగారి పెద్ద మల్లయ్య, రాపర్తి మహేష్ పాల్గొన్నారు.

## స్త్రీపురుష సమానత్వానికై పోరాడుదాం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** స్త్రీ పురుష సమానత్వానికి కోసం మహిళలు పోరాడాలని పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లెనిన్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని మహిళలకు పిలుపునిచ్చారు. మార్చి 8న జరిగే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న మహిళ వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, సహాయ కార్యదర్శి సంతోషిమాత, కోశాధికారి జయమ్మ, జిల్లా నాయకురాలు ఐతరాజు పద్మ పాల్గొన్నారు.

## ఎండిన పంట పొలాలకు నష్టపరిహారం అందించాలి

**ప్రజాపక్షం/చివ్వెంల:** ఎండిన పంట పొలాలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మొగ్గయ్య గూడెం గ్రామంలో నీరులేక ఎండిన పంటపొలాలను సంఘం నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. కొనకంచి కలమ్మకు చెందిన 10ఎకరాల పొలం నీరులేక ఎండిపోవడంతో గొర్లు, మేకలు మేస్తున్న దృశ్యాన్ని చూసి చలించిపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్‌పి నీటిని వెంటనే విడుదల చేసి రైతుల పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఈ ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. ఎండిన పంట పొలానికి ఎకరాకు రూ.30వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికై త్వరలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ జిల్లా కార్యదర్శి బాషపంగు సునీల్, వాసు, నాయకులు అనంతుల ఎల్లయ్య, వీరబోయిన వెంకన్న, నారాయణరెడ్డి, భూక్య వెంకన్న, వెంకట్రావు, అశోక్ పాల్గొన్నారు.



# నత్తనడకన పనులు!



నెలలు గడుస్తున్నా.. రోడ్డు వేయరా?

ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండలంలోని భైరవునిపల్లి గ్రామం నుంచి తిరుమలపురం గ్రామ శివారు వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు నెలలు గడుస్తున్నా పూర్తిచేయడం లేదు. మట్టి పోసే మొదలు కంకర పోసే వరకు నత్తనడకన నడిచాయి అని రైతులు తెలిపారు. ఈ రహదారి గుండా పోవాలంటే తీవ్రమైన ఇబ్బందులు తప్పడం లేదని రైతులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వాహనాలు ఎదురెదురుగా వస్తే..**

రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే ప్రమాదాలు కూడ జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు.

**కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం...!**

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డుపై ఒక వాహనం ప్రయణిస్తుంటే వెనకాల లేచే దుమ్ముతో వాహనాలు కనిపించడం లేదని చెబుతున్నారు. వాహనాలు వెళ్తుంటే దుమ్ము కళ్ళలో పడి కంటి సమస్యలు ఏర్పడుతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. అలాంటి సందర్భంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని చెపుతున్నారు. ఈ రహదారిపై వాహనాల రాకపోకలతో ఎగిసిపడుతున్న కంకర రాళ్లతో పాటు దుమ్ముతో ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు ప్రయణికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బి అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

# రైతుగోస పట్టని ప్రభుత్వాలు

తక్షణమే మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

ఎఐకెఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు



**ప్రజాపక్షం/చింతకాని :** రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం బస్వాపురం గ్రామ శాఖ సమావేశంలో కొండపర్తి మాట్లాడుతూ, మిర్చి రైతు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ప్రభుత్వాలకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నాయని అన్నారు. మిర్చి పంటలు కూడా సుగంధ ద్రవ్యాల వాడకంలో వినియోగిస్తున్నారని, మిర్చి పంటను ఆహార పంటల జాబితాలో తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్ నామ్స్ ప్రకారం రైతుల నుండి కమిషన్ దారులు 2 శాతం కమిషన్ తీసుకోవాల్సి ఉండగా నాలుగు నుంచి ఐదు శాతం కమిషన్ తీసుకుంటున్నారని తక్షణమే అధికారులు కమిషన్ దారులపై చర్యలు తీసుకోవాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు వెంటనే అమలు చేయాలన్నారు. ఖమ్మంలో వెంటనే మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ లైన రుణమాఫీ, రైతు భరోసా తక్షణమే షరతుల్లేకుండా పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ ఇవ్వాలని వడ్డీ లేని వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లేని పక్షంలో రైతులను సమన్వయ పరిచి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈనెల 20న వైరాలో జరిగే రైతుసంఘం ఖమ్మం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి కూచిపూడి రవి, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్ రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం చింతకాని మండల అధ్యక్షులు మార్గం శ్రీనివాసరావు, నాయకులు బొడ్డు కొండలరావు, చంద్రకాని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం గ్రామ శాఖ ఎన్నిక జరిగినది గౌరవ అధ్యక్షులుగా ఆవుల పెద్ద వేలాద్రి, అధ్యక్షులుగా వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా మార్గం సత్యనారాయణ కార్యవర్గ సభ్యులుగా ఆవుల వెంకయ్య, బుర్ర అంజయ్య, దూదిమెట్ల ఉపేందర్,చేబ్రోలు రవి,ఆవుల బాబు ఎన్నుకున్నారు.

# బిపి, షుగర్, కంటి ప్రత్యేక శిబిరం విజయవంతం



ప్రముఖ జనరల్, షుగర్ వైద్యనిపుణులు టి.పవన్‌కుమార్

**ప్రజాపక్షం/బోనకల్:** మండల కేంద్రంలో ప్రతి నెల మొదటి ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం నిర్వహించే బిపి, షుగర్, కంటి 54వ ప్రత్యేక క్యాంపు ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రముఖ జనరల్, షుగర్ వైద్య నిపుణులు టి.పవన్‌కుమార్ మాట్లాడుతూ.. బిపి,షుగర్ పేషంట్లు వేసవి కాలంలో సరైన జాగ్రత్తలు తీసుకుటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఎండకాలంలో వేడి వల్ల ఒత్తిడి పెరుగుతుందని, దీంతో ఉష్ణోగ్రతల వల్ల స్ట్రెస్ ఎక్కువ అవుతుందని అన్నారు. కావునా ఎండ ఎక్కువ ఉన్న సమయంలో ఇంట్లో ఉంటే మంచిదని తెలిపారు. ఉప్పు, కారం, మసాలా ఆహారాలను తగ్గించి, త్వరగా జీర్ణమయ్యే ద్రవరూపంలో ఉండే ఆహారాలను మాత్రమే తీసుకోవాలని సూచించారు. దీంతో బిపి, షుగర్‌లలో హెచ్చు తగ్గులను నియంత్రించుకోవచ్చని అన్నారు. క్యాంపులో 100 పేషంట్లకు వైద్యసేవలందించగా, ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుల చేతుల మీదుగా పేషంట్లకు మందులు పంపిణీ చేశారు. ఈ క్యాంపు సహాయకులు ఆర్ఎంపిడబ్ల్యూఏటిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, ఆకెన పవన్, యంగల గిరిలు క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఏలూరి పూర్ణచంద్, సిపిఎం నాయకులు దారగాని కృష్ణమూర్తి, టిడిపి నాయకులు దుగ్గి భద్రయ్య, క్యాంపు సహాయకులు రేణుక, విజయ తదితరులు పాల్గొన్నారు.

# జయ పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో ఆదివారం సైన్స్ ఫెయిర్‌ను జయ సృష్టి 2025 పేరుతో యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. సంస్కృతి సాంప్రదాయాలు విద్యార్థులకు తెలియజేసేలా బొమ్మల కొలువులు, భయకంపితులను చేసిన డెవిల్ హౌజ్, హైడ్రాలిక్ మిషన్, పిఎస్ఎల్‌విసి 33, 37 నమూనాలు, నానోటూర్ నమూన, ఎలక్ట్రానిక్ హోం అప్లయన్స్ కంట్రోల్డ్ బైరిమోట్, ఫుడ్ కోర్టు, స్పేస్‌రూం వంటి ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు నిర్వహించిన మెడికల్ క్యాంపులు తల్లిదండ్రులు పరీక్షలు చేయించుకొని తమ పిల్లలను డాక్టర్లుగా చూసి ఎంతో మురిసిపోయారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాల్లోని వివిధ అంశాలను ప్రయోగరూపంలో వివరించారు. భౌతిక, రసాయన, సాంఘిక, జీవ శాస్త్రాల్లోని విషయాలను అనువర్తనాలను సులువుగా అర్థమయ్యేలా తమ ప్రయోగాలతో వివరించారు. దీనికి సూర్యాపేట మండల విద్యాధికారి శేశగాని శ్రీనివాస్, సూర్యాపేట సెక్టోరియల్ అధికారి జనార్ధన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు చేసిన ప్రయోగాల ప్రదర్శనను పరిశీలించారు. సమాజంలోని సమస్యలను కనుగొని వాటిని పరిష్కార మార్గాలను చూపడానికి సైన్స్ ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. జయ సృష్టిని ప్రతి సంవత్సరం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను, శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంపొందించగలుగుతామని కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ల్ జెల్లా పద్మ, బింగి జ్యోతితో పాటు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణకే ఉచిత వైద్య శిబిరాలు

సువెన్ ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని సువెన్ ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు అన్నారు. సువెన్ ఫార్మ వారి సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని పోలీస్ భరోసా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది డయాబెటిక్, బిపి లాంటి జీవన శైలి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలన్నారు. పోషక విలువలు కలిగిన మంచి ఆహారాన్ని తీసుకొని ఆరోగ్య నియమాలు, వ్యాయామ నియమాలు అవలంభిచడంతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సువెన్ ఫార్మా నిరంతరం వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించచడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఉచిత వైద్యంతో పాటు మందులను కూడా ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ఇన్‌చార్జీ పిఎస్ఎన్ మూర్తి, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ వరప్రసాద్ రెడ్డి, హెచ్ఆర్ హెడ్ వెంకటరమణ, పివి రమణ, ఎంవి రమణ, డిప్యూటీ మేనేజర్ సైదులు, క్యాప్షన్ మేనేజర్ జీవన్ నాయక్ పాల్గొన్నారు.



## జాతరకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఆలయ కమిటీ

**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక మండలం జానంపేట గ్రామంలో ఈ నెల 4 నుండి 8వ తారీకు వరకు జరుగు శ్రీనాగ దేవత జాతరకు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ నాగులమ్మ దేవత గుడి కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, మణుగూరు సింగరేణి ఐఎన్‌టియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షులు కృష్ణం రాజు, నాగులమ్మ గుడి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాదరావుకు ఘననివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం,క్రైం :** ప్రజాసేవకు అంకితమై మావోయిస్టుల దుశ్చర్యకు బలైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావుకు సమాజానికి ఆదర్శప్రాయుడని అడిషనల్ డిసిపిలు నరేష్‌కుమార్, ప్రసాదరావులు అన్నారు. స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్ పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీపాదరావు జయంతిలో వారు పాల్గొని మాట్లాడారు. తొలుత శ్రీపాదరావు చిత్రపటానికి ఇరువురు అడిషనల్ డిసిపిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీపాదరావు ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ఆయన అందించి సేవలు చిరస్మరణీయమన్నారు. ఈకార్యక్రమంలో ఆర్మీరిజర్వుడ్ అడిషనల్ డిసిపి కుమారస్వామి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీశైలం, సురేష్ పాల్గొన్నారు.

## మిర్యాల గుణసుందరికి నివాళులు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామంలో మిరియాల వెంకన్న మాతృమూర్తి మిరియాల గుణసుందరి అనారోగ్య కారణం చేత స్వర్గస్తులు కాగా విషయం తెలుసుకున్న జూలూరుపాడు మండల నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షులు అల్లాడి నరసింహారావు , దొండపాటి శ్రీనివాసరావు, చీమలపాటి బిక్షం, చావా వెంకట రామారావు, ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు, మెంతుల కృష్ణ, పోతురాజు నాగరాజు, మోదుగ రామకృష్ణ, కోట కుమార్ బాబు, బెజవాడ సీతయ్య, మిరియాల కిరణ్ కుమార్, వేల్పుల ముఖేష్, చంగల నాగయ్య, గురునాథం, ఫ్రాన్సిస్, మిర్యాల ముత్తయ్య, కిన్నెర దేవయ్య, మిర్యాల రమేష్, మిర్యాల వెంకన్న, మంద గోపయ్య, వేల్పుల నవీన్, తానంగి నాగరాజు, గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవ కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆదివారం మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. మొక్కులు చెల్లించుకొని దేవుని పాత్రకు కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, నాయకులు పందిరి మల్లేష్, ఈర్ల వాసు, ఆలేటి మాణిక్యం పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధి విస్తరణ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** సూర్యాపేట పట్టణంలోని 17వ వార్డు చింతలచెరువులో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధి విస్తరణ పనులను ఆదివారం తాజా మాజీ కౌన్సిలర్ చింతలపాటి భరత్ మహజన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. దేవస్థానం వెనుక భాగంలో ఉన్న 65 చదరపు గజాల స్థలాన్ని దాతల సహకారంతో కొనుగోలు చేసి విస్తరణ పనులు చేపట్టారు. మొదట దేవాలయ ప్రహారి నిర్మాణాన్ని ముగ్గుపోసి పునాది తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బైరబోయిన శ్రీనివాస్, కరుణాకర్, దేవాలయ కమిటీ సభ్యులు బోనగిరి నర్సయ్య, బైరబోయిన జోగయ్య, రేగట్టి లింగయ్య, ఐతగోని సైదులు, శిరంశెట్టి సైదులు పాల్గొన్నారు.

## ఇష్టంతో కష్టపడి చదివితేనే భవిష్యత్తు

**ప్రజాపక్షం/నందికొండ:** ప్రతి విద్యార్థి ఇష్టంగా కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి స్వప్న అన్నారు. శనివారం రాత్రి నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో నిర్వహించిన 37వ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయి పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, ఎంఈఓ తరి రాములుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేపటి దేశ భవిష్యత్తు నేటి విద్యార్థులేనన్నారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలో చక్కని అలవాట్లను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు రాందాస్, పాఠశాల ఉపాధ్యాయులు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# విద్యా నిలయంగా 'మంథని'ని తీర్చిదిద్దుతా

## రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు





ప్రజాపక్షం/మంథని: మంత్రిపురిగా విరాజిల్లుతున్న మంథనిని విద్యానిలయంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంథని పట్టణంలోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో శనివారం కాకతీయ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. ఆనాడు ఉన్నత విద్యా శాఖ మంత్రిగా తాను ఈ ప్రాంతంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన జరిగేలా చూశామని తెలిపారు. అలాగే విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ కళాశాలలను తీసుకువచ్చినట్లు తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో ఇంగ్లీస్ మీడియం స్కూళ్లు స్థాపిస్తామన్నారు.పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య సాధనలో ముందుండాలన్నారు. పట్టుదలతో చదువుకుని మంథని ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలనిఆకాంక్షించారు. మంత్రికి పాఠశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించారు. అంతకు ముందు మిమిక్రీ ఆర్టిస్ట్ వెంకీ మంకీ మిమిక్రీ ఆకట్టుకుంది. అలాగే చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

### మృతుల కుటుంబాలకు పరామర్శ

మంథని మున్సిపల్ పరిధిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. మంథని పట్టణంలోని సత్యసాయినగర్‌లో రావికంటి దామోదర్, పెంజెరుకట్ట వీధిలో రిటైర్డ్ ఎంపీడీఓ ఇనుముల రమేష్ భార్య సుమ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను ఓదార్చారు. మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్ రావికంటి సతీష్, నాయకులు శశిభూషణ్ కాచే,ఆకుల కిరణ్, వొడ్నాల శ్రీనివాస్, ముస్కుల సురేందర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీపాదరావు జయంతి

మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలను మంథనిలో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మంథనిలోని శ్రీపాదరావు విగ్రహాలకు నివాళులర్పించారు.పట్టణంలోని శ్రీపాద చౌక్, రావులచెరువు కట్టలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు.ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీపాదరావు ఆశయ సాధనలో ముందుకు సాగుతామని, ఈ ప్రాంతానికి వన్నె తెచ్చినమహానాయకుడు శ్రీపాదరావు అని కొనియాడారు.మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెంద్రి రమాసురేష్ రెడ్డి,మండలఅధ్యక్షుడు ఐలి ప్రసాద్,పిఏసిఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, నాయకులు శశిభూషన్‌కాచే, ముస్కుల సురేందర్‌రెడ్డి, బండారి ప్రసాద్, ఆకుల కిరణ్ ఉన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలోప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఈ విషయాన్ని జగిత్యాల జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆ ప్రకటన లో వెల్లడించారు.

## ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని స్థానిక పద్మనాయక కళ్యాణ మండపంలో వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ముందస్తు మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిత్యం బిజీబిజీగా ఉండే మహిళలు ఆట పాటలతో సరదాగా గడిపారు. గెలుపొందిన మహిళలు, బాలికలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

## శ్రీనిధి స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: హైదారాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్‌ను డీఆర్డీవో, ఢిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన సుమారు 200 స్టాల్స్‌ను జగిత్యాలజిల్లా శ్రీనిధి ఒలంపియాడ్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు సందర్శించారు.

## 110మందికి ఉచిత వైద్య పరీక్షలు



ప్రజాపక్షం/ హుస్నాబాద్: ఉచిత వైద్యశిభిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతాయని వాటిని పేద ప్రజలు వినియోగించుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి అన్నారు. అదివారం హుస్నాబాద్ పట్టణంలోల బిగ్ టి వి సౌజన్యంతో సివిఎం హస్పిటల్ కరీంనగర్ బాలవికాస సహకారంతో ఉచిత వైద్యశిరాన్ని అయన ప్రారంబించారు. అయన మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరు తన దైనందినత జీవితంలో ఎన్నో రోగాలతో భాదపడుతున్నారని అలాంటి వారు నిర్లక్ష్యం చేయకుండ వైద్యం చేయించుకొవాలని సూచించారు. 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్యులను సహకార సంఘం చైర్మెన్ బొల్లి శెట్టి శివయ్య సాలువతో సన్మానించారు. హస్పిటల్ చైర్మెన్ డాక్టర్ చట్ల శ్రీధర్ ఎండి, వైద్యులు శివరాం, రజిత, నిర్మల, టి శ్రీమతి లు వైద్య సేవలు అందించారు. ప్రజాప్రతినిధులు మాజి కౌన్సిలర్లు, చిత్తారిపద్మ రవిందర్ , బిఅర్ ఎస్ నాయకులు ఐలేని మల్లికార్జున్‌రెడి, వల్లపు రాజు, సరోజన, హసన్, కమల రాజయ్య ఉన్నారు.

## జాతీయ స్థాయి ఫ్రాంచైజీ అవార్డులు



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణానికి చెందిన బచ్‌పన్ ప్లే స్కూల్ ఎపిహెచ్‌ఎస్ బ్రాంచీలకు 2024–25 విద్యా సంవత్సరానికిగానుజాతీయస్థాయి ఉత్తమ ఫ్రాంచైజీ అవార్డులు అందుకున్నారు. బచ్‌పన్‌కు ఇన్నోవేటివ్ లెర్నింగ్ స్పేస్ విభాగంలో, ఎపిహెచ్ ఎస్ స్టెల్లార్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ విభాగంలో అవార్డులు దక్కాయి. శనివారం న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొని స్కూల్ డైరెక్టర్లు గడ్డం రాణి రెడ్డి, వెల్మ సమతరెడ్డిలకు అవార్డులు అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతిసారి జాతీయ స్థాయిలో అవార్డులు సాధిస్తు పిల్లల నైపుణ్యాలను పెంచడానికి మారుతున్న ప్రపంచంతో పోటీ పడుతూ ముందుకు సాగడానికి కావాల్సిన అన్ని వసతులను, టీచింగ్ పద్ధతులను అవలంభిస్తున్న పాఠశాల యజమాన్యాన్ని పలువురు అభినందించారు.

## ఉపాధ్యాయుడు శంకర్‌గౌడ్‌కు సన్మానం



ప్రజాపక్షం/ రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల సిరిసిల్లలో భౌతిక శాస్త్రం భోధిస్తున్నపాకాలశంకర్‌గౌడ్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌లోసన్మానించారు. బండి సంజయ్ మాట్లాడుతూ శంకర్ గౌడ్ 27 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తున్నారని, వినూత్న ఆవిష్కరణలకై నిరంతరం పాటుపడుతున్నారని అన్నారు. విద్యార్థులు సహ పాఠ్యాంశాల్లో కూడా ముందుండేలా ప్రోత్సాహిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికారిక ప్రతినిధి సంగప్ప, నాయకులు సంపత్, అనిల్ కుమార్, శ్రీహరి, వేధ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాద రావు సేవలు అపూర్వం

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. మాజీ స్పీకర్ శ్రీపాద రావు జయంతి వేడుకలను జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీస్ ఆద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు చిత్రపటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వివిధ శాఖల జిల్లా అధికారులు నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఉన్నతస్థితికి చేరేందుకు చదువే ఆయుధం

### సిరిసిల్ల కలెక్టర్ సందీన్‌కుమార్ ఝు



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: జీవితంలో ఉన్నత శిఖరాలను అధిగమించేందుకు చదువే అత్యుత్తమ ఆయుధమని మెరుగైన ఫలితాలు సాధించేందుకు నిత్యం సాధన చేయడంముఖ్యమని రాజన్నసిరిసిల్లా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝు పేర్కొన్నారు.ఆదివారం మండలంలోని దుమాల ఏకలవ్య రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యాలయంలోని తరగతి గదులు, డైనింగ్ హాల్, స్టోర్‌రూం, టాయిలెట్స్, మైదానం, విద్యార్థులకు కల్పిస్తున్న ఇతర మౌళిక వసతులు సదుపాయాలు తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని చదువే సమాజంలో విలువైన,అత్యుత్తమైన ఆయుధమని తెలిపారు.విద్యార్థులు చదువులో రాణించి తమ తల్లితండ్రుల పేరును నిలబెట్టాలని అన్నారు.చదువును మించిన ఆయుధం లేదని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.విద్యాలయంలోని ప్రతి తరగతిగదిని సందర్శించి ఏమైన సమస్యలు ఉన్నాయా,భోజనంఎలా ఉంది అని వివరాలను తెలుసుకున్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంతో ఏవిధంగా సన్నద్ధమగుతున్నరని ఆరాతీశారు.అన్నిసబ్జెక్టులకు సంభందించిన ప్రశ్నలను సమాధానాలు రాబట్టారు.ప్రతినిత్యం సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు.విద్యార్థులకు భోధన అందించడంతో పాటు అన్ని రకముల మౌళిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.డైనింగ్ హాల్‌ను సందర్శించి భోజన తయారి విధానాన్ని స్టోర్‌రూం,నిర్వహణ పరిశీలన చేశారు.పరిసర ప్రాంతాలలో గడ్డిని శుభ్రం చేసి తొలగించాలని గ్రామపంచాయితి కార్యదర్శిని కలెక్టర్ ఆదేశించారు.తనిఖీలలో ఉపాధ్యాయులు ,సిబ్బంది అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మహనీయుల జీవితాలు.. వ్యక్తిత్వ వికాస పాఠాలు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : మహనీయుల జీవితాల నుంచి మనం అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పాల్గొన్నారు. దుదిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీ హర్ష మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ధన్వాడలో పుట్టి శాసనసభ స్పీకర్ స్థాయికి ఎదిగిన మహనీయులు దుద్దిల శ్రీపాదరావు అని, ప్రతి ఒక్కరితో మంచిగా వ్యవహరిస్తూ తన జీవితం కొనసాగించారన్నారు. న్యాయవాదిగా వృత్తి కొనసాగిస్తున్న సమయంలో ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ స్థాయికి ప్రజల ఆశీర్వాదంతో ఎదిగారని, నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న వ్యక్తి శ్రీపాద రావుఅని అన్నారు. మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి జీవితంలోని ముఖ్యంశాల నుంచి మనం వ్యక్తిత్వ వికాస పాఠాలు అనేకం నేర్చుకోవచ్చని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక మంది స్థానిక నాయకుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని, అదే రీతిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి జరుపుకోవడం చాలా సంతోషకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డివైస్ ఓ సురేష్, డిఈఓ మాధవి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని రంగినేని గార్డెన్స్‌లో ఘనంగా రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. టోర్నమెంట్ కమిటీ చైర్మన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌లు ప్రారంభించారు. ఈ సంధర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మేడిపల్లి సత్యం మాట్లాడుతూ శ్రీపాదరావు అజాత శత్రువు అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారని, వారి ఆశయాలను శ్రీధర్‌బాబు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. వారి ఆశయాలను శ్రీధర్‌బాబు కొనసాగిస్తున్నారని సూర్యచంద్రులున్నంతవరకు ప్రజలు వారిని మరిచిపోరని అన్నారు. శ్రీపాదరావు జయంతి సంధర్భంగా రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి, కరాటే చీఫ్ ఆర్గనైజర్లు వసంత్ కుమార్‌కు సురభి వేణుగోపాల్‌కు అభినందనలు తెలియజేశారు. రెండవ డివిజన్ మాజీ కార్పోరేటర్ కాశెట్టి లావణ్య శ్రీనివాస్, ఎండితాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, అర్ష మల్లే శం, నగేష్ ముదిరాజ్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, దన్నసింగ్, సుదర్శన్, బొబ్బిలి విక్టర్ తదితరులున్నారు.

## శ్రీపాదరావుతో కలిసి పనిచేయడం అదృష్టం

### ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకుని ఆదివారం కరీంనగర్ డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో జరిగిన కార్యక్రమానికి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్,డిసిసి మైనార్టీ సెల్ అధ్యక్షుడు యం.డి తాజ్ హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని బస్టాండ్‌వద్ద నగర కాంగ్రెస్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పురుమల్ల శ్రీనివాస్, ఆరెపల్లి మోహన్‌తో కలిసి శ్రీపాదరావు విగ్రహానికినివాళులర్పించారు.అన్నదానకార్యక్రమాన్ని జీవన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. 1983,89లో ఎమ్మెల్యేగా తనకు శ్రీపాదరావుతో కలిసి పనిచేసే అవకాశం వచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ నుంచి శ్రీపాదరావు ముఖ్యమంత్రి అవుతారని భావించామని, ఉమ్మ డి ఏపి శాసనసభాపతిగా పని చేసిన సమయంలో అధికార పక్షం వారికి, ప్రతిపక్షం వారికి ఒకే రకంగా అవకాశం ఇచ్చే వారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా శ్రీధర్‌బాబు వారి ఆశయాలను కొనసాగిస్తున్నారని కొనియాడారు. నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, ఎండి తాజ్, మునిగంటి అనిల్, అర్ష మల్లేశం, గంట కళ్యాణి శ్రీనివాస్, కర్ర రాజశేఖర్, పడిశెట్టి భూమయ్య, వంగల విద్యాసాగర్, దన్న సింగ్, బషీరుద్దీన్, సిరికొండ శివప్రసాద్, పెద్దిగారి తిరుపతి, మాదాసు శ్రీనివాస్,మూల జయపాల్, దండి రవీందర్, చింతల కిషన్, రామిడితిరుపతి, అబ్దుల్ భారీ, బత్తులరాజకుమార్,కొట్టె ప్రభా కర్, కుంభాల రాజకుమార్, యనమలమంజుల,పర్వతంమల్లేశం, జొన్నల రమేష్, జ్యోతి రెడ్డి, ముల్కల కవితయోనా, హస్తపురం తిరుమల ఉన్నారు.

## అలివేలు సమ్మిరెడ్డికి సేవా పురస్కారం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రంగస్థల కళాకారుడు అలివేలు సమ్మిరెడ్డి ఆదివారం మాజీ స్పీకర్ శ్రీపాదరావు సేవా పురస్కార్ 2025 అవార్డును అందుకున్నారు. తెలంగాణ రంగస్థలం కళాకారునిగా అనేక సంవత్సరాలుగా మరుగున పడ్డ కళలను వెలుగులోకి తెస్తూ ఆయన చేస్తున్న విశేష కృషికి గాను దుద్దిళ్ల శ్రీపాదరావు సేవా పురస్కార్‌కు అలివేలు సమ్మిరెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ చేతుల మీదుగా అలివేలు సమ్మిరెడ్డి సేవా పురస్కార్ అవార్డు అందుకున్నారు. అలివేలు సమ్మిరెడ్డి మాట్లాడుతూ ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసిన తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు కృపాదానం కు కృతజ్ఞతలు తెలియజేశారు. నిష్కలమైన రాజకీయ నాయకులు శ్రీపాదరావు పేరిట కలిగిన సేవా పురస్కారాన్ని అందుకోవడం సంతోషకరమన్నారు. ఆయన మన మధ్యలో లేకపోయినా శ్రీపాదరావు పేరిట సేవా పురస్కారాలను అందిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

## టీచర్ల బకాయిలు చెల్లించాలి



ప్రజాపక్షం /రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించవల్సిన డిఏలు, పిఆర్సి పెండింగ్ బిల్లులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల బకాయి బిల్లులు చెల్లించాలని డిటిఎఫ్ రాజన్న జిల్లా అధ్యక్షులు దొంతుల శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గంభీరావుపేట కేజిబు పీజి క్యాంపస్‌లో డిటిఎఫ్ మండల అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పిహెచ్‌ఎం దైత శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్లు ఎండి. బద్రొద్దిన్, ఎం. దేవేంద్రం, కే. శ్రీనివాస్‌రెడ్డి, కే. శ్రీనివాస్, గంభీరావుపేట మండల ప్రధాన కార్యదర్శి శీల కుమార్, దోసల శ్రీనివాస్, పి. పరశురాములు, దోసల మధు, చీకట్ల రాజు, ఎస్. లక్ష్మణాచారి, శ్రీకాంత్‌రెడ్డి, ఎర్ర అంజయ్య, పాలోజి నారాయణ, డి. సతీష్, పాశం తిరుపతి, ఎస్. రాజు పాల్గొన్నారు.

## ఎస్సిలను ఎబిసిడిలుగా వర్గీకరించాలి



ప్రజాపక్షం/కరీంనగర్: ఎస్సీలను ఏబిసిడిలుగా వర్గీకరించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ డిమాండ్ చేశారు. కరీంనగర్ కృషిభవన్‌లో ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా రుద్రరావు రాంచందర్, జేరిపోతుల లత, రామంచ భారత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీల లోని 59 కులాలకు న్యాయం జరగాలంటే మాదిగలకు 11 రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. అందుకోసం జాతిని చేయడం అందరి బాధ్యత అన్నారు. షెమిమ్ అక్తర్ కమిషన్ మార్చి 10న కమిషన్ నివేదికను లోపాలు సవరించి మాదిగలకు న్యాయం చేయాలన్నారు. ఈ నెల 6 కరీంనగర్‌లో వెయ్యి గొంతులు, లక్ష డప్పుల సన్నాహక కార్యక్రమానికి మందకృష్ణ హాజరవుతున్నారని, విజయవంతం చేయాలని కోరారు. బోయిని కొమురన్న, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, బోయిని సమ్మయ్య, ఎంఎస్‌పి జిల్లా అధికార ప్రతినిధి దండు అంజయ్య, ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరి రాజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి తడగొండ శంకర్, జిల్లా కార్యదర్శి అంబాల మధునయ్య, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచాల నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు దోమకొండ శ్రీనివాస్, దోమకొండ నరేష్, దోమకొండ అనిల్, సాగర్, నరేష్, రవి, సదానందం, రమేష్, కనకం నరేష్, గుండ్ల గణపతి, దండు వరలక్ష్మి , రాజేశ్వరి, వాణి, రాజమల్లు, లక్ష్మణ్‌లున్నారు.

## ఆల్ఫోర్స్‌లో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్‌లోని రేకుర్తిలోని ఓ ఫంక్షన్‌హాలులో అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్‌లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఫన్ ఎన్ ఫెరోలిక్ పేరుతో మధురానుభవాలతో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉపాధ్యాయులు నిర్దేశించినటువంటి మార్గదర్శకాలను చక్కగా పాటించాలని, లక్ష్యాలు సాధించే విధంగా శ్రమించాలని చెప్పారు. తరగతి గదుల్లో బోధించిన విషయాలు విద్యార్థుల జీవితాలపై చాలా ప్రభావం చూపుతుందని, వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులను సాధించి విద్యార్థి జీవితంలో పొందేటువంటి మొట్టమొదటి పట్టాను చాలా ప్రశంసనీయంగా చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాలలో చదువుకున్న రోజులు చాలా మధుర జ్ఞాపకాలను మిగులుస్తాయని చెప్పారు. విద్యార్థులకు వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తూ పారితోషికాలను అందజేస్తున్నామని తెలిపారు. ఉన్నత చదువులు ఉన్నత ఆశయాలను నెరవేరుస్తాయని సూచించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉత్తమంగా విద్యను అందించిన విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డిని, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

## లక్ష్య సిద్ధితో సాధన చేస్తే ఉన్నత ఫలితాలు

### మానేరు విద్యాసంస్థల చైర్మన్ అనంతరెడ్డి




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్క విద్యార్థి లక్ష సిద్ధితో సాధన చేస్తే ఉన్నత ఫలితాలను సాధిస్తారని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మానేరు క్యాట్ 2025 పరీక్ష అని మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్, జగిత్యాలలోని మానేరు విద్యాసంస్థలలో ఆదివారం మానేరు క్యాట్ 2025 పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి సుమారు 1437 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంతకుముందు మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి క్యాట్ పరీక్ష పత్రాన్ని విడుదల చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మానేరు విద్యాసంస్థల ఆద్వర్యంలో గతంలో రెండు సార్లు పెద్ద ఎత్తున క్యాట్ పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీపరీక్షలను ఎదుర్కోవడానికి ఇలాంటి పరీక్షలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. తమ విద్యార్థులు జాతీయస్థాయిలలో ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. సైన్స్ ఒలంపియాడ్‌లో మానేరు సిబిఎస్‌ఈ విద్యార్థి ఆత్రేయ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఇటీవల పుదుచ్చేరిలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో జిల్లా విద్యాశాఖ ఆద్వర్యంలో మానేరు పాఠశాల విద్యార్థిని అర్పా యుస్రా పాల్గొని పలువురి మన్ననలను పొందినట్లు తెలిపారు. క్యాట్ 2025 పరీక్షలో తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు త్వరలో నగదు బహుమతులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. క్యాట్ పరీక్షను విజయవంతం చేసిన తల్లిదండ్రులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డితో పాటు ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫోకస్

# ఆరోగ్యం

# వేసవిలో తినాల్సిన పండ్లు ఇవే..



**ఎం**డలు మండుతున్నాయి. రాబోయే రెండు నెలల్లో దేశ వ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వరుసగా గత రెండేళ్లు కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ లేనంత వేడిమిని అనుభవించాం. మళ్లీ అలాంటి పరిస్థితులే పునరావృతమయ్యే ప్రమాదం కనిపిస్తున్నది. అందుకే, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ సీజన్‌లో వచ్చే ఫలాలు తినడం లేదా రసాలను తీసుకోవడం అత్యవసరమని వైద్యులు అంటున్నారు. వేసవిలో దొరికే పండ్లలో ప్రధానమైనది పుచ్చకాయ. పుచ్చకాయ ముక్కలు నాలుగు తింటే ఊరట లభిస్తుంది. ఇది ఆరోగ్యానికి ఎంతో మంచిది. వేసవిలో శరీరం నష్టపోయే నీటి శాతాన్ని త్వరగా భర్తీ చేస్తుంది. అంతేకాదు, శరీరానికి అవసరమైన వివిధ రకాల పోషక పదార్థాలను అందిస్తుంది. గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. డయాబెటిక్ రోగులు క్రమం తప్పకుండా ఈ పండులు తినవచ్చు. దీని గుజ్జు చర్మ సౌందర్య సాధనంలా ఉపయోగపడుతుంది. ఎండాకాలంలో తరచు వేధించే దాహం సమస్యను తీరుస్తుంది. వేసవిలో మాత్రమే కనిపించే తాటి ముంజెలు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఉదర సంబంధిత క్యాన్సర్, గర్భిణుల్లో రక్త హీనత, కీళ్ళనొప్పులు, మూత్ర పిండాల్లో రాళ్లను నివారిస్తుంది. లభించినంతకాలం వీటిని రోజూ తినడం మంచదని నిపుణులు చెప్తున్నారు. దాదాపు ఇదే కోవకు చెందేవి కొబ్బరి బోండాలు. కొబ్బరి నీళ్లలో అనేక పోషకాలు ఉన్నాయి. ఈ నీరు అధిక ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. మూత్ర విసర్జన సాఫీగా జరుగుతుంది. తత్ఫలితంగా కిడ్నీలకు సంబంధించిన వ్యాధులు దరి చేరవు. కొబ్బరి నీళ్లలో గ్లూకోజ్ కలుపుకుని తాగితే వేసవి బడలిక, నీరసం చాలా త్వరగా తగ్గిపోతుంది. నారింజ పండులో విటమిన్లు, లవణాలు, ఎక్కువగా ఉంటాయి. వీటిలో విటమిన్ 'ఎ', 'బి', 'సి' పుష్కలంగా లభిస్తుంది. కాల్షియం ఈ పండులో ఎక్కువగా ఉంటుంది., నారింజ సులభంగా జీర్ణ అవుతుంది. నారింజను వాడితే, అజీర్ణవ్యాధి తగ్గిపోతుంది. మలబద్ధకం తగ్గుతుంది. శరీరానికి శక్తినిస్తుంది. మూత్ర సమస్యలను తగ్గిస్తుంది. వీటితోపాటు అరటి, రేగు, ఖర్జూరం, బొప్పాయి, ఆల్‌బుకారా, అంజీరా, కర్బూజా, పైనాపిల్, సపోట తదితర పండ్లను తినడం వేసవిలో ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. పండ్లలో అనేక రకాల విటమిన్లు, మాంస కృతులు సమృద్ధిగా ఉంటాయి. 5 నుండి 20 శాతం వరకు పిండి పదార్థాలు ఉంటాయి. గ్లూకో జ్, ఫ్రక్టోజ్‌లు సమపాళ్లలో ఉండటం, ఆర్గానిక్ ఆమ్లాలు అధికంగా ఉండటం వల్ల వేసవి తాపం కారణంగా శక్తి నశించిన వారికి వెంటనే చక్కటి ఉప శమనాన్నిస్తాయి. రక్తంలో పేరుకు పోయే కొవ్వుని తగ్గించి, గుండె పోటు ప్రమాదాన్ని చాలా వరకూ నివారిస్తాయి. కేన్సర్ కారకాలను తొలగించడంలోనూ ఫలాల కీలక పాత్ర పోషిస్తాయి.శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఉపయోగ పడతాయి. వేసవిలో వడదెబ్బ, డిహైడేషన్, అతిసారం తదితర వ్యాదుల నుండి రక్షించుకునేందుకు కూడా ఫలాలు అవసరం. కాబట్టి ఈ వేసవిలో పండ్లను ఆహారంలో భాగంగా చేసుకోవడం అత్యవసరం.

## అరటిపువ్వుతో ఆరోగ్యం

**దా**దాపుగా అన్ని దేశాల్లోనూ లభించే అరటి పండే కాదు... అరటి పువ్వు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ పువ్వు గుండె రూపంలో ఉంటుంది. మన ప్రాంతంలో కొంతమంది అరటిపువ్వును ఒక కురగాయగా పరిగనిస్తారు. అరటిపువ్వును సలాడ్‌గా, సూప్‌గా తయారుచేసి వాడుతారు. కొన్ని గిరిజన ప్రాంతాలలో అరటిపువ్వును ఎండబెట్టి, పొడిచేసి. దానితో చపాతీలు చేసుకుంటారు. అరటిపూవు జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం సమస్యకు తెరపడుతుంది. ఇందులోని ఐరన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ తదితరాలు నాడీవ్యవస్థ సక్రమంగా పని చేసేలా చూస్తాయి. ఇందులోని విటమిన్ 'సి' వ్యాధి నిరోధక శక్తిని అభివృద్ధి చేస్తుంది. మహిళల్లో బహిష్టు సమస్యలను నివారిస్తుంది. కాగా, అరటి పండు ఆరోగ్యకరమైన ఫలంగానేగాక, అందాన్ని ఇనుమడింపచేసే సాధనంగా కూడా ఉపయోగపడుతుంది. చర్మాన్ని తేమగా ఉంచడానికీ, వయసు పెరిగిన ఆనవాళ్లను తెలియకుండా చేయడానికీ, పగిలిన పాదాలను అందంగా తీర్చిదిద్దుకోవడానికీ అరటిపండు ఎంతో ఉపయోగపడుతుంది. పండిన అరటిపండును మెత్తని గుజ్జులా చేసుకుని, ముఖానికి పట్టించి, పావుగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే, ముఖానికి ఖరీదైన మాయిశ్చరైజర్లు ఇవ్వలేని తేమ, నునుపుదనం వస్తాయి. కొందరి ముఖం బయటికెళ్లిన కాసేపటికే జిడ్డుగా మారిపోతుంది. ఈ సమస్య తగ్గాలంటే పండిన అరటి పండు గుజ్జుకు, నాలుగు చుక్కల నిమ్మరసం కలిపి దానిని ముఖానికి మాస్క్‌లా వేసుకోవాలి. ఈ విధంగా చేస్తే జిడ్డు వదిలిపోతుంది. ఎన్నిసార్లు కండిషనింగ్ చేసినా జుట్టు పొడి బారుతుంటే. పండిన అరటి పళ్లు తీసుకుని, దానిలో కొద్దిగా పెరుగు కలిపి. మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి. దీన్ని తలకు పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే జుట్టు మెరుస్తూ, అందంగా మెరిసిపోతుంది. అరటిపళ్లలోని 'ఇ'విటమిన్ ముఖంలో వయసు తాలూకు ఛాయలను కనిపించకుండా చేస్తుంది. దీనికి ఓట్‌మీల్, కొబ్బరిపాలు కూడా జోడించి ముఖానికి మాస్క్‌లా వేసుకొంటే మృతకణాలు తొలగిపోతాయి. అరటి పండు గుజ్జుని పాదాలకు పట్టిస్తే, వాటికి తగినంత తేమ అంది పగుళ్లు రాకుండా ఉంటాయి.



**వే**సవిలో ప్రతి ఒక్కరికీ ఎక్కువ నీరు అవసరమవుతుంది. రోజుకు సుమారు మూడు లీటర్ల నీళ్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. నీరు చర్మంలోని కాలుష్యాన్ని బయటకు నెట్టి, తేమను కాపాడుతుంది. రక్తాన్ని శుద్ధిచేస్తుంది. ఫ్రిజ్‌లకంటే, కుండలో నీళ్లు తాగడం ఆరోగ్యానికి శ్రేయస్కరం. నీటితోపాటు, సమయం దొరికినప్పుడు మజ్జిగ తీసుకోవడం కూడా అవసరం. మజ్జిగ చలవనిస్తుంది పోషక విలువలు, విటమిన్లు ఇందులో ఉంటాయి. మజ్జిగ జీర్ణశక్తిని పెంచుతుంది. వ్యాధి నిరోధక శక్తిని ఇనుమడింపచేస్తుంది. ఇందులో పొటాషియం, కాల్షియం, రైబోఫెవిన్ , విటమిన్ బి12 ఉన్నాయి. పల్చగా చేసిన మజ్జిగలో కొద్దిగా నిమ్మరసం, ఉప్పు, పంచదార కలుపుకుని తాగితే వేసవిలో ఉండే అధిక దాహార్తి తగ్గి శరీరానికి కావలసిన లవణాలు లభిస్తాయి. కాగా, ఇంట్లో సులువుగా తయారు చేసుకునే వేసవి పానీయాల్లో సజ్జా జ్యూస్ ఒకటి. దీని తయారీకి సబ్జాగింజలు, బెల్లం, మిరియాల పొడిని వినియోగిస్తారు. ఇది శరీరంలో వేడిని నియంత్రిస్తుంది. పాలేట్, నియాసిన్, విటమిన్ 'ఇ' అధికంగా కలిగి శరీరంలో పేరుకున్న వ్యర్థాలను తొలగించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. పుచ్చకాయ రసంలో పొటాషియం, విటమిన్ 'ఎ' ఎక్కువగా ఉంటాయి. సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల నుండి ఇందులో ఉండే లైకోపిన్ చర్మాన్ని రక్షిస్తుంది. పుచ్చకాయ వల్ల, జీర్ణక్రియ ఉత్తేజం అవతుంది. ఇక నిమ్మరసంలో విటమిన్ 'సి' ఎక్కువగా ఉంటుంది. నిమ్మ ఆరోగ్య ప్రదాయని. నిమ్మలోని పోషక విలువలు మెదడు చురుకుగా పనిచేయడానికి, దంతాలు ఎముకలు పటిష్టంగా పని చేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

## ఎక్కువ నీరు అవసరం..



రోజూ నాలుగుసార్లు నిమ్మరసం తాగితే పచ్చ కామెర్ల వ్యాధి తగ్గుముఖం పడుతుందని అంటారు. వేడి నీటిలో నిమ్మరసం పిండి తాగినట్టయితే ఉబ్బసం నుంచి ఉపశమనం లభిస్తుంది. రోగనిరోధక శక్తిని ఇస్తుంది. ఇందులోని సిట్రిక్ యాసిడ్ మూత్ర పిండాలలోని రాళ్ళను కరగదీస్తుంది. వేసవికాలంలో చాలామంది సేవించే పానీయం చెరుకురసంస ఇందులో ఐరన్, ఫాస్పరస్ క్యాల్షియం, మెగ్నీషియంస పొటాషియం తదితరాలు ఉంటాయి. ఇవి రొమ్ము , ప్రోస్టేట్ కేన్సర్ కారకాలతో పోరాడుతాయి. మూత్ర పిండాలు గుండె, మెదడు పనితీరుని మెరుగు పరుస్తాయి. మామిడి రసంలో కొంచెం తేనె కలిపి తగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. నిమ్మ మాదిరిగానే నారింజలోనూ విటమిన్ 'సి' ఎక్కువగా ఉంటుంది. పుదీనా నీరు తాగటంవలన డీహైడ్రేషన్ నుంచి శరీరాన్ని రక్షించుకోవచ్చు.పుదీనా కషాయంలో తేనె కలిపి తీసుకుంటే జీర్ణక్రియ సాఫీగా జరిగి ఆకలి బాగా వేస్తుంది. దోసకాయ, పుచ్చకాయ, ద్రాక్ష జ్యూస్‌తో పాటు ఎండు ఖర్జూరం నానబెట్టిన నీళ్లు, సగ్గుబియ్యం కాచిన నీరు కూడా వేసవిలో శరీరానికి మేలు చేస్తాయి.

## ఆశ్చర్యపరిచే నిజాలు..

**మ**నిషి శరీరంలో ఉన్న ఎముకలలో సగ భాగం కాళ్లు, చేతుల్లోనే ఉంటాయి
మోచేతిని నాలుకతో తాకించడం అసాధ్యం
మొత్తం శరీరం బరువులో సగ భాగం బరువు కండరాల బరువే అవుతుంది
శరీరంలో రక్తనాళాలు లేని ఏకైక భాగం కంటిలోని కార్నియా (కంటి గుడ్డు ముందు భాగం)
అప్పుడే పుట్టిన పసి పిల్లలు రంగులని గుర్తించలేరు
కళ్లు తెరిచి తుమ్మడం అసాధ్యం
కనురెప్పలు సంవత్సరానికి 1,00,00,000 సార్లు కొట్టుకుంటాయి
ప్రతీ క్షణం శరీరంలో 20 లక్షల ఎర్ర కణాలు చచ్చిపోతాయి
ఒక పైంటు రక్తదానం చేసి నాలుగు ప్రాణాలు కాపాడవచ్చు
ఒక వారంలో శరీరంలోని సగం ఎర్ర కణాలు కొత్త వాటితో పునర్నవీకరించబడతాయి
శరీరంలో ఉండే రక్తనాళాలని వరుసగా గొలుసుకట్టుగా అమర్చితే అవి 60,000 మైళ్లు విస్తరిస్తాయి. అది భూమి చుట్టుకొలతకు రెండింతల పొడవు ఉంటుంది.
కవలలో ఒకరికి ఒక పన్ను రాకపోతే, చాలా వరకు అదే పన్ను ఇంకొకరికి కూడా రాకపోవచ్చు

# సంక్షేమ బోర్డుల నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసే విధంగా కుట్రలు పన్నుతున్నదని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ ఆరోపించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో మభాసభలు ఆదివారం జగద్గిరి గుట్ట ఆజ్‌బెస్టాస్ కాలనీ అడ్డా వద్ద నిర్వహించారు. ఈ మహాసభలకు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉజ్జిని రత్నాకర్‌రావుతో పాటు ఎండి యూసుఫ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి పోరాట ఫలితంగానే భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ బోర్డు పుంచి నిర్మాణ కార్మికులు సుమారు 13 రకాల సేవలు, సంక్షేమాన్ని ప్రభుత్వం నుంచి పొందవచ్చన్నారు. హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి భవన నిర్మాణ కార్మికులు సంఘటితమై ఈనెల 28న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సుమారు రూ.5 వేల కోట్లు ఉన్నాయని, వాటిని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగిస్తే నెల వారీగా రూ. 5 వేలు పెన్షన్ ఇవ్వవచ్చన్నారు. భవన నిర్మాణ అడ్డాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి రూ.6 వేలు పెన్షన్‌గా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌గౌడ్, సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగప్ప, పరమేశ్వర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, నియోజకవర్గ అధ్యక్షులు హరినాథ్, సంఘం నాయకులు సాయిలు, నర్సింగ్ రావు, జంగయ్య, మోహన్ రావు, వెంకటరమణ, సామిల్, ముసలయ్యతో పాటు సుమారు 150 మంది భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

# దళితుల అభివృద్ధి కాగితాలకే పరిమితమా?

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** దళితుల అభివృద్ధిని పాలకులు కాగితాలకే పరిమితం చేశారని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో రెమిడాల రాజు అధ్యక్షతన ఈనెల 10,11,12 తేదీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగే రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసురత్నం మాట్లాడారు. స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలైన దళితులు అన్నిరంగాల్లో వెనుకబడే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి, కుల నిర్మూలనలను పాలకులు కాగితాలకే పరిమితం చేశారని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దళిత బలహీన వర్గాల హక్కుల, అభివృద్ధి కోసం కల్పించిన రిజర్వేషన్లు పాలకులు అనుసరిస్తున్న విధానాలతో అమలుకు నోచుకోవడం లేదన్నారు. సరళీకరణ, ఆర్థిక విదానాలు, ప్రైవేటీకరణ విధానాలతో రోజురోజుకు ప్రభుత్వ రంగ పరిశ్రమలు లేక ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటికరణ చేయడంతో ఉపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపాధి కల్పించే సంస్థలు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానం ప్రవేశ పెట్టి రిజర్వేషన్లు ఉనికికే ప్రమాదం తెచ్చారన్నారు. తరతరాలుగా అణిచివేత, అంటరానితనం, వివక్ష, దోపిడి, అవమానియ దురాచారాలకు అత్యంత దారుణంగా దళితులు బలవుతున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దళితుల అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడలో జరిగే రాష్ట్ర సమావేశాలకు దళితులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెడవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళితులు ఆర్థిక, రాజకీయంగా రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ, ఎస్సి,ఎస్టి సబ్ ప్లాన్ బలోపేతం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్, ఎఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి యడవెల్లి శ్రీకాంత్, పాల్వాయి పున్నయ్య, ఏడిండ్ల అశోక్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు వద్దన్న సంఘాలకు విమర్శించే అర్హత లేదు



ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** సింగరేణిలో ఎన్నికలు వద్దన్న సంఘాలకు ఎఐటియుసిపై విమర్శలు చేసే అర్హత లేదని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కరరావు భవన్లో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి ఏడవ సారి జరిగిన ఎన్నికల్లో ఎఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిచిన తరువాత యాజమాన్యానికి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగే స్ట్రక్చర్, సిఎండి స్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలని లేఖ రాయడం జరిగిందన్నారు. యాజమాన్యం పది నెలల తర్వాత సెప్టెంబర్ 2024లో గుర్తింపు పత్రం ఇవ్వడం జరిగిందని, నవంబర్ 28న కొత్తగూడెంలో డైరెక్టర్ స్థాయి సమావేశంలో కార్మికుల పెండింగ్ సమస్యలపై అవగాహన కుదిరిందని, వాటిపై ఉత్తర్వులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని సమస్యలను సిఎండి స్థాయి సమావేశంలో మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, సిఎండి పదవీ కాలం పొడిగింపు, ఇద్దరు డైరెక్టర్‌ల నియామకంతో జనవరి, ఫిబ్రవరి నెలల్లో సిఎండి స్థాయి సమావేశం జరుగలేదన్నారు. ఎఐటియుసి బాధ్యతగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తావుంటే, కొన్ని కార్మిక సంఘాలు చౌకబారు విమర్శ లు చేయడం సిగ్గుచేటన్నారు. సింగరేణిలో గుర్తిం పు సంఘం ఎన్నికలు వద్దన్న కార్మిక సంఘాలకు ఎఐటియుసిపై విమర్శలు చేసే నైతిక అర్హత లేదని వారు విమర్శించారు. సమావేశంలో ముస్కె సమ్మయ్య, కవ్వంపల్లి స్వామి, రంగు శ్రీను, ఎంఎగౌస్, గండి ప్రసాద్, ఆకునూరి శంకరయ్య, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, నాయిని శంకర్, సదా మల్లేష్, బిసంతోష్, కుక్కల శ్రీనివాస్, కన్నం లక్ష్మీ నారాయణ, టి మల్లయ్య, మాటేటి శంకర్, పర్లపల్లి రామస్వామి, గుంపుల కుమారస్వామి, కలువల జగన్, చిలుముల రాజయ్య, కోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమచట్టాన్ని నీరుగార్చే చర్యలను కార్మికులు తిప్పికొట్టాలి

సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ చట్టాలను నీరుగార్చే చర్యలను కార్మికులు తిప్పికొట్టాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కె సాబీర్‌పాషా, యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మీనారాయణ అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన ఎఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో మహాసభకు వారు హాజరై మాట్లాడారు. నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకొని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్న కోట్లాది రూపాయల రిజిస్టేషన్ ఫీజును కార్మికుల సంక్షేమం కోసం కాకుండా ఉన్నత వర్గాల సేవలకు దారిమళ్లించడం దారుణమన్నారు. సంక్షేమ చట్టం ప్రకారం సహాయానికి కార్మికుల నుంచి అందుతున్న దరఖాస్తులను బుట్టదాఖలు చేస్తున్నారన్నారు. వేలాది మంది కార్మికులు చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకుంటే గుర్తింపు కార్డులు జారీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సంక్షేమ బోర్డు కొనసాగింపు, ధరలకు అనుగుణంగా వేతనాలు, కూలికోసం, అడ్డాలవద్ద సౌకర్యాలకు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కేంద్రబడ్జెట్లో రూ.1500కోట్లు సంక్షేమ బోర్డుకు కేటాయించాలని, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో భవన నిర్మాణ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సురేందర్‌రెడ్డి, కోరే కృష్ణ, గుంటి మల్లేష్ అధ్యక్షతన జరిగిన మహాసభలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, వాసిరెడ్డి మురళి, వేల్పుల మల్లికార్జున్, పోగుల కోటేశ్వర్ రావు, సర్వ కృష్ణ, సిల్వేరు నర్సింహా రావు, గడ్డం భాస్కర్, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



# భవన నిర్మాణ కార్మికులకు ఆన్‌లైన్ విధానం రద్దు చేయండి



భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/డిండి :** భవన నిర్మాణ కార్మికులకు ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కందుకూరు గ్రామంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం డిండి మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు సమస్యల నిలయంగా మారిందని ఆరోపించారు. కొన్నినెలలుగా కార్మికులకు డబ్బులు ఇవ్వడం లేదని ఆన్‌లైన్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్‌మెంట్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఆన్‌లైన్ ఆప్టేట్ పేరుతో ఆరు నెలలుగా కార్మికులను ఆఫీస్ చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మిక సంక్షేమ బోర్డులో జమ కావాల్సిన సెస్స్ సక్రమంగా వసూలు చేయకపోవడం వల్ల కార్మిక సంక్షేమ నిధులు పెరగడం లేదన్నారు. మెడికల్ చెకప్‌ల పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీపై విచారణ జరిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పోరాటాలకు కార్మిక లోకం ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభలో డిండి మాజీ ఎంపిపి బొడ్డుపల్లి వెంకటరమణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ప్రసంగించారు. మహాసభలో లింగయ్య, దేవయ్య, ప్రవీణ్, సాయిలు, నాగయ్య, చెన్నయ్య, మల్లేష్, నిరంజన్, రాములు, తిరుపతయ్య, సత్తయ్య, శ్రీను, అయోధ్య, ఆంజనేయులు, రవి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు జవహర్ లాల్, ఉసేస్ పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ వద్ద ఎఐటియుసి జెండాను దేవేందర్‌రెడ్డి, మహాసభ వద్ద వెంకటరమణ ఆవిష్కరించారు.

## గద్వాల కోర్టును సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** గద్వాల కోర్టును తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి , జోగులాంబ గద్వాల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి నంది కొండ నర్సింగ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెక్షన్స్ జడ్జి కె.కుష, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి టి.లక్ష్మి , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ఉదయ్ నాయక్ , జూనియర్ సివిల్ జడ్జి మిధున్, తేజా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, ఆర్డిఓ శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## బియ్యం నాణ్యత పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ హాలియా:** తెలంగాణ రాష్ట్రం నుండి దొడ్డు బియ్యాన్ని ఫిలిప్పీన్స్ దేశానికి ఎగుమతి చేసుకునేందుకు ఒప్పందంలో భాగంగా బియ్యం నాణ్యతను పరిశీలించేందుకు ఆ దేశానికి చెందిన అధికారులు, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి ఆదివారం వజ్రతేజ రైస్ క్లస్టర్ లో బియ్యాన్ని పరిశీలించారు. ఆ దేశ నిబంధనల ప్రకారం ఐదు శాతం బ్రోకెన్ తో బియ్యం నాణ్యత ఉండాలని నిబంధనలో భాగంగా క్షేత్రస్థాయిలో బియ్యాన్ని పరిశీలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. ప్రభుత్వం మిల్లర్లకు 25శాతం నుండి 30 శాతం బ్రోకెన్ తో ఇస్తుండగా ఫిలిప్పీన్స్ దేశానికి ఐదు శాతం బ్రోకెన్‌తో ఎగుమతి చేయాల్సి ఉంది. కాగా ఎగుమతి చేసే బియ్యాన్ని ఆ దేశ అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేయడంతో కుకింగ్ ద్వారా బియ్యం నాణ్యతను పరిశీలించనున్నారు. ఇందు కోసం అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనతో నాణ్యతను తేల్చనున్నారు. వారి వెంట అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ జే హరీష్ వైద్య, తేజ క్లస్టర్ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టిపోలు యాదగిరి, ఇంచార్జి తహాసిల్దార్ రఘు, డిటి ముక్తార్, డైరెక్టర్లు చిట్టిపోలు వెంకటేశ్వర్లు, కుక్కడ రమేష్, చిట్టిపోలు రంజిత్, అసోసియేషన్ నాయకులు పేలపూడి బాలకృష్ణ, కొత్త సుదర్శన్, చిత్తనూరు పవన్ పాల్గొన్నారు.

## కొబ్బరికాయల చిరు వ్యాపారులపై దౌర్జన్యాలను నివారించాలి



**ప్రజాపక్షం/భువనగిరి:** కొబ్బరికాయల చిరు వ్యాపారులపై జరుగు దౌర్జన్యాలను నివారించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ డిమాండ్ చేశారు. స్వర్ణ గిరి దేవాలయం సమీపంలో చిరు వ్యాపారుల సమావేశం దాసరి లక్ష్మ య్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏశాల అశోక్ మాట్లాడుతూ భువనగిరి జిల్లా కేంద్రంలో స్వర్ణగిరి దేవాలయం ప్రముఖంగా ప్రసిద్ధిగాంచినదని ప్రతిరోజు వందల సంఖ్యలో భక్తులు వస్తున్నారని తెలిపారు. ఈ దేవాలయానికి వెళ్లే దారిలో ఉపాధి లేని భువనగిరి చుట్టుపక్కల ప్రాంత నిరుపేద కుటుంబాలు కొబ్బరికాయలతో పాటు ఇతరత్రా చిరు వ్యాపారాలు చేసుకొని వారి కుటుంబాలను పోషించు కుంటున్నారని అన్నారు. ఇక్కడ కొంతమంది ఈ వ్యాపారులపై డబ్బులు కావాలని ఒత్తిడి తెస్తున్నారని మహిళలపై భౌతికంగా దాడులు చేస్తున్నారని ఆయన తెలిపారు. చిరు వ్యాపారులు పలుసార్లు స్థానిక రూరల్ పోలీస్ వారికి ఫిర్యాదులు కూడా చేసినారని ఏశాల అశోక్ అన్నారు. చిరు వ్యాపారులపై దాడులను నివారించాలని పోలీస్ వారికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, అధ్యక్షులు దాసరి లక్ష్మ య్య, చిరు వ్యాపారులు వల్లపు శంకరయ్య, తుమ్మలపల్లి కస్తూరి, వల్లపు లక్ష్మి , చిందం అండాలు, ఆలకుంట్ల పద్మ, చింతల విజయ, ఎర్ర అనసూయ, గడ్డం పారిజాత తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మొద్దని గ్రామస్తుల తీర్మానం హెచ్చరిక

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** గ్రామస్తులు యువకులు మహిళలు అందరు కలిసి గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేస్తే భారీ ఎత్తున జరిమానా విధిస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేసి అక్రమ మద్యం అమ్మకాల కట్టడికి పూనుకున్న సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో చోటుచేసుకున్న సంఘటన వార్తల్లో నిలిచింది. బెల్ట్ షాపుల జోరు మండల వ్యాప్తంగా ఎంతటి విచ్చలవిడిగా జరుగుతుందో చెప్పడానికి ఈ సంఘటన నిదర్శనంగా నిలిచింది. మండల కేంద్రంలోని వైన్స్ ల నుండి కొనుగోలు చేసి కిరాణం షాపుల్లో విచ్చలవిడిగా యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జోరుగా సాగిస్తున్న తరుణంలో ప్రజలే తిరగబడి ఒక నిర్ణయానికి వచ్చి ఈ విధంగా ఆదివారం గ్రామస్తులంతా కలిసి కమిటీ వేసుకొని బెల్ట్ షాపుల మద్యం అమ్మకాలకు అరికట్టేందుకు ప్రమాణం చేస్తూ ఉద్యమించారు. ఒకవేళ ఎవరైనా మద్యాన్ని అమ్మితే రూ.25 వేలు, అమ్మిన వారిని పట్టిస్తే రూ 5వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులంతా తాము చేసిన ఏకగ్రీవ తీర్మానానికి కట్టుబడి బెల్ట్ షాపుల మద్యం రహిత గ్రామంగా ఉండాలని తీర్మానించారు. ఈ గ్రామస్తులు చేసిన నిర్ణయం మండల జిల్లా వ్యాప్తంగా బెల్టు షాపులు అమ్మే వారికి ఎస్ఓటి అధికారులకు చెంపపెట్టు లాంటిదని హెచ్చరిస్తూ హర్షిస్తున్నారు ప్రజలు. 24 మందితో కూడిన కమిటీలో బండి కృష్ణ పబ్బు యాదగిరి భీమ గాని నరసింహ శంకరయ్య మొగిలిపాక యాదగిరి ముడతల సాయిరాం పానుగంటి లింగస్వామి తదితరులు ఉన్నారు.



# తాగునీటిపై అలసత్వం వద్దు

తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/చండూరు:** ఈ వేసవిలో తాగునీటికి ఎలాంటి కొరత లేకుండా ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. ఆదివారం కలెక్టర్ చండూరు మున్సిపాలిటీ కార్యాలయంలో చండూరు మున్సిపాలిటీ , చండూరు గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయితీలలో జనాభా ఆధారంగా తాగునీటిని ఇవ్వాలని అన్నారు. ఎక్కడైన మిషన్ భగీరథ తాగునీటి వనరులు ,బోర్లుచెడిపోయిన లేదా మైనర్ రిపేర్లు ఉన్నట్లయితే వాటి మరమ్మతులకు కార్యాచరణ ప్రణాళిక సమర్పించి పైపు లైన్ లీకేజీలను వెంటనే అరికట్టి తాగునీరు ఇవ్వాలిందిగా అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ త్రాగునీటిని కేవలం తాగేందుకు మాత్రమే వినియోగించుకునేటట్లు చూడాలని, పశువులు ఇండ్లు ,కార్లు ,వాహనాలు వంటి వాటిని శుభ్రం చేసుకునేందుకు ,ఇతర అవసరాలకు వాడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. తాగునీటి సరఫరా విషయంలో అధికారులు ,సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులకు గురి కాకుండా ముందు జాగ్రతగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 9 వార్డులో ఉన్న జిఎల్ఎస్ఆర్ ను పరిశీలించారు. ఏడవ వార్డులో నిర్మాణంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్‌ను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో అధనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ , చండూరు ఆర్డీవో శ్రీదేవి , మున్సిపల్ కమీషనర్ మునావర్ ఆలీ, పబ్లిక్ హెల్త్ డిఈ మనోహర, ఆర్డబ్ల్యాఎస్ ఏఈ పూజిత,పంచాయితీ రాజ్ ఈఈ ఎంపిడివో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సోమవారం ప్రజావాణి రద్దు : కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**ప్రజాపక్షం/నల్లగొండ :** వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సోమవారం నిర్వహించవలసిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లా అధికారులందరూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో విధులు నిర్వహించాల్సి ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని, అందువల్ల దరఖాస్తుదారులు వారి దరఖాస్తులను సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా ఉంటుందని ఆమె తెలిపారు.



## జర్నలిస్టు రఘు కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

**ప్రజాపక్షం/కోదాడ:** ఎలక్ట్రానిక్ మీడియా కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు పడిశాల రఘు మృతి తనను ఎంతో బాధించిందని వారి కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రఘు కుటుంబ సభ్యులను ఆదివారం స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న రఘు సమాజంలో మార్పుకు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం నిస్వార్థంగా పని చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ జర్నలిస్టు ఫోరం పక్షాన అతని కుటుంబాన్ని ఆదుకుంటామని, ప్రభుత్వం కూడా రఘు కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

# పంటలకు చట్టబద్ధత కల్పించాలి

ప్రభుత్వాలు హామీ ఇవ్వాలి...
రైతుసంఘం అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రైతులు పండించిన పంటలకు చట్టబద్ధత కొనుగోలు హామీని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో పట్టణ, మండల మహాసభలు జరిగాయి. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అరుణ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిరకాల పంటలకు ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం(సి2ప్లస్50)కలిపి మద్దతు ధరలను ప్రకటించాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసు కమిషన్ అమలు చేయాలన్నారు. రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయాలన్నారు. పంటలు సాగుకు ముందుగానే రైతుభరోసాను రైతుల ఖాతాలలో జమ చేయాలన్నారు. మిగిలిన రైతులకు కూడా 500 బోనస్‌ను అందజేయాలన్నారు. రైతుసంఘం మాజీ నాయకులు యల్లావుల రాములు మాట్లాడు తూ పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా జక్కుల రమేష్,పొనుగుపాటి వాసుదేవరావులు వ్యవహరించారు. మహాసభకు ముందు అమరజీవి కామ్రేడ్ అతుల్‌కుమార్,అంజన్,అమర రైతులకు నిమిషం పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం సీనియర్ నాయకులు ఎమ్. వెంకటేశ్వర్లు,రైతుసంఘం నాయకులు గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్,మామిడి నర్సయ్య,కందుల వెంకటేశ్వర్లు,మామిడి వెంకయ్య,జక్కుల శ్రీనివాస్,యల్లావుల ఉమ,చెన్నగాని సైదులు,జడ వెంకన్న,బత్తిని మల్లయ్య, స్వామి పాల్గొన్నారు.



## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులు మృతి



**ప్రజాపక్షం/చిట్యాల:** అర్ధరాత్రి 65వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు మృత్యువు పాలు కాగా మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఆదివారం తెల్లవారు జామున (రాత్రి 1.20 నిమిషాలకు) రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక ఎస్ఐ ధర్మా తెలిపిన వివరాల ప్రకారం, నల్లగొండ జిల్లా కేంద్రంలో వెల్డింగ్ వృత్తి చేయుచున్న వ్యాపార భాగస్థులు సయ్యద్ నవాజ్(28), సయ్యద్ షోయబ్(28) అతని స్నేహితుడు మహమ్మద్ జుబేర్(28), మరో వ్యక్తి మహమ్మద్ సల్మాన్‌లు తమ వ్యాపార పని నిమిత్తంబ టిఎస్ 05 8 2054 బెలినో కారులో హైదరాబాద్ వెళ్ళి తిరిగి వస్తుండగా పెద్దకాపర్తి శివారులోకి రాగానే వెనుక నుండి ఆర్‌టి 11 జిబి 7376 నెంబర్ గల లారీ అతి వేగంగా ఢీ కొనడంతో కారు ముందు వెలుతున్న సమన్వి ట్రావెల్స్ బస్సును అంతే వేగంతో ఢీ కొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సయ్యద్ నవాజ్, మహమ్మద్ జుబేర్‌లే బలమైన గాయాలు తగిలి అక్కడిక్కడే చనిపోయారు. గాయాలకు గురైన సయ్యద్ షోయబ్, మహమ్మద్ సల్మాన్‌లను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో ప్రైవేట్ బస్సు ముందు వెలుతున్న మరో కారును ఢీకొట్టినప్పటికి అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సంఘటన విషయం తెలియగానే వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని కావల్సిన చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మా తెలిపారు.

# ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత



నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి

**ప్రజాపక్షం/ నల్లగొండ :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు ఎన్నికల కౌంటింగ్‌కి 530 మంది అధికారుల,సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణ పరిధిలోని అర్జాల బావి వేర్ హౌస్ గోడౌన్స్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల నిర్వహించబోయే వరంగల్,ఖమ్మం,నల్లగొండ శాసన మండలి ఉపాధ్యాయ యం.ఎల్.సి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికతో పాటు ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత జిల్లా పరిధిలో ఏ చిన్నపాటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దాదాపు 530 మంది అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్బంగా కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 బీఎన్ఎస్ఎస్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని నలుగురు కంటే ఎక్కువగా గుంపులు గుంపులుగా తిరగటం చేయకూడదని అన్నారు. అదేవిధంగా అభ్యర్థులు, ఏజెంట్లు లెక్కింపుకు హాజరు అయ్యే అధికారులు సెల్ ఫోన్లు, నిషేధిత వస్తువుల అయిన అగ్గిపెట్టెలు, లైటర్, ఇంక్ బాటల్స్, లిక్విడ్, వాటర్ బాటిల్ , పేలుడుకు కారణమయ్యే ఎలాంటి వస్తువులను లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకురాకూడదని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులకు హాజరయ్యే ప్రధాన ఏజెంట్లు కౌంటింగ్ ఏజంట్లు మీడియా ప్రతినిధులు ఎన్నికల అధికారి జారీచేసిన ఫోటో గుర్తింపు కార్డు తప్పక వెంట ఉంచుకొని తనిఖీలు చేసే పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. వాహనాలకు ట్రాపిక్ ఇబ్బంది కలగకుండా కేటాయించిన పార్కింగ్ స్థలం లోనే వాహనాలు పార్క్ చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు.

# ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన దుద్దిళ్ళ



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి దుద్దిళ్ళ శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మాజీ శాసనసభ స్పీకర్ దూదిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ్యులుగా, శాసనసభ స్పీకర్‌గా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. 1964 నుండి 1999 వరకు ప్రజల అభ్యునతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డిఎం శర్మ, డిపిఓ నారాయణ రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, ఎస్‌సి అభివృద్ధి అధికారి లత, టిఎన్‌జిఓ కార్యదర్శి దున్న శ్యామ్, ఎఓ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి దుద్దిళ్ళ శ్రీపాదరావు అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలసి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ శాసనసభ్యులుగా, శాసనసభ స్పీకర్‌గా ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ముఖ్యంగా 1964 నుంచి 1999 వరకు ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు 88వ జయంతి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం ఐ.డి.ఓ.సి ఆవరణంలో దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతిని పురస్కరించుకుని జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దుద్దిళ శ్రీపాద రావు చిత్రపటానికి పుష్పమాలలు అర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీనివాస్ రావు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జితేందర్, బిసి సంక్షేమ అధికారి సరోజమ్మ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతిని ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అదనపు ఎస్‌పిలు నాగేశ్వర్ రావు, జనార్ధన్ రెడ్డిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు సురేష్, రాజేష్, సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2 న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని ఆదేశించిన మీదట జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దుదిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఇంచార్జ్ డిఆర్ఓ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మోతిలాల్,కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని దుద్దిళ్ల శ్రీపాదరావుకు నివాళులర్పించారు.



## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/డిండి:** దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రజలందరికి గంగమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం డిండి పట్టణంలోని గంగమ్మ తల్లి బోనాల కార్యక్రమం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బాలునాయక్ గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఏ బాలునాయక్‌ను ఆలయ కమిటి సభ్యులతో కలిసి మత్స్యకార సొసైటి డిండి ప్రాజెక్టు చైర్మన్ మేకల కాశన్న శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ వెంకటయ్యగౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు హరికృష్ణ, లక్ష్మణ్, సాయికుమార్, వెంకటేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# రబీలో రైతులకు నీటి సరఫరా



## ఎంఎల్ఏ సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్/ఎడపల్లి:** రబీలో రైతులు వేసిన పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా ఉండాలని, ఎట్టి పరిస్థితిల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాద్యత ఇరిగేషన్ అధికారులపైన ఉందని మాజీ మంత్రి, బోధన్ ఎంఎల్ఏ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని బోర్గాం, తాడ్ బిలోలి గ్రామాలను సందర్శించి నిజాంసాగర్ కెనాల్‌ని పరిశీలించి అనంతరం రైతులతో చర్చించారు. నీటి సరఫరాపై ఇరిగేషన్ అధికారులతో వివరాలు సేకరించారు. ఎట్టి పరిస్థితుల్లో తడుల వారిగా సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తాడ్‌బిలోలి గ్రామంలో అనారోగ్యంతో బాదపడుతున్న బోయ కిరణ్ అనే వ్యక్తి తల్లి అగ్గు.గంగామణికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున రెండు లక్షల 50వేల రూపాయాల ప్రొసిడింగ్ కాఫీని అందచేశారు. అనంతరం రెంజల్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆగి కొద్దిసేపు రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏతో పాటు తాహెర్ బిన్ హందాన్, మండల అధ్యక్షుడు మోబీన్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండగలో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామ శివారులోని బేడీల మైశమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం బోనాల పండగను గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ వార్షికోత్సవ వేడుకలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్‌లు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ తమ ఇళ్ళ నుండి బోనాలతో వేలాదిగా ఆలయానికి తరలి రావడంతో గ్రామ శివారులో జాతర సాగింది. ఎటు చూసినా భక్తులు, ప్రజలతో ఈ ప్రాంతం కిక్కిరిసిపోయింది. హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల నుండి వచ్చిన శివ సత్తులు, డీజీ పాటల హోరుతో ఆ ప్రాంతం భక్తజన సంద్రమైంది. ఇందులో భాగంగా గ్రామపెద్దలు సోమవారం నాడు కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పట్లోళ్ళ జ్యోతి దుర్గారెడ్డి, మనోహర్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా అంగన్‌వాడీ బిల్డింగ్



**ప్రజాపక్షం/పాపన్నపేట:** అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి బిల్డింగ్ లో విధులు ఎలా నిర్వహిస్తామని అంగన్వాడి సెంటర్ నిర్వాహకురాలు మీడియా ముందు వాపోయారు. మండల కేంద్రమైన పాపన్నపేట లోని అంగన్వాడి సెంటర్ 2 కోసం నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనంలో నీటి వసతి లేకపోవడం, మరుగుదొడ్డిని పనులు అసంపూర్తిగా వదిలేశారు. భవన పునాది, గోడల మధ్యలో భారీగా పగుళ్లు ఏర్పడ్డాయి అన్నారు. అంగన్వాడి సెంటర్ కు ఆయమ్మ లేకపోవడం నూతన భవనంలో విధులు నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు అసంపూర్తిగా ఉన్న భవన పనులు పూర్తి చేయించి నీటి వసతి కల్పించాలన్నారు.

## మానవత్వం చాటుకున్న మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:** దిలావార్‌పూర్ గ్రామానికి చెందిన బొంబాయి రాకేష్ గత మూడు రోజులు క్రితం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో త్రీవ గాయాలు పాలైన విషయం తెలుసుకున్న మహేశ్వర్ రెడ్డి హుటాహుటిన హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించలాని సూచించి ఆసుపత్రిల ఖర్చులు నిమత్తం 2.50 లక్షల ఎల్ఓసీ సీఎం సహాయనిధి నుండి ఇప్పించడం జరిగింది.అలాగే మిగతా ఇద్దరికీ రాము,ముత్యం కు కూడా మెరుగైన వైద్యం అందించాలని డివిఎ హాస్పిటల్ వైద్యులకు లకు తెలిపారు..తమ కుమారుడికి సహాయం చేసినందుకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కి,స్థానిక బిజెపి నాయకులు ముత్యంరెడ్డి,తాజామాజీ సర్పంచ్ వీరేష్ కుమార్ లకు కుటుంబ సభ్యులు,వారి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోగులకు వైద్య సేవలు




**ప్రజాపక్షం/గజ్వేల్:** ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ కేంద్రంలో ఆదివారం రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ బాబు మాట్లాడుతూ, ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు.

## అద్దె బస్సు డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా టీజీ ఆర్టీసీలో నూతనంగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టబడిన విషయం తెలిసిందే.అందులో భాగంగా నిర్మల్ డిపోలో నూతనంగా ప్రవేశ పెట్టిన ఎలక్ట్రిక్ బస్సులకు డ్రైవర్ల నియామకం లో అద్దె బస్సుల డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విలాస్ రావు పట్టణ అధ్యక్షులు ఎండి ఫయాజ్ యూనియన్ కౌన్సిల్ మెంబర్స్ డిమాండ్ చేయాడం జరిగింది.

## ఆసరా పెన్షన్ రాక వృద్ధుల ఎదురుచూపులు

**ప్రజాపక్షం/జైపూర్ :** ప్రతీ నెల ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్ కోసం జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల వితంతు, వికలాంగులు, వయోవృద్ధులు ఎదురుచూస్తున్నారు. మండలంలో సుమారు 7 వేల వరకు పింఛన్ దారులు ఉంటారు. మార్చి నెలకు సంబంధించిన ఆసరా పెన్షన్ ఇప్పటి వరకు అందకపోవడంతో పెన్షన్ దారుల్లో ఒక రకమైన భయం,బాధ ఏర్పడుతుందని తెలుపుతున్నారు. గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగస్తులకు ప్రతీ నెల మొదటి వారంలో జీతాలు చెల్లిస్తుంటాయి. కానీ పింఛన్ పైనే ఆధారపడి జీవనం సాగించే వితంతువులకు, వికలాంగులకు, వయో వృద్ధులపై ప్రభుత్వం మీద చిన్నచూపు చూపిస్తూ ప్రతీ నెల మొదటి వారంలో ఇవ్వవల్సిన పెన్సన్లు నెల చివరి వారంలో ఇవ్వడంతో పెన్షన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ నెల మొదటి వారంలో ఆసరా పెన్షన్ వచ్చేలా చూడాలని పింఛన్ దారులు కోరుతున్నారు.

## నూతన బస్టాండ్ ఏర్పాటు చేయాలి: సిపిఐ

**ప్రజాపక్షం/కోటగిరి:** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో నూతన బస్టాండ్ ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో వారు మాట్లాడారు. కోటగిరి మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య బస్టాండ్ లేకపోవడమేనన్నారు. బస్టాండ్ లేక ప్రయాణీకులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణీకులు రోడ్డుపై నిలబడి ఎండలు మండుతున్నప్పటికీ నిల్చొడానికి నీడ లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళలు, చిన్న పిల్లలు, వృద్దులు బాధపడుతున్నారు. కోటగిరి మండల కేంద్రం ఉన్నప్పటికీ బస్టాండ్ లేకపోవడం చాలా బాధకరమన్నారు. బస్టాండ్ లేకపోవడం, ప్రయాణ ప్రాంగణానికి వచ్చే మహిళలకు కనీసం మూత్రశాలలు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నరన్నారు. సమస్యను పరిష్కరించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఏ.విఠల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం:



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 3 నుండి యథావిధిగా నిర్వహించటం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కలికంగా వాయిదా వేశామన్నారు. ప్రస్తుతం పోలింగ్ ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ గౌరవం, గుర్తింపు



**ప్రజాపక్షం/గజ్వేల్:** పార్టీకి కష్ట కాలంలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని, అలాగే నామినేటెడ్ పోస్టుల భర్తీలో రిజర్వేషన్ ప్రాతిపదికన అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గౌరారంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. పేద ఎస్సి మహిళ ఇల్లు మంజూరికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే కెసిఆర్ ఇక్కడి సమస్యలను పట్టించుకోవడం లేదని నిలదీశారు. అయినప్పటికి సీఎం రేవంత్ రెడ్డి గజ్వేల్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరి చేస్తున్నట్లు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి వర్తింప చేస్తామని అన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ పార్టీకి విధేయులై పనిచేయాలని, అయితే క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఆధారాలతో పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి రూ.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యకర్తల కష్టసుఖాల్లో భాగమవుతుండగా, తాను నిరంతరం అందుబాటులో ఉంటున్నట్లు అన్నారు. అయితే కార్యకర్తలకు, ప్రజలకు ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తేవచ్చని, రాష్ట్రంలోనే ప్రాధాన్యత కలిగిన గజ్వేల్ నియోజకవర్గంపై అధిష్టానం ప్రత్యేక దృష్టి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, నాయకులు గుండ నర్సింలు గౌడ్, భాను ప్రసాద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బోర్క నర్సింలు, పాశం వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, యాదగిరి గౌడ్, కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలి



**ప్రజాపక్షం/ధర్పల్లి:** శ్రీ సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం ధర్పల్లి మండలంలోని దమ్మన్నపేట్ గ్రామంలో నూతన రామాలయంలో సీతారాముల విగ్రహాలను అంగరంగ వైభవంగా ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి విచ్చేసి సీతారాముల వారి కళ్యానం, సీతారాముల విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ సీతారాముల ఆలయ ప్రారంభానికి ఆహ్వానించినందున ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో పాడీ పంటలు పండి సుఖసంతోషాలతో ఉండాలని సీతారాముల వారి ఆశీస్సులు అందరికి ఉండాలన్నారు. దమ్మన్నపేట ఆలయ కమిటీ కోరిన విధంగా సీసీ రోడ్డు కమిటీ హాల్ మంజూరు చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దమ్మన్నపేట గ్రామ ప్రజలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధర్పల్లి మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్నబాల్ రాజ్, సురేందర్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, సుభాష్, శ్రీను పాల్గొన్నారు.

## చెరువుల సంరక్షణపై నిర్లక్ష్యం ఎందుకు?

### అధికారుల తీరుపై ప్రజల అసంతృప్తి..



**ప్రజాపక్షం/ముధోల్:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం భూగర్భ జలాలు పెంచడంతోపాటు ఆయకట్టు సాగు కొరకు గతంలో చెరువులను ఏర్పాటు చేసింది. రాను రాను పంట పొలాల్లో బోర్లు రైతులు అధికంగా వేసుకోవడంతో చెరువుల నుండి నీటి అవసరం తగ్గింది.గతంలో ఎండాకాలం వచ్చే సమయానికి చెరువులోని నీళ్లు ఎండిపోయేవి. అయితే ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న చెరువుల్లో అనుమతి లేకుండా త్రవ్వకాలు జరపడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని సార్లు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సైతం జరిగింది. అదేవిధంగా మత్స్యకారులకు ప్రధాన జీవనాధారమైన చెరువుల పరిస్థితి నానాటికి దయనీయంగా మారుతుంది. ప్రభుత్వం చెరువుల మరమ్మత్తుల కొరకు నిధులు సైతం విడుదల చేస్తుంది. అయితే అధికారులు మాత్రం చెరువుల సంరక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూన్నారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన అంతంత మాత్రంగానే పరిష్కారం అవుతున్నాయని వాపోతున్నారు. చెరువుల్లో అక్రమ తవ్వకాలను అరికట్టడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల సంరక్షణకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకునే విధంగా జిల్లా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

## స్మశాన వాటికనూ కబ్జా!

### పట్టించుకోని అధికారులు
### నాలుగు ఎకరాల్లో అధిక భాగం కబ్జా
### ఫిర్యాదు అందినా చర్యలు శూన్యం
### ఏండ్లు గడుస్తున్నా పూర్తికాని వైకుంఠదామం నిర్మాణ పనులు





**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న స్మశాన వాటిక స్థలం కబ్జాకు గురవుతుందని స్మశానానికి సంబంధించిన భూమి సుమారు నాలుగు ఎకరాల వరకు ఉండేదని అందులో అధిక భాగం అక్రమాలకు గురైందని స్థానిక గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ విషయమై గ్రామంలోని వివిధ కుల సంఘాలతో స్మశాన వాటిక వద్ద సమావేశం ఏర్పాటు చేసి అప్పటి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా దీంతో తహసీల్దార్‌తో సహా రెవెన్యూ అధికారులు స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించి హద్దులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అది ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. అలాగే వైకుంఠదామం నిర్మాణ పనులు సైతం సుమారు నాలుగు ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచి పోయాయని ఎస్సీ వాడ ప్రజలు వారి తోటలకు వెళ్లే రోడ్డుకు అనుకొని ఉన్న ఈ స్మశాన వాటిక గత కొన్ని దశాబ్దాలుగా ప్రజలు వినియోగించుకుంటున్నారు. కాగా గత ప్రభుత్వ హయంలో వైకుంఠదామం నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా 12లక్షల 60వేల రూపాయాలు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి 2021 జనవరి 7వ తేదిన ఈ వైకుంఠ దామం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు దీని నిర్మాణం పూర్తి కాలేదు. మోర్తాడ్ గ్రామంలోని జనాభాలో ఎక్కువ భాగం ప్రజలు ఈ స్మశాన వాటికను వినియోగించుకుంటున్నారు. ఈ వైకుంఠదామంలో రెండు దహన వాటికలు, కాటి కాపరి గది, స్మశానానికి వెళ్లే ప్రవేశ ద్వారం, పనులు కొద్ది శాతం మిగిలి ఉన్నాయి. దహన వాటికలు పూర్తి కాకపోవడంతో బయటనే శవ దహనాలు చేస్తున్నారు. మహిళలకు, పురుషులకు, వేరు వేరుగా స్నాన వాటికలు పూర్తయ్యాయి. అయితే స్మశానానికి వెళ్లి కంకర రోడ్డు గుంతలు పడి కంకర తేలి అక్కడ వెళ్లడానికి ప్రజలకు అసౌకర్యంగా మారింది. అలాగే రెవెన్యూ అధికారులు భూమిని సమగ్రంగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి స్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉద్దేశపూర్వకంగానే కత్తులతో దాడి



**ప్రజాపక్షం/ఆర్మూర్:** అలూరు మండలంలోని దేగాం గ్రామంలో ఐనర్ల నాగరాజు అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కుల బహిష్కరణతో పాటు పాత కక్షలు మనసులో పెట్టుకొని పాశవికంగా దాడికి పాల్పడ్డారు. కత్తితో ఏకంగా 10 చోట్ల పొడిచారు. బాధితుడిని కుటుంబ సభ్యులు వెంటనే ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పూర్తి వివరాలు సేకరించారు. క్షతగాత్రుడి తండ్రి మాట్లాడుతూ గ్రామానికి చెందిన శ్రీధర్, శ్రీకాంత్, అశోక్, శేఖర్, శ్రీలత, బద్దెమ్మలు ఉద్దేశపూర్వకంగానే తన కుమారుడిపై కత్తితో దాడిచేసి గాయపరిచారని, పాత కక్షలు మనసులో పెట్టుకొని పొడిచారని రోదిస్తు తెలిపారు. పరిస్థితి విషమంగా మారడంతో క్షతగాత్రుని 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## పసుపు బోర్డుకు నిధులు కేటాయించాలి: భూమయ్య



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:** రాష్ట్ర రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం రాష్ట్ర కోశాధికారి కంజర భూమయ్య అన్నారు. రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి వ్యతిరేకంగా తెచ్చిన 3 నల్ల చట్టాలను రద్దు చేయాలని జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పసుపు బోర్డుకు నిధులు కేటాయించాలని, స్వామినాథన్ సిఫారసు ప్రకారం రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో మార్చి 25, 26, 27 లలో మాధవ్‌నగర్‌లోని బిఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర రైతు సంఘం మూడవ మహాసభలను జిల్లా రైతాంగం, ప్రజలు విజయవంతం చేయాలన్నారు. జాతీయ స్థాయిలో రైతుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించి తెలంగాణ ఏర్పడిన తర్వాత మూడవ మహాసభలను మన జిల్లాలో నిర్వహించుకోవటం జరుగుతుందని మొదటిరోజు మార్చి 25న ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని 26, 27 లలో బీఎల్ఎన్ గార్డెన్‌లో రాష్ట్ర మహాసభలు ఉంటాయని ఈ మహాసభల జయప్రదానికై జిల్లాలోని ప్రజలు, వ్యాపారస్తులు, మహాసభల విజయవంతానికి సహాయ సహకారాలందించాలన్నారు. సమావేశంలో సుధాకర్, ముత్యాలు, రంజిత్, రాజేశ్వర్‌పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సే పోలీసుల లక్ష్యం

### ఎఎస్‌పి చిత్తరంజన్



**ప్రజాపక్షం/తిర్యాని:** ప్రజా శ్రేయస్సే పోలీసుల లక్ష్యమని, ఆదివాసీ ప్రజలకు పోలీస్‌శాఖ ఎళ్లప్పుడూ అండగా ఉంటుందని ఆసిఫాబాద్ ఎఎస్‌పి పి.చిత్తరంజన్ పేర్కొన్నారు. ఆదివారం తిర్యాని మండలంలోని గోవెన,కుర్సిగూడ,లింగగూడ, నాయకపు గూడ గ్రామాలను ఎఎస్‌పి కాలినడకన సందర్శించారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా యువకులకు వాలీబాల్ కిట్లను, టీ షర్ట్‌లను పంపిణి చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న శంభురావు అనే బాలుని పరామర్శించి త్వరలో పోలీస్ శాఖ తరపున వైద్య చికిత్సలు అందించేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు, ప్రజలు మావోయిస్టుల ప్రలోభాలకు లోను కావద్దని, వారికి సహకరించవద్దని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలను నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్న ప్రభుత్వం, పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. యువత మావోయిస్టులకు ఆకర్షితులు కాకుండా ఉన్నత చదువులు చదవాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలను, యువకులను వారి తల్లిదండ్రులు ఉన్నత చదువులను చదివించాలన్నారు. విద్య, వైద్య సహకారం పోలీసులను ఎల్లప్పుడు ఆశ్రయించవచ్చన్నారు. గ్రామాల్లో నిషేధిత గంజాయి సాగును పండించవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సిఐ బుద్దె స్వామి, తిర్యాని ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాసిరకంగా రోడ్డు.. క్వాలిటీ కంట్రోల్ ఎక్కడా?



**ప్రజాపక్షం/దిలావర్పూర్/మామడ:** నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్, మామడ మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న సిసి రోడ్లు మూడు నెలల ముచ్చట గానే మారాయి. గ్రామీణ ప్రాంతాలలో లింకు రోడ్డు అభివృద్ధికి కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తుంటే సదరు గుత్తేదారు మాత్రం సీసీ రోడ్లు తవ్వవ సిమెంట్, ఇసుక, కంకర వేస్తుండడంతో కొన్ని నెల రోజులు గడవకముందే పగులు తేలి కంకర అంతా తేలిపోతుంది. ఎంపీడీవో కార్యలయం కు వెళ్ళే దారి సీసీ రోడ్డు నాసిరకంగా చేపట్టడం తో ఆ సీసీ రోడ్డు మొత్తం కంకర తేలి పగుళ్లు తేలాయి. నిత్యం అధికారులు దారి వెళ్తున్నారు. వారికి సమస్య కనబడం లేదా అని గ్రామస్తులు వాపోతున్నారు. ఇంజనీరింగ్ అధికారి పర్యవేక్షణ లోపంతో సీసీ రోడ్డు నిర్మాణం నాసిరకంగా నిర్మించారని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో అడ్డగోలుగా సీసీ, డ్రైనేజీ లు నిర్మిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి గత ఏడాది క్రితం వేసిన రోడ్లు పగుళ్లు తేలాయి. అభివృద్ధి కోసం ఏమోగానీ గుత్తేదారు జేబులు నింపడానికి నిర్మాణాలు చేపడుతున్నట్లు వుంది. జిల్లా స్థాయి క్వాలిటీ కంట్రోల్ అధికారులు సీసీ రోడ్డు లు పరిశీలించి గుత్తేదారు చేత తిరిగి రిపేర్లు చేపట్టాలని గ్రామస్తులు అంటున్నారు.

# క్రీడ

## న్యూజిలాండ్ లక్ష్యం 250..!





### శ్రేయస్ హాఫ్ సెంచరీ.. హార్దిక్ మెరుపులు..

ఐసిసి చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ ముందు టీం ఇండియా 250 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం న్యూజిలాండ్, టీం ఇండియా మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ కివీస్ గెలుచుకుని ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన టీం ఇండియా నిర్దేశిత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ 79, హార్దిక్ పాండ్యా 45, అక్షర్ పటేల్ 42 పరుగులు చేసి, జట్టుకు మెరుగైన స్కోర్ అందించారు. ఓపెనర్లుగా వచ్చిన సారథి రోహిత్ శర్మ 15 పరుగులు చేయగా, శుభ్‌మన్ గిల్ రెండు పరుగులకే ఔటయ్యాడు. వన్ డౌన్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం 11 పరుగులకే పెవిలియన్ బాట పట్టాడు. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్‌తో కలిసి జట్టు స్కోర్ నిలకడగా పెంచాడు. శ్రేయాస్ అయ్యర్.. అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే అక్షర్ పటేల్ రూపంలో టీం ఇండియా మరో వికెట్ కోల్పోయింది. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కేఎల్ రాహుల్ 23 పరుగులు చేయడంతో పాటు శ్రేయాస్ అయ్యర్‌కు బాసటగా నిలిచాడు. ఈ క్రమంలో జట్టు స్కోర్ 172 పరుగుల వద్ద 79 (రెండు సిక్సర్లు, నాలుగు ఫోర్లు) పరుగులకు శ్రేయాస్ అయ్యర్ ఔటయ్యాడు. తర్వాత వచ్చిన హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా కాస్త క్రీజ్‌లో నిలబడ్డారు. పాండ్యా 45, రవీంద్ర జడేజా 16 పరుగుల వద్ద పెవిలియన్ బాట పట్టారు. మహ్మద్ షమీ 50వ ఓవర్ చివరి బంతిని ఫిలిప్స్ కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. నిర్ణీత 50 ఓవర్లలో టీం ఇండియా తొమ్మిది వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ ఐదు, కైల్ జామియాసన్, విల్ ఓ రూర్కే, మిచెల్ శాంత్నర్, రచిన్ రవీంద్ర చెరో వికెట్ తీశారు.

## విజేతగా విదర్భ..

### టైటిల్ అందించిన కరుణ్ నాయర్!

ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ 2024–25 టైటిల్‌ను విదర్భ సొంతం చేసుకుంది. కేరళతో నాగ్‌పూర్ వేదికగా ఆదివారం ముగిసిన ఫైనల్ మ్యాచ్ డ్రా అయ్యింది. దాంతో ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన విదర్భను అంపైర్లు విజేతగా ప్రకటించారు. రంజీ ట్రోఫీ చరిత్రలో విదర్భ జట్టుకు ఇది మూడో టైటిల్. గత 7 ఏళ్ల లోనే ఈ మూడు టైటిల్ అందుకోవడం విశేషం. ప్రతిష్టాత్మక విజయ్ హజారే ట్రోఫీని తృటిలో చేజార్చుకున్న విదర్భ.. రంజీ ట్రోఫీని మాత్రం కైవసం చేసుకుంది. విదర్భ విజయంలో టీమిండియా వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ కీలక పాత్ర పోషించారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో అతను బ్యాట్‌తో రాణించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 123.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. డానిష్ మలెవర్(285 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లతో 153) సెంచరీతో చెలరేగగా.. కరుణ్ నాయర్(188 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 86) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. అనంతరం కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 125 ఓవర్లలో 342 పరుగులే చేసింది. కెప్టెన్ సచిన్ బేబీ(235 బంతుల్లో 10 ఫోర్లతో 98) సెంచరీ చేజార్చుకోగా.. ఆదిత్య సర్వతే(185 బంతుల్లో 10 ఫోర్లతో 79) హాఫ్ సెంచరీతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భకు 37 పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది.

అనంతరం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 143.5 ఓవర్లలో 9 వికెట్లకు 375 పరుగులు చేసింది. కరుణ్ నాయర్(295 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 135) సెంచరీతో చెలరేగగా.. డాని మలేవర్(162 బంతుల్లో 5 ఫోర్లతో 73), దర్శన్ నల్కండే(98 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 51 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆటకు చివరి రోజు కావడం విదర్భ తన బ్యాటింగ్ కొనసాగిస్తుండటంతో మ్యాచ్ ఫలితం తేలే అవకాశాలు లేకపోవడంతో అంపైర్లు ఇరు జట్ల కెప్టెన్ల అంగీకారంతో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన విదర్భను విజేతగా పేర్కొన్నారు. విజయ్ హజారే ట్రోఫీలో వరుస సెంచరీలతో చెలరేగిన కరుణ్ నాయర్ కీలకమైన ఫైనల్లో మాత్రం తడబడ్డాడు. దాంతో ఆ జట్టు విజయ్ హజారే ట్రోఫీని అందుకోలేకపోయింది. కానీ రంజీ ట్రోఫీ ఫైనల్లో మాత్రం కరుణ్ నాయర్ మెరుగైన ప్రదర్శన చేసి విదర్భకు టైటిల్ అందించాడు.



## ఏప్రిల్ నుంచి 'వార్ 2' ట్రీట్



ప్రస్తుతం ఇండియన్ సినిమా ఎదురు చూస్తున్న మోస్ట్ అవైటెడ్ భారీ మల్టీస్టారర్ చిత్రం ఏదన్నా ఉంది అంటే అది 'వార్ 2' అనే చెప్పాలి. బాలీవుడ్ నుంచి గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ మన టాలీవుడ్ నుంచి మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌లు ప్రధాన పాత్రల్లో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న అవైటెడ్ సినిమా ఇది కాగా అభిమానులు ఎప్పుడు నుంచో చాలా ఎగ్జైటెడ్‌గా ఈ చిత్రం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఇలాంటి సెన్సేషనల్ ప్రాజెక్ట్ ఇప్పుడు వరకు ఎలాంటి అఫీషియల్ అప్డేట్ లేకుండా షూటింగ్ కానిచ్చేస్తున్నారు. ఎన్టీఆర్ పై కానీ హృతిక్‌పై గాని అంతెందుకు సినిమా టైటిల్ కూడా ఏంటి అనేది అఫీషియల్ లోగో కూడా మేకర్స్ ఇచ్చింది లేదు. అయితే ఇపుడు ఇవన్నీ ఎప్పుడు నుంచి బయటకి వస్తాయి అనేది తెలుస్తుంది. లేటెస్ట్ టాక్ ప్రకారం ఈ రానున్న ఏప్రిల్ నెల నుంచి 'వార్ 2' ట్రీట్స్ రావడం మొదలు కానున్నట్టుగా తెలుస్తుంది. దీనితో 'వార్ 2' అప్డేట్స్ సమ్మర్ స్పెషల్‌గా మొదలు కానున్నాయి అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి యష్ రాజ్ ఫిలమ్స్ వారు భారీ బడ్జెట్‌తో నిర్మాణం వహిస్తుండగా ఈ ఏడాది స్వాతంత్ర దినోత్సవం కానుకగా రిలీజ్ అయ్యేందుకు సిద్ధం అవుతుంది.

## 'మ్యాడ్ స్క్వేర్' రిలీజ్ డేట్ మారింది..

ప్రస్తుతం మన టాలీవుడ్ ఆడియెన్స్‌కి ఆసక్తిగా ఎదురు చూస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో నార్నె నితిన్, రామ్ నితిన్ అలాగే సంగీత్ శోభన్‌లు ప్రధాన పాత్రల్లో దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన సాలిడ్ ఎంటర్టైనర్ మ్యాడ్ స్క్వేర్ కూడా ఒకటి. మరి యూత్‌లో మరిన్ని అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం రిలీజ్ డేట్‌పై ఇపుడు మేకర్స్ క్రేజీ ట్విస్ట్ అందించారు. నిజానికి మేకర్స్ ఈ చిత్రాన్ని ఈ మార్చి 29న రిలీజ్ చేస్తున్నట్టుగా అనౌన్స్ చేశారు.



కానీ ఇపుడు ఈ డేట్‌లో రిలీజ్‌కి రావట్లేదని కన్ఫర్మ్ చేశారు. అయితే దాని కంటే ముందే అంటే ఓ రోజు మార్చి 28న సినిమా థియేటర్స్‌లో ఎంటర్టైన్ చేసేందుకు వస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మ్యాడ్ స్క్వేర్‌కి మొదట అనుకున్న డేట్‌లో అమావాస్య ఉందని డిస్ట్రిబ్యూటర్స్ కోరిక మేరకు తాము ముందు డేట్‌లోకి షిఫ్ట్ అయ్యినట్టుగా మేకర్స్ తెలిపారు. అలాగే నితిన్ రాబిన్ హుడ్‌తో తాము కూడా వస్తున్నాం అన్ని సినిమాలు ఎంజాయ్ చేయండి అన్నట్టుగా నిర్మాత నాగవంశీ పోస్ట్ కూడా వైరల్‌గా మారింది.

# లీల

## కథ చెబితే 'దిల్‌రూబా' బైక్ ఇచ్చేస్తా

### కిరణ్ అబ్బవరం ప్రకటన



సినీ ప్రియులకు బంపర్ ఆఫర్ ఇచ్చారు నటుడు కిరణ్ అబ్బవరం. ఆయన నటించిన కొత్త చిత్రం 'దిల్‌రూబా' కథేంటో చెబితే సినిమాలో తాను వాడిన బైక్‌ను బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. అది అంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. ఈ మేరకు ఆ బైక్‌ను చూపిస్తూ నేడు ప్రత్యేక వీడియో షేర్ చేశారు. "నా కోపం, ప్రేమల సమ్మేళనంగా తెరకెక్కిన చిత్రమే 'దిల్ రూబా'. ఈ బైక్ అంటే నాకెంతో ఇష్టం. మా ఆర్ట్ డైరెక్టర్ ఎంతో శ్రమించి సినిమా కోసం దీనిని తయారు చేశారు. మార్కెట్‌లో ఇది మీకు ఎక్కడా దొరకదు. అందుకే దీనిని మీకు బహుమతిగా ఇచ్చేయాలనుకుంటున్నా. ఈ బైక్‌ను మీ సొంతం చేసుకోవడానికి మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. ఇప్పటివరకూ విడుదలైన మా సినిమా పాటలు, వీడియోలు, ప్రమోషన్స్‌లో మేము మాట్లాడిన విషయాలను ఆధారంగా చేసుకుని కథ ఏమిటనేది మీరు ఆలోచించి చెప్పాలి. క్రియేటివ్‌గా చెప్పిన వాళ్లకు ఈ బైక్ బహుమతిగా ఇస్తా. ఈ బైక్ గెలుచుకున్న వ్యక్తితో ఫస్ట్ డే ఫస్ట్‌షోకు వెళ్తా'' అని కిరణ్ చెప్పారు. 'దిల్ రూబా' చిత్రానికి విశ్వకరుణ్ దర్శకత్వం వహించారు. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. మార్చి 14న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.

## వాటితో నాకు సంబంధం లేదు

### విద్యా బాలన్



సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న తన వీడియోలను ఉద్దేశించి బాలీవుడ్ నటి విద్యా బాలన్ తాజాగా ప్రత్యేక సందేశం రిలీజ్ చేశారు. ఆ వీడియోలతో తనకు ఏమాత్రం సంబంధం లేదని, అవన్నీ ఏఐ టెక్నాలజీతో క్రియేట్ చేసిన డీప్ ఫేక్‌వని చెప్పారు. నెటిజన్లు అప్రమత్తంగా ఉండాలని కోరారు. 'సోషల్‌మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో ఈ మధ్యకాలంలో నాకు సంబంధించిన పలు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే, అవన్నీ ఏఐ జనరేటెడ్‌వి. వాటితో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ వీడియోలను సృష్టించడం లేదా వ్యాప్తి చేయడంలో నా ప్రమేయం లేదు. అందులోని కంటెంట్‌ను కూడా నేను ఏమాత్రం అంగీకరించను. కాబట్టి, సోషల్‌మీడియాలో వీడియోలు షేర్ చేసేముందు దయచేసి వాటి గురించి పూర్తి సమాచారం తెలుసుకోండి. ఏఐ జనరేటెడ్ కంటెంట్ మిమ్మల్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా ఉండండి'' అని విద్యా బాలన్ పేర్కొన్నారు. డీప్ ఫేక్ టెక్నాలజీ వల్ల ఇప్పటికే ఎంతోమంది నటీమణులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రష్మిక, దీపికా పదుకొణె, కత్రినా కైఫ్, అలియా భట్ వంటి తారలు ఈ టెక్నాలజీ బాధితులే.

## సాంకేతికత, ఆవిష్కరణల పురోగతి

# దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కీలకం



**ఐఐటి హైదరాబాద్ ఆలోచన, ఆవిష్కరణ సాధనలో అగ్రగామిగా నిలవడం హర్షణీయం**

**ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌కర్**

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** ప్రస్తుతం ఉన్న జనరేషన్ మార్పు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భారత కంపెనీలు గ్లోబల్ లీడర్లతో పోటీ పడాలని ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌కర్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటి హైదరాబాద్‌లో ఆయన పర్యటించారు. ముందుగా 'ఏక్. పేడ్ మాకే నామ్' పేరిట వెరైటీ ఆవరణలో ఒక మొక్కను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అభివృద్ధి, ఆవిష్కరణలపై కార్పొరేట్ పెట్టుబడి అవసరాన్ని ప్రాముఖ్యతగా పేర్కొన్నారు. భారత కంపెనీలు గ్లోబల్ లీడర్లతో పోటీ పడాలని, సాంకేతికత, ఆవిష్కరణల పురోగతి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కీలకమని తెలియజేశారు. ఆయన ఐఐటి హైదరాబాద్‌ను ఆలోచన, ఆవిష్కరణ సాధనలో అగ్రగామిగా నిలిచినందుకు ప్రశంసించారు. ఈ సంస్థ సాంకేతిక పురోగతికి చేసిన గొప్ప కృషిని భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో దాని పాత్రను గౌరవించారు. ఐఐటి హైదరాబాద్ యొక్క 300 మంది ప్రతిభాశాలి ఆధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసిచారు. మౌలిక సదుపాయాలు అవసరమైనప్పటికి, విద్యా సంస్థ విజయాన్ని నిర్ణయించేది అధ్యాపకు దృక్పథం, కృషి, అంకితభావమే అని స్పష్టంగా తెలియజేశారు. ఈ సందర్శన విద్యార్థుల మనసుపై చిరస్థాయిగా ప్రభావం చూపించింది. వారిని భవిష్యత్తులో మరింత సృజనాత్మకమైన నవీనమైన భారత దేశాన్ని నిర్మించడానికి ప్రేరేపించిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ రాధాకృష్ణన్, మెదక్ ఎంపి రఘునందన్‌రావు, సంగారెడ్డి చింతప్రభాకర్, ఐఐటి బోర్డ్ ఆఫ్ గవర్నర్ చైర్మన్ బివి మోహన్ రెడ్డి, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ రూపేష్, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంజాన్ ఉపవాసాలకు గట్టి బందోబస్తు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంజాన్ మాసం ప్రారంభం కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉపవాసాలు కొనసాగుతుండడంతో ముఖ్యంగా హైదరాబాద్‌లో పోలీసులు బందోబస్తుపై దృష్టి సారించారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ చీఫ్ జోయల్ డేవిస్ తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రార్థనా మందిరాల వద్ద ఎటువంటి ఆటంకాలు కలుగకుండ చూడాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా పాతబస్తీలో అదనపు పోలీసు బలగాలను వినియోగిస్తున్నారు. ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలో పోలీసు పెట్రోలింగ్‌ను పెంచారు. రాత్రి వేళల్లో ఎస్‌హెచ్‌ఒలు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెంచాలని కూడా సూచించారు. మత ఘర్షణలకు తావు లేకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా చౌరస్తాల వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే పాత నేరస్తుల కదలికలపై ఆరా తీయాలన్నారు. రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు అనుమానిత ప్రాంతాలలో బాంబ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తుండాలని ఆదేశించారు. ఆయా జిల్లాల్లో గతంలో తలెత్తిన ఇరువర్గాల ఘర్షలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో హోటళ్లు, వ్యాపార కేంద్రాల వద్ద పోలీసులు అనవసరంగా హడావిడి చేయాకుడని, సమస్యను సున్నితంగా పరిష్కరించాలని సూచించారు. చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను మోహరించారు. దీంతో పాటు నిఘా వ్యవస్థను కూడా పటిష్టపరిచారు. హైదరాబాద్‌లో పనిచేయని సుమారు 40 శాతం పోలీసు సిసికెమెరాలను వినయోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



## డిజిపి కార్యాలయంలో ఘనంగా శ్రీపాదరావు జయంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను అధికారిక కార్యక్రమంగా డిజిపి కార్యాలయంలో ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిజిపి కార్యాలయ ముఖ్య భద్రతాధికారి సి.హెచ్.యోగేశ్వర్ రావు, శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డిజిపి కార్యాలయ సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాతృభాషలో విద్యలేదు

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. వివిధ దేశాలలో మాతృభాషను ప్రోత్సహించేందుకు యునెస్కో చేస్తున్న కృషిని నివేదిక వివరించింది. ప్రపంచవ్యాప్తంగా మాతృభాషలను సంరక్షించి, ప్రోత్సహించేందుకు చిత్తశుద్ధితో యునెస్కో చేస్తున్న కృషికి ఇది రజతోత్సవ సమయమని పేర్కొంది. భారతదేశంలో బహుభాషా విద్యావిధానాన్ని ప్రోత్సహించే నూతన విద్యా విధానం (ఎన్ఇపి) అమలు ప్రక్రియ సమయంలో ఈ నివేదిక విడుదలైనట్లు పేర్కొంది. ఐతే భారత ప్రభుత్వం అమలు చేస్తున్న త్రిభాషా సూత్రానికి కొన్ని రాష్ట్రాలలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. బోధనాసిబ్బందికి సామర్థ్యం పరిమితంగా ఉండటంతోపాటు మాతృభాషలో విద్యను అందుబాటులో ఉంచడానికి తగినన్ని ఉపకరణాలు అందుబాటులో ఉండటంలేదని, వివిధ సమూహాల నుండి కూడా ప్రతిఘటన ఎదురవుతోందని దీనివల్ల అమలు చర్యలకు సవాళ్ళు ఎదురవుతున్నాయని జెమ్ బృందం పేర్కొంది. అతి తక్కువ, మధ్యస్థంగా ఆదాయాలు ఉండే దేశాలలో ఈ సంఖ్య 90 శాతానికి పెరుగుతోందని, 100 కోట్లమంది విద్యార్థులలో పాతికకోట్ల మందికిపైగా విద్యార్థులు తమకు అర్థమయ్యేభాషలో విద్యను నేర్చుకోలేకపోతున్నారని తెలిపింది. బహుభాషలలో విద్యను నేర్పే విధానాలను ప్రభుత్వాలు అమలు చేయాలని, విద్యాభ్యాసం చేసేవారందరికీ లాభం కలిగేవిధంగా అభ్యాసం చేసే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని హితవు చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా వలసలు పెరుగుతున్నాయనీ, భాషాపరమైన వైవిధ్యం ఒక ప్రపంచ వాస్తవికతగా మారుతున్నదనీ,భిన్నభాషలకు చెందిన విద్యార్థులతో తరగతి గదులు నిండి ఉండటం అత్యంత సాధారణ విషయంగా మారిందని, ఇళ్ళువదిలి, స్వదేశాలు వదిలి నిరాశ్రయులైన 3.10 కోట్ల మంది విద్యార్థులు విద్యార్జన సందర్భంగా అనేక ఆటంకాలు ఎదుర్కొంటున్నారని నివేదిక వెల్లడించింది. "ఈనాడు ప్రపంచదేశాలలో 40 శాతం మందికి మాతృభాషలో విద్య అందుబాటులో లేదు, వారు చాలా స్పష్టంగా మాట్లాడుతూ, అర్థం చేసుకోగలిగిన భాషలో విద్యార్థులకు విద్య నేర్పడంలేదు. ఆదాయాలు తక్కువగా ఉన్న దేశాలలో ఇలాంటి విద్యార్థులు 90 శాతం పైగా ఉన్నారు. దశాబ్దాలు గడిచేకొద్దీ సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరగడం, యువకులలో సాంకేతికవిద్య తీవ్ర ప్రభావం చూపించడం, కరోనా మహమ్మారి విజృంభణ వంటివాటి వల్ల వారు గణితశాస్త్రాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారనీ,అనర్గళంగా ఏదైనా పఠనం చేయలేకపోతున్నారని, వారి అధ్యయనస్థాయిలు గణనీయంగా పడిపోయాయనీ, దీనికి భాషాపరమైన కారణాలే ప్రతికూలాంశంగా ఉందని పేర్కొంది. ఈ విధంగా రెండు గ్రూపులమధ్య అంతరం 2010–2022 మధ్యకాలంలో గణనీయంగా పెరిగిందని, ప్రధానంగా గణితశాస్త్రాన్ని అర్థం చేసుకునేవిషయంలో ఈ అంతరం బాగా పెరిగిపోయిందని నివేదిక వెల్లడించింది. పాఠశాలల్లో బోధనాభాషలో అధ్యయనం చేసేవారు ఆ భాషలోనే ఇళ్ళల్లో మాట్లాడటంలేదనీ, దీనికి అనేక కారణాలు ఉన్నాయనీ, వలసలు రావడం, చారిత్రక కారణాలు, ఇళ్ళుకోల్పోయి పరాయిపంచన తలదాచుకోవడం వంటివన్నీ విద్యార్థులు బోధనాభాషలోనే ఇంట్లోకూడా మాట్లాడటానికి, ఇంట్లో మాట్లాడేభాషలోనే పాఠాలు చదువుకోవడానికి అవకాశం ఉండటంలేదనీ, దీనివల్ల వారు అనర్గళపఠన సమస్యలు, అర్థంచేసుకునేస్థాయిల్లో భేదాలను ఎదుర్కొంటున్నారని నివేదిక పేర్కొంది. తరగతి గదిలో పాఠాలు చదువుకోవడంలో చారిత్రక, సమకాలీన సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్నారని, చాలా దేశాలలో వనరుల కొరత ప్రధాన సమస్యగా ఉందని పేర్కొంది.

**ప్రభుత్వాలకు సిఫార్సులు**

విద్యాభ్యాసంలో భాషాపరమైన విధానాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని యునెస్కో 'జెమ్' బృందం తన నివేదికలో సిఫార్సు చేసింది. భాషా పరివర్తనలో పాఠ్యాంశాలకు సంబంధించిన సర్దుబాట్లు చేసుకోవాలని, బోధన, అభ్యాసపరమైన సామాగ్రిని సమకూర్చుకోవాలని కోరింది. చాలా ఎక్కువగా వలస ప్రజలు ఉన్న దేశాలలో భాషా కార్యక్రమాలకు, అర్హులైన బోధనాసిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలని, అభ్యాసం చేసేందుకు వీలుగా తగిన వాతావరణం విద్యార్థులకు ఉండాలని, విద్యార్థులందరికీ వారి వారి మాతృభాషలలో బహుముఖ అభ్యాసాలకు వీలు కల్పించాలని సిఫార్సు చేసింది. బహుభాషలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంవల్ల అటు ఇంట్లో ఇటు బయట నైపుణ్యసాధనకు వీలు కలుగుతుందని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు, బోధనాసిబ్బంది, పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలు అందుబాటులో ఉండాలని పేర్కొంది. తరగతి గదుల వెలుపల కూడా విద్యార్థులకు బలమైన భాషాపరమైన మద్దతు ఉండాలని పేర్కొంది.

# అడ్డుకున్న ఇజ్రాయెల్

(మొదటి పేజీ తరువాయి)

హమాస్ కోరింది. అంతకుముందు గురువారంనాడు ఖతార్ నుండి వచ్చిన మధ్యవర్తులతో ఇజ్రాయెల్ ప్రతినిధులు కైరోలో రెండోదశ సంప్రదింపులకు కూర్చున్నప్పటికీ ఎలాంటి ఫలితాలు రాలేదని శుక్రవారం నాడు ఈజిప్టు ప్రభుత్వ సమాచారశాఖాధికారులు ప్రకటించారు. మొదటి దశ కాల్పుల విరమణ ఒప్పందం శనివారంతో ముగిసిందనీ, రెండోదశ ఒప్పందంపై ఎలాంటి చర్చలూ జరగలేదని హమాస్ అధికార ప్రతినిధి హజమ్ ఖాసిమ్ చెప్పారు. మానవతాసహాయాన్ని అడ్డుకోవడంద్వారా చౌకబారు బ్లాక్‌మెయిల్‌కు ఇజ్రాయెల్ పాల్పడుతోందని విమర్శించారు. రెండోదశ కాల్పుల విరమణ ఒప్పందంపై సంప్రదింపులు జరగకపోవడానికి ఇజ్రాయెలే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. మొదటిదశ ఒప్పందం అమలు సమయంలో ట్రంప్ చెప్పినవిధంగా మూడు దశల ఒప్పందాన్ని కొనసాగించాలని నేతన్యాహూ కోరిన తర్వాత హమాస్ ఈ ప్రకటన చేసింది. మొదటిదశలో బందీలు–ఖైదీలు విడుదల, రెండోదశలో సైన్యం ఉపసంహరణ, మూడోదశలో గాజా పునరుద్ధరణ, అభివృద్ధిని అమెరికా ప్రతిపాదించింది. అమెరికా పాలనాయంత్రాంగంతో సమన్వయ సంప్రదింపుల్లో ఉన్నామనీ, అందుకు అనుగుణంగానే గాజాలోకి ప్రవేశించే మానవతా సహాయాన్ని అదివారం నుండి అడ్డుకున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఇజ్రాయెల్ అధికారి ఒకరు చెప్పారు. ఐతే దీనిపై వాషింగ్టన్ తక్షణం ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. ప్రస్తుత ఒప్పందాన్ని తప్పుతోవ పట్టించాలని ఇజ్రాయెల్ ప్రయత్నం చేస్తోందని హమాస్ విమర్శించింది. ఇప్పటికీ హమాస్ తనవద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీలను ఇంకా విడుదల చేయాల్సి ఉంది. ఇజ్రాయెల్ కూడా పాలస్తినా ఖైదీలను విడుదల చేయాల్సి ఉంది. ఇజ్రాయెల్ వాదన ప్రకారం హమాస్ వద్ద ఇంకా 59 మంది ఇజ్రాయెల్ పౌరులు బందీలుగా ఉన్నారు. కానీ వీరిలో కేవలం 24 మంది మాత్రమే సజీవంగా ఉండి ఉంటారని ఇజ్రాయెల్ భావిస్తున్నది. ఏ క్షణంలోనైనా యుద్ధానికి సైన్యాన్ని సిద్ధంగా ఉంచామని ఇప్పటికే నేతన్యాహూ ప్రకటించడంతో గాజాలో పాలస్తీనియన్లు తీవ్ర భయాందోళనలో ఉన్నారు.

**రంజాన్ పూర్తయేవరకూ గాజాలో తాత్కాలికంగా కాల్పుల విరమణ**

గాజాలో పాలస్తినా ప్రజలు రంజాన్ పాటిస్తున్నారు. యూదుల పవిత్ర మాసం సందర్భంగా ప్రజలు ఉపవాసాలు, ప్రార్థనలు చేస్తున్నారు. దీంతో అమెరికా కొత్త ప్రతిపాదన ప్రకారం తాత్కాలికంగా కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ ప్రకటించారు. మధ్యాసియాలో అమెరికా అధికార దూత స్టీవ్ విట్‌కాఫ్ చేసిన కొత్త ప్రతిపాదన ప్రకారం రంజాన్ పూర్తయ్యేవరకూ కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ పేర్కొంది. ఐతే ఈ రంజాన్ పవిత్రమాసంలో ముస్లింలు ఉదయం నుండి సాయంత్రం వరకూ పచ్చి మంచినీళ్ళుకూడా తాగకుండా ఉపవాసాలు చేస్తారు. ఏప్రిల్ 20వ తేదీనాటితో యూదుల పవిత్రమాసం ముగుస్తుంది. కొత్త ఒప్పందం ప్రకారం హమాస్ సగానికి సగంమంది బందీలను విడుదల చేయాలి. మిగిలినవారిని శాశ్వత ఒప్పందం చేసుకున్న తర్వాత విడుదల చేయాల్సి ఉంటుంది. రెండోదశ కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలకు ఇజ్రాయెల్ సిద్ధంగా ఉందనీ, తాత్కాలిక ఒప్పందం ప్రకారం సగంమంది బందీలను విడుదల చేయాలన్న విషయంలో ఆటంకాలు ఎదురయ్యాయనీ విదేశాంగమంత్రి గిడియాన్ సార్ చెప్పారు. కొత్త ప్రతిపాదనను హమాస్,ఈజిప్టు రెండూ తిరస్కరించినట్లు ఈజిప్టు అధికారులు చెప్పారు. యుద్ధం పూర్తిగా ముగిసిపోకుండా మిగిలిన బందీలను అప్పగించేందుకు తాము సిద్ధంగా లేమని హమాస్ పేర్కొంది. బందీలను విడుదల చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామనీ, కానీ రెండోదశ ఒప్పందంకింద ఒకేసారి బందీలందరినీ విడుదల చేస్తామనీ, అందుకు ప్రతిగా పాలస్తినా ఖైదీలను విడుదల చేయాలని, గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు అంగీకరించాలనీ, ఇజ్రాయెల్ సైన్యాలను పూర్తిగా ఉపసంహరించాలని హమాస్ డిమాండ్ చేస్తున్నది. ఐతే మధ్యవర్తులు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. మొదటిదశ కాల్పుల విరమణ ఒప్పందం కింద హమాస్ ఇప్పటివరకూ 25 మంది ఇజ్రాయెలీ బందీలను విడుదల చేసింది. ఎనిమిది మంది బందీల మృతదేహాలను స్వాధీనం చేసింది. ఇజ్రాయెల్ కూడా దాదాపు 2,000 మంది పాలస్తినా ఖైదీలను విడుదల చేసింది. ఐతే ఈ మొదటిదశ కాల్పుల విరమణ ఒప్పందంలో అనేక ఒడిదొడుకులు ఎదురయ్యాయి. పరస్పర ఉల్లంఘనలకు పాల్పడ్డారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com